SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 5
October-2022, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

అక్టోబరు 2022

వెల రూ. 20/-

పుటలు-56



01-10-2022
శనివారం
రాత్రి: గరుడవాహనం

## తిరుమల తిరుపతి దేవస్థానములు

శ్రీవేంకటేశ్వరస్వామివారు కొలువైన తిరుమల ఆలయంలో స్వామివారికి రోజువారీ నిర్వహించే అన్నిరకాలసేవలను నమూనా ఆలయంలో 2022, ఆగష్టు 16 నుండి 20వ తేదీ వరకు భక్తులందరూ వీక్షించే విధంగా ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరుజిల్లా, ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన శ్రీవేంకటేశ్వరవైభవోత్సవ దృశ్యాలు. ఈ కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, న్యూఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.
















# గీతాశ్లోకార్థసారం

శ్లో : అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥

శ్లో : సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదక క్రియాః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 41, 42వ శ్లోకాలు)

**ప్రతిపదార్థం:** కృష్ణ= ఓ కృష్ణా!; అధర్మాభిభవాత్=అధర్మం వృద్ధినొందుటవల్ల; కులస్త్రియః= కులస్త్రీలు; ప్రదుష్యన్తి= చాల చెడిపోవుదురు; వార్ష్ణేయ= వృష్ణివంశీయుడవగు ఓ కృష్ణా!; స్త్రీషు దుష్టాసు= స్త్రీలు చెడినచో; వర్ణసంకరః= వర్ణసంకరం; జాయతే=కలుగుచున్నది; సంకర=(వర్ణ) సంకరం, కులఘ్నానాం= కులాన్ని జెఱిచినవారికిని; కులస్యచ=కులమునకును; నరకాయైవ= నరకము కొఱకే (యగును); ఏషామ్= వీరియొక్క; పితరః= పితృదేవతలు; లుప్తపిణ్డోదకక్రియాః= పిండోదకక్రియలు (శ్రాద్ధములు, తర్పణాలు) లేనివారై; పతన్తి= అథోగతిని పొందుతారు.

**భావం:** ఓ కృష్ణా! అధర్మం వృద్ధినొందుటచే కులస్త్రీలు చాల చెడిపోవుదురు. స్త్రీలు చెడిపోవుటచే వర్ణసంకరమేర్పడుతుంది. అట్టి వర్ణసంకరం వల్ల సంకరముచేసినవారికి, సంకరమునొందినకులానికి గూడ నరకం సంప్రాప్తిస్తుంది. వారి పితృదేవతలు శ్రాద్ధాలు, తర్పణాలు, లేనివారై అథోగతిని పొందుతారు.

---

## మొరసె దేవదుందుభి మోఁతలెల్లను

గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బైపై సేవించను

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చర లెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁ గ శ్రీవిభుని పెండ్లికిని.

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమైమించిన దేవదేవుని పెండ్లికిని.

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదే తలఁ బాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
సేసలు వెట్టినయట్టిసింగారపు పెండ్లికి.

(సంపుటం-3, సంకీర్తన-21)




*పెళ్లిసమయంలో శ్రీవేంకటాచలపతి అలమేలుమంగ ఒకరిపై ఒకరు సేసలు పోసుకుంటున్నారు. గరుడపతాక కనులపండువుగా రెపరెపలాడుతున్నది. యాత్రికబృందం కల్యాణోత్సవం సేవించడానికి వచ్చిచేరింది. సరస్వతి, పార్వతి సోబానపాటలు పాడారు. రంభాది దేవవేశ్యలు నాట్యం చేశారు. దేవతలందరు గుంపులుగుంపులుగా శేషాద్రికి చేరుకున్నారు. స్వర్గంనుంచి పూలజల్లు కురిసింది. అంతటా దేవతలనగారాలు మ్రోగిపోయాయి. సకలవిధ సంపదలు కొండచరియలుగా వ్యాపించాయి. హుండీలు భక్తులకానుకలతో నిండాయి, పుణ్యస్త్రీలు పద్మావతీ శ్రీనివాసులకు తలంబ్రాలుపోశారు అని అన్నమయ్య అలమేలుమంగా శ్రీనివాసుల పెండ్లిసంబరాన్ని పై సంకీర్తనలో వర్ణించాడు.*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# విజ్ఞప్తి

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.

తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న 'సప్తవర్ణ' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

## 'సప్తగిరి' పత్రిక వెలలో మార్పు

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన అనుభూతిని పొందండి.

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రికకు చందా కట్టండి.



శ్రీవారి అక్షర ప్రసాదాన్ని నెలనెలా అందుకోండి.



# సప్తగిరి



ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషలు)

..... చందా వివరాలు ......

విడిప్రతి: రూ.20/-

సంవత్సరచందా: రూ.240/-

జీవితచందా (12 సం॥లకు మాత్రమే): రూ.2400/-

విదేశాలకు సంవత్సరచందా: రూ. 1030/-

వెలలో మార్పు సెప్టెంబరు, 2022 నుండి అమలులోకి వచ్చింది.
నూతన చందాదారులకు మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.

వివరాలకు:

ప్రధాన సంపాదకుడు, తి.తి.దే. ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి - 517 507.

ఫోన్: 0877-2264363, 2264543.



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 అక్టోబరు, 2022 సంచిక : 05


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| కలియుగవైకుంఠానికి కాలిబాటలు | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| వెలుగుల పండుగ | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 11 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్ | 14 |
| ఈయన సేవ... చాలాప్రత్యేకం!! | డా॥ ఆకెళ్ల విభీషణశర్మ | 15 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| స్వామిచేత తాతా! అని పిలిపించుకున్న మహాభక్తుడు!! | ఆచార్య కోసూరి దామోదరనాయుడు | 18 |
| దివ్యనాయకుడి సన్నిధిలో.. దీపావళి | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 20 |
| సూర్యచంద్రులున్నంత వరకూ.. కీర్తి శాశ్వతం | శ్రీ పసుమర్తి బద్రీనాథ్ | 21 |
| ఈయన చెబితే.. ఆయన 'సరే' అంటారు | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 23 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 24 |
| ఈ బ్రహ్మోత్సవాలలో... ఎన్ని విశేషాలో! | 'సారస్వతకళానిధి' డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 25 |
| తిరుక్కండియూర్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 26 |
| బంగారుతల్లి! | శ్రీ ఎస్.కె. సైదా | 31 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 34 |
| కైలాసనివాస అర్హత కావాలంటే... | డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు | 35 |
| శ్రీవేంకటాద్రి మీద శ్రీరామ! | డా॥ సూరపరాజు వసంతకుమారి | 36 |
| నవరాత్రులు నవాన్ననైవేద్యాలు | డా॥ జి.వి.పూర్ణచందు | 37 |
| నమ్మాలేకానీ, స్వామిచేయని సాయం ఉంటుందా? | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 41 |
| తాళ్లపాకపదవాఙ్మయ పరిష్కరణలో.. గౌరిపెద్దిరామసుబ్బశర్మ! | ఆచార్య కె.సర్వోత్తమ రావు | 42 |
| దసరా వచ్చిందయ్యా..! | డా॥ సుబ్బలక్ష్మి మర్ల | 44 |
| శ్రద్ధలేని పని వృథా... | శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 46 |
| వచ్చినవాడు ఫల్గుణుడు (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (03) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి గరుడసేవ (తిరుమల)
వెనుకచిత్రం : చక్రస్నానం (తిరుమల)


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా(12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333

వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# దీపం మాట్లాడుతుంది!

దీపం మాట్లాడుతుంది. దాని భాష వెలుగు. దాని యాస కాంతి. దాని ఊసు క్రాంతి. దాని గమ్యం శాంతి. అందుకే మనం దేవుళ్లను స్మరించే ముందు దీపాల్ని వెలిగిస్తాం. 'అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ అనే ప్రార్థన వెనుక అసలు అర్థం బతుకులో చీకటిని జ్ఞానమనే వెలుగులో తరిమికొట్టడమే.

గుప్పెడునక్షత్రాల కోసం సాయంత్రమయ్యే సరికి సూర్యుడిని పడమటికొండలకు తాకట్టు పెడుతుంది ఆకాశం. జరిగిన ద్రోహానికి ముఖాన్ని కందగడ్డలా చేసుకుని సూర్యుడు నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాడన్న మాటే గానీ ఎంతసేపు? కొన్నిగంటల తర్వాత అదేకోపాన్ని అనుకూలంగా, మళ్లించుకుని ఎర్రగానే నిద్రలేచి ఎల్ల జగతినీ వెలిగిస్తూ మధ్యందిన సమయానికి మహా వెలుగౌతాడు సూర్యుడు. జీవితంలో ప్రతివ్యక్తీ ఓ సూర్యుడు. జయాపజయాలనే ఉదయాస్తమయాల మధ్య మానవ సూరీడు పరిభ్రమించే ఆకాశం పేరు ఇక్కడ అవకాశం.


ఈ అవకాశం సూర్యుడికి చెల్లుతుంది గానీ, మనిషికి చెల్లదు. అందుకే దీపావళి వంటి పండుగ. ఆ రాత్రి తన ప్రయత్నాలనే ప్రమిదలలో ఆశ అనే వత్తి వేసి, ఆశయం అనే చమురు పోసి ఆర్తిగా వెలిగిస్తాడు. తనలో దాగివున్న, తొక్కివేయబడ్డ కోపతాపాలనూ, పగ, ప్రతీకారాలనూ బాణా సంచా వెలిగించి వాటి పేలుడు విని, వాటి కాలుడు చూసి మానసికంగా సేద తీరుతాడు. తనలోని ప్రతికూలస్పందన లన్నిటినీ ఆ రోజు బాణాసంచావస్తువుల్లో నింపి వాటిని తగులబెట్టి తాను చల్లబడ తాడు. తన లోపలి శబ్దాలనూ, లోలోపలి వెలుగులనూ, ఆ రాత్రంతా బయటకు తెస్తాడు. దీపావళి పండుగ వెనుక ఉన్న పరమార్థం ఇదే! ఏడాదికొకసారైనా మనసుని వెలిగించుకుని ఏడాదిగా కమ్మిన చీకట్ల నుంచి విముక్తుడవుతాడు. దీపావళి గొప్ప మానసికవిలువ ఉన్న పండుగ. దీపావళిని ఓ పండుగగానే గాక సామాజిక, నైతిక, ఆర్థికకోణాల నుంచికూడా పరిశీలిస్తే ఆశ్చర్యపోతారు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతత బాగా పెరుగుతుంది. కారణం దీపావళి పండుగ కొందరికి ఓ ఆర్థికోత్సవం. లక్ష్మీపూజ జరిపి ఆ తర్వాతి కాలానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకుంటారు. క్రమశిక్షణతో ఎదగాలన్న స్ఫూర్తి నిదర్శనం దీపావళి! ప్రతి పండుగ వెనుక ఓ వైజ్ఞానికదృక్పథం ఉంటుంది. మానసిక, వ్యక్తిత్వ ఎదుగుదలకు ప్రేరణ ఉంటుంది.

ఈ దీపమహోత్సవసమయంలో చెప్పేది ఒక్కటే. జీవితంలో అన్నీ ఎత్తుపల్లాలే ఉండవు. రెండు విపరీత ఉద్వేగాల నడుమ రెండు అవును-కాదుల నడుమ, రెండు లాభనష్టాల మధ్య, రెండు పాపపుణ్యాల మధ్య ఓ మధ్యస్థరేఖ ఉంది. అదే సంయమనం. అదే సంతులనం. అదే సిసలైన జీవితం. ఈ భూమధ్యరేఖ పై నిలబడి చూడండి. జీవితంలో వెలుతురు ఎన్నటికీ అస్తమించని అపూర్వ స్థితిని అనుభవిస్తారు. దాన్ని సమ్యక్‌దృష్టి, అంతర్దృష్టి అని ఎలాగైనా పిలువవచ్చు.

దీపావళికి ఉన్న పేర్లు ఎన్ని అయినా, దాని భాష మాత్రం నిశ్చయంగా వెలుతురు! ఆ వెలు తురు జలతారుతో మీ జీవితం మరింత దేదీప్యమానం కావాలని మనసారా అభిలషిస్తూ, ఆ శక్తి తిరుమల శ్రీవారు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

# కలియుగవైకుంఠానికి కాలిబాటలు


– డా|| కంపల్లె రవిచంద్రన్,
98487 20478



తమిళంలో 'మలై' అంటే కొండ. తిరు అనేది పవిత్రవాచకం. మంగళార్థకం. కాగా తిరుమలై అనడాన్ని మంగళప్రదమైన, పవిత్రమైన కొండ అనవచ్చు. శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న కొండ 'తిరుమల'. ఈ కొండను తిరుమలకొండ అన్నా ఒక కొండ కాదు. ఏడుకొండల సమాహారమే తిరుమల కొండ. తిరుమలలో అనుదినం సుప్రభాత సమయంలో శ్రావ్యంగా గానం చేసే ప్రతివాదిభయంకర అణ్ణన్ స్తవంలో 'శ్రీశేషశైల గరుడాచల' అనే శ్లోకంలో కొండల పేర్లున్నాయి. తిరుమల వైష్ణవాలయంకావడం, దక్షిణాది వైష్ణవంలో తమిళశబ్దాల ప్రాచుర్యం ఎక్కువకావడం, ఆళ్వార్ల పాశురాలలో తిరుమలప్రసక్తి ఉండడంతో 'తిరుమల' శబ్దానికే ప్రసిద్ధి. దిగువ తిరుపతిని అన్నమయ్యసంతతివారు 'శ్రీపతిపురమని' తమ సంకీర్తనల్లో పేర్కొన్నారు.

భారతదేశంలోని ఆలయాలు రకరకాలు. గుహాలయాలు, పర్వతాలయాలు, వనాలయాలు, తీరప్రాంత ఆలయాలు, అరణ్యాలయాలు అని విభజించుకుంటే తిరుమల పర్వతాలయాలవర్గంలో చేరేదే. ఈ ఆలయం చేరుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. అందరికీ తెలిసినవి, వాడుకలో ఉన్నవి అలిపిరి మార్గం, శ్రీవారి మెట్టుమార్గం మాత్రమే. కొందరికి మాత్రం తెలిసింది అన్నమయ్యమార్గం. శ్రీవేంకటాచలమాహాత్మ్యంలోనిది బిలమార్గం.

'బిల'శబ్దానికి కొండ బిలం, రంధ్రం అని నిఘంటువులు అర్థాలు చెప్పాయి. తిరుపతిలోని శ్రీకపిలేశ్వరాలయం నుండి కొండ చేరుకోవడానికి మరీ పురాతనకాలంలో జలమార్గమొకటే శరణ్యం. ఈ బిలమార్గప్రసక్తి తరికుండ వెంకమాంబ శ్రీవేంకటాచల మాహాత్మ్యం పంచమాశ్వాసంలో కనిపిస్తోంది. తొండమాన్ చక్రవర్తి ఈ బిలమార్గంద్వారా తిరుమల చేరుకుని, శ్రీవారితో సంభాషించేవాడని పురాణాలు చెబుతున్నాయి. తొండమాన్ చక్రవర్తి రాత్రివేళ నిర్భయంగా తిరుమలకు చేరుకునే వాడని చెప్పడంవల్ల ఆమార్గం సర్వజనరక్షకం, భీతిరాహిత్యమని చెప్పవచ్చు. అంతేకాదు. వకుళమాత, స్వామివారి మనసు అర్థం చేసుకుని పెళ్లి పెద్దగా కొండ దిగి శ్రీకపిలేశ్వరస్వామిని సేవించి వెళ్లిన వైనాన్ని కూడా శ్రీవేంకటాచల మాహాత్మ్యం విశదం చేసింది. ఇప్పటికీ స్థానికులు కపిలతీర్థం దగ్గర గల ఒక ప్రదేశాన్ని చూపిస్తూ "ఇదే బిలమార్గం" అని చెబుతుంటారు.



**వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండేనాస్తికించన, వేంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి– అన్న శ్లోకానికి ఉన్న పరమార్థం ఈ ప్రకృతిశోభతో పరిఢవిల్లిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానం కాలినడకన వెళ్లి, స్వామివారిని దర్శించుకునే అశేషభక్తకోటికి తమవంతు సహాయసహకారాలను అందించాలనే సదాశయంతో స్వామి వారి దర్శనానికి సంబంధించిన అనేక ఉపయోగితా కార్యక్రమాలను భక్తులకు అందిస్తోంది.**

రెండవది 'అలిపిరి' మార్గం. 'అలిపిరి' శబ్దానికి రకరకాల వ్యాఖ్యానాలున్నాయి. అడిప్పడి – సోపానమార్గానికి తొలిమెట్టు అని ఒక అర్థమైతే, 'అడిప్పులి' కొండదిగువ భాగాన పెద్దచింతచెట్టు ప్రాంతమని మరొక సమన్వయముంది. ఏదేమైనా ప్రస్తుతానికి సోపానమార్గం మొదలయ్యే ప్రదేశానికే 'అలిపిరి' అని వ్యవహారనామం. ఈఅలిపిరిమార్గం అన్నమయ్యకాలంనాటికే సుప్రసిద్ధం. అన్నమయ్య మనమడు అన్నమాచార్య చరిత్రలో తాత వెళ్లిన మార్గాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఈమార్గంలో అన్నమయ్య దర్శించిన స్థలాలు, పౌరాణిక, చారిత్రక అనుబంధం గల ప్రదేశాలకు కీర్తనల సాక్ష్యాలుండడం విశేషం.

'అదెచూడు తిరువేంకటాద్రి' అనే సుదీర్ఘసంకీర్తనలో పెద్ద ఎక్కుడు, పల్లవరాయనిమఠము, అవ్వచరికోన, మోకాళ్ల ముడుపులు, త్రోవభాష్యకారుల ప్రసక్తి ఉంది. మోకాలిమిట్ట దగ్గర అలసిసొలసిన అన్నమయ్యను అలమేలుమంగ వాత్సల్యంతో చేరదీసి ప్రసాదాలిచ్చినట్లు, చెప్పులకాళ్లతో నడువరాని సంప్రదాయవిధిని చెప్పినట్లు ఆధారాలున్నాయి. నరసింహదేవాలయం దర్శించిన తర్వాత బస్సులుపోయేమార్గంలో భక్తులు ప్రస్తుతం వెళుతున్నారు. కానీ, నరసింహ దర్శనానంతరం ప్రాచీనమైన మరోమార్గం, మోకాలిమిట్ట వైపు కలిసే మార్గం ఒకటి ఉంది. తి.తి.దే. ఆ మార్గాన్ని చక్కగా తీర్చిదిద్దింది. ప్రాకృతిక సౌందర్యవీక్షకులకు ఆ మార్గం కనులవిందు. ఈ మార్గంలోనే అన్నమయ్య నడిచాడని అంటారు.

పాత కడపజిల్లా వాస్తవ్యులు వనాల మార్గంలో తిరుమలకు వచ్చేవారని, ప్రత్యేకించి తుంబురుతీర్థదర్శనానికి గుంపులు గుంపులుగా వచ్చేవారని ఆ మార్గమే అన్నమయ్య మార్గమని అధికారులకు ఆధారపూర్వకంగా తెలియడంతో ప్రస్తుత తి.తి.దే. పాలకమండలి ఆ మార్గాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. తిరుపతిజిల్లా రేణిగుంట మండలం మామండూరు నుంచి తిరుమల పార్వేట మండపం వరకు 23 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గం అభివృద్ధి చేయాలని



ప్రస్తుత తి.తి.దే. పాలకమండలి సంకల్పించింది. తిరుమలదర్శనం కోరేవారికి తి.తి.దే. ఇచ్చే భరోసా సత్యనిష్ఠం. అన్నమయ్య సంకీర్తన, 'సందేహమెక్కడా లేదు. సంతోషించుకొంటి నేను' ఒక సాక్ష్యం.

తిరుమలను చేరుకోవడానికి మరో మార్గం శ్రీవారిమెట్టు మార్గం. 'శ్రీవారు' అనే పదం మరే వైష్ణవాలయాలలో లేదు. శ్రీవారి సేవలు శ్రీకైంకర్యం, శ్రీవారిసేవలాంటివి ఎక్కువగా వినబడేది తిరుపతి తిరుమల లోనే. ఈ పేరు రావడానికి చాలా కారణాలున్నాయి. మొదటిది భృగుమహర్షి శ్రీమహావిష్ణువు వక్షఃస్థలం మీద తన్నాడట. విష్ణువు కోపగించకుండా భృగుమహర్షి పాదాలు పట్టుకుని వాటికి ఎంత నొప్పి కలిగిందోనని సేవలు చేశాడట. ఇవన్నీ చూస్తున్న శ్రీమహాలక్ష్మికి కోపం వస్తుంది. తన స్థానాన్ని ఎవరో ఒకరు తన్నడం తనకు జరిగిన అవమానంగా భావించింది. వెన్నుని చేతలు ఆతల్లికి నచ్చలేదు. కోపంతో వైకుంఠం వదలి కొల్హాపురానికి వెళ్లిపోయింది.

శ్రీవేంకటేశ్వరుడు పద్మావతిని పెళ్లాడాక ఆమె అనుమతితో శ్రీమహాలక్ష్మిని ప్రసన్నురాలిగా చేసుకోవడానికి కొల్హా పురం వెళ్లాడు. అక్కడ లక్ష్మి లేదు. ఆకాశవాణి ప్రబోధంతో తిరుచానూరుకు వచ్చి లక్ష్మికోసం ఇరవై రెండేళ్లు తపస్సు చేస్తే లక్ష్మి ప్రసన్నురాలైందని తరిగొండ వెంగమాంబ శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో వర్ణించింది.

పద్మావతిని పెళ్లాడాక నారాయణవనం నుండి అప్పలాయగుంట మార్గంలో కదలి అగస్త్యమహర్షిని సందర్శించి ఆ మహర్షి ఆనతో ఆరునెలలు గడిపి ఆపై తిరుమల చేరుకున్నాడని ఐతిహ్యం. శ్రీతో కలిసి తిరుమల చేరుకోవడంవల్ల 'శ్రీవారు' అయ్యారు. లోకంలో శ్రీ ఉన్నవారినే గౌరవిస్తారు. శ్రీకోసం తపస్సు చేసినవాడు శ్రీ పద్మావతితో తిరుమల చేరుకున్నవాడు కావడంతో శ్రీవారి మెట్టుగా ప్రఖ్యాతి గడించింది. ఈ మార్గం ప్రసిద్ధి కావడానికి విజయనగరరాజులు 'చంద్రగిరి' దుర్గంలో వసించడం. చంద్రగిరినుండి తిరుమల చేరుకోవడానికి ఈ మార్గం సునాయాసం, క్షేమకరం. వేదపండితులు ఈ మార్గం ద్వారా తిరుమల వెళ్ళేవారు.

తెలతెలవారుతుండగా శ్రీవారిమెట్టుకు చేరితే ఒక మనోహరదృశ్యం. ఎదురుగా ఎత్తైన కొండ. ఇరువైపులా ఎత్తయిన చెట్లతో నిండిన దారి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అడవిలో చెట్లపై రకరకాల పక్షులు రెక్కలల్లారుస్తూ ఎగిరిపోతుంటాయి. వింత వింత శబ్దాలతో సాగిపోతుంటాయి. నిదురిస్తున్న లోయమధ్య నుంచి కొండెక్కుతుంటే గలగలాపారే సెలఏటి శబ్దాలకు తోడు రకరకాల పక్షుల పలకరింపులు. చల్లని కొండగాలి.

ఈమార్గంలోని 'ఆంజనేయుడు' దర్శనీయుడు, వరప్రదాత, శ్రీవారిమెట్టు దగ్గర్లో వైష్ణవయతుల స్నానపానాదుల కోసం ఒక రమణీయమైన నడబావి కూడా ఉంది. ఆ బావి రాతిస్తంభాలమీద అళ్వారుల శిలాచిత్రాలున్నాయి. అలాగే శ్రీవారి మెట్టుదగ్గర స్వామివారి పాదచిహ్నాలున్నాయి. ఒకప్పుడు తిరుమలకు చంద్రగిరినుండే వస్తువులరవాణా జరిగేది. ఇటీవల ఈ ప్రాంతం అభివృద్ధికావడంతో తి.తి.దే. సోపాన మార్గాన్ని ఫలవంతం చేసింది. నిరుడు వర్షాలవల్ల సోపాన మార్గం దెబ్బ తింటే తి.తి.దే. ఆఘమేఘాలమీద పునరుద్ధరణ ఈ సంవత్సరం చేసి మే నెల 5వ తేదీ నుండి భక్తులు వెళ్లడానికి సుగమం చేసింది. అలాగే అలిపిరిమార్గం దెబ్బ తిన్నప్పుడు, పునరుద్ధరణ చేసేవేళ నడిచి వెళ్లేవారికి అనువుగా ఉచితబస్సుల సౌకర్యం కల్పించింది. ఈశ్రీవారిమెట్టుమార్గంలో తి.తి.దే. అలిపిరిమార్గంలోలాగే అన్ని సౌకర్యాలు అందివ్వడం ప్రశంసార్హం. భక్తులు శ్రీనివాసమంగాపురం ప్రాంతం లోనే తలనీలాలు సమర్పించడానికి కల్యాణకట్ట కూడా ఏర్పాటు చేసింది.

ప్రకృతికి, పరమాత్మకు అవినాభావసంబంధముంది. మనదేశంలో చాలా వరకూ ఆలయాలన్నీ పర్వతశిఖరాల మీద, కొండకోనలనడుమ, పుణ్యతీర్థతీరాల్లో వెలసినవే. మన ఋషులు, ఆధ్యాత్మికభావానికి విశాలమైన పరిధిని సృష్టించారు. ఈ పద్ధతిలో కేవలం భక్తిభావనే గాకుండా ప్రకృతి ఆరాధన, శారీరకశ్రమ, పరిశుద్ధ ప్రాణవాయువు, ఓషధులసేవనం మనోవికాసంలాంటివన్నీ భక్తులకు చేకూరడానికి వారు వేసిన ఒక అజ్ఞాతప్రణాళిక.



సప్తగిరులపై వెలసిన శ్రీవేంకటేశ్వరుని వైభవం సుందరమైన వనసంపదతో, పవిత్రమైన పుణ్యతీర్థాలతో, శోభిల్లుతూ ఉండడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఇక కలియుగప్రత్యక్షదైవమైన స్వామివారి భక్తవత్సలత కూడా నిరుపమానం. కాలినడకన వెళ్లేటప్పుడే భక్తుల సామగ్రి క్షేమంగా కొండపైకి చేరవేత, కొరత లేకుండా మంచినీటిసౌకర్యం, శీఘ్రగతిన దర్శన సౌకర్యం లాంటి ఎన్నో సదుపాయాల్ని సమకూర్చుతోంది.

ఆధునికనాగరకత మనుషులకు సర్వసదుపాయాలూ కల్పించడంవల్ల, వాళ్లు అటు శారీరకశ్రమకు, తద్వారా ప్రాప్తించే దృఢమైన ఆరోగ్యసంపదకు దూరమైపోతున్నారు. నగరాలలోని కాంక్రీటువనాలలో బ్రతుకుతూ యాంత్రికజీవితం గడుపుతున్న వారందరూ ప్రకృతిసౌందర్యాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. స్వామివారి సందర్శనానికి కాలిబాటలో నడిచి చేరుకోగల శారీరకధారుఢ్యం ఉన్నవారు మాత్రమే, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. మెట్లదారి వెంబడి కలియుగ వైకుంఠానికి నడిచివెళ్లే భక్తులకు ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహించి వెళ్లే కొద్దీ అంతర్లీనంగా వారిలో ఒక తెలీని ఆత్మసంతృప్తి, ఆత్మస్థైర్యం ఏర్పడుతాయనడంలో అతిశయోక్తి లేదు.


కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగంలాంటి ప్రక్రియలతో భగవంతుని కృపకు భక్తుడు పాత్రుడౌతాడు. ఈ సప్తగిరులను అధిరోహించి స్వామివారి చెంతకు చేరుకున్నప్పుడు కాయకయోగంతో ఆయనను సందర్శించిన సంతృప్తి భక్తుడికి ఏర్పడి తీరుతుంది.

*వేదాలే శిలలైన కొండ, తపస్సులే తరువులైన కొండ –* అని అన్నమయ్య వర్ణించినట్లుగా పవిత్రమైన ఈ తిరుమల శిఖరాల సౌందర్యాల్ని భక్తిభావంతో వీక్షిస్తూ, పర్వతారోహణ చేయడం శ్రీవేంకటేశ్వరుని వనసామ్రాజ్యాన్ని దర్శించుకోవడమే. ఎందుకంటే ఆయన సప్తగిరీశుడు కదా!


పాఠకులు, రచయిత(త్రు)లు, చిత్రకారులు, ఏజెంట్లు, శ్రీవారి భక్తులందరికీ....

# దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు!





దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు
అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు
ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ.....

మీ
ప్రధానసంపాదకుడు

# వెలుగుల పండుగ

– బ్రహ్మశ్రీ
డా॥ మైలవరపు శ్రీనివాసరావు

ఈ నెల 24న దీపావళి సందర్భంగా..



ప్రాచీనులెంతో దూరదృష్టి కలిగినవాళ్లు కాబట్టి, శాస్త్రం ఏంచెప్పిందో దాన్ని వాళ్లు మాత్రమే పాటించి విడిచేయకుండా, పండుగసంప్రదాయమంటూ మనకు ఏర్పాటుచేసి, ఫలాని పండుగ రోజున ఈ పద్ధతులను పాటించాలంటూ ఓ నిర్దేశాన్ని చేశారు.

ఆ దృష్టితో చూస్తే దీపావళి అనేది నరకచతుర్దశి, దీపావళి అనే రెండ్రోజుల పండుగ కాకుండా ఈ రెంటికీ వెనుక రోజు 'బలిత్రయోదశి' అనే రోజుతో కలిపి మూడురోజుల పండుగ అవుతుంది. ఆ రోజున చేయవలసిన కర్తవ్యమూ ఒకటుంది. గుమ్మంలో నిలబడి మాట్లాడుకోవడం దేనికి? పండుగలోనికి వెళ్లి పరిపూర్ణంగా ముచ్చటించుకుందాం!

## స్త్రీకి ఏది ముఖ్యం?

ఈ రోజుల్లో 'స్త్రీకి ఏది ముఖ్య?'మని ఏ స్త్రీని అడిగినా దాదాపుగా అందరూ ముందుగా 'చూడచక్కని రూపం, ధనం...' అంటూ ఇలా చెప్తారు. అయితే అందరికీ కన్నతల్లి అయిన జగదంబిక మాత్రం స్త్రీజాతిపక్షపాతిని కాబట్టి ఆమె స్త్రీకి రూపం, ధనం ముఖ్యమని చెప్పకుండా ఈ ఆశ్వయుజమాసం ద్వారా మూడింటిని అతిముఖ్యమైనవని చెప్పింది.

నక్షత్రాలన్నిటిలో మొదటిది అశ్వని. ఆ నక్షత్రం పూర్ణిమనాడుండే ఆశ్వయుజం తనకు ముఖ్యమని చెప్తూ శరన్నవ రాత్రులని ఆ కాలంలో చేయమని చెప్పింది. దీనిని బట్టి అన్నిటిలోనూ ముందుండే తనం (అశ్వని అనేది మొదటి నక్షత్రం) దీంతోపాటు లక్ష్మీఅవతారంలో తనతో పుట్టినవాడు చంద్రుడు కాబట్టి అతనితో కలిసుండే తనం (సోదరసంబంధం) అత్యంత ముఖ్యమంటోందన్నమాట.

అంతేకాదు శ్రవణానక్షత్రం పూర్ణిమనాడుండే శ్రావణ మాసం మొత్తం స్త్రీలకు పండుగరోజులని ఆదేశిస్తూ ఏ శ్రవణం తన భర్త శ్రీహరికి జన్మనక్షత్రమో ఆ కారణంగా ఇటు అన్నిటా–మొదటితనం, ఇటు సోదరసంబంధం (పుట్టినింటితో) అటు భర్తతో ఆనుకూల్యం అత్యంతముఖ్యమని జగదంబ చెప్తోంది.

వసంతనవరాత్రాల పేరిట ఉగాది రోజునుండే తన ఉత్సవాలను ప్రకటిస్తూ చక్కని పుష్ప ఫలకోకిల గానభరితమై ఉండే వసంతకాలాన్ని ఆనందించాలంటోంది ఆమె. అంటే ప్రతి గృహిణికీ తానుండే వాతావరణం (ఇల్లు) మరింత కొత్తగా ఉండేలా తగినంతలో యథాశక్తి పరిశుభ్రతని కలిగి ఉండాలంటోంది.

దేవీనవరాత్రాల్లో మొదటి పదిరోజుల్లో పార్వతీపరమేశ్వరులకు పూజ అమ్మ ప్రాధాన్యంతో సాగుతుంది కాబట్టి అన్యోన్య దాంపత్యం స్త్రీకి అన్నిటికంటె గొప్పదనీ, ఆ పిమ్మట మూలా నక్షత్రంనాడు సరస్వతీపూజ కాబట్టి రెండవస్థానం విద్యకీయాలనీ, ఈనెల చివరిరోజైన దీపావళినాడు లక్ష్మీపూజ కాబట్టి ధనానికి తృతీయప్రాధాన్యాన్నీయాలనీ పరోక్షంగా చెప్తోంది అమ్మ.

మొత్తంమీద స్త్రీకి అన్యోన్యదాంపత్యమనేది అమ్మ చేసిన తీర్మానం కాబట్టే తనను తాను ముగ్గురిగా 'పార్వతి-సరస్వతి-లక్ష్మి'గా చేసుకుని పార్వతిగా శంకరుని సగశరీరంలోనూ, సరస్వతిగా బ్రహ్మముఖంలోనూ, లక్ష్మిగా శ్రీమహావిష్ణు వక్షఃస్థలం మీదా విడువకుండా ఉండాలని నిర్ణయించుకుంది. అదుగో ఆ లక్ష్మికి సంబంధించిన దివ్యమైన పండుగే దీపావళి.

## 1) బలి త్రయోదశి

నరకచతుర్దశికి వెనుక రోజున వస్తుంది. ఈ పండుగ. మృత్యువుకు సంబంధించిన వార్తలు బాగా విన్పించే కాలం ఇది కావడంతో అందరూ కూడా తమ ఇంట అపమృత్యువు (చావుతో సమానమైన ప్రమాదాల బారినపడడం, అకస్మాత్తుగా వచ్చిన మృత్యువు, ఆత్మహత్యాప్రయత్నం...) రాకుండా ఉండేందుకై యముని పేరిట దీపాన్ని వెలిగించి దానమియ్యాలి. ఆ దీపాలను దానంచేసే త్రయోదశినే 'బలిత్రయోదశి' లేదా దీపదానత్రయోదశి అంటారు.

## 2)నరకచతుర్దశి

మనం ఈ రోజున ఈ స్థాయి ఆర్థికస్థితితో గౌరవం, పలుకుబడి, హోదాలో ఉన్నామంటే దానికి కారకులైనవారు నిశ్చయంగా మన తల్లిదండ్రులు, తాతముత్తాతలు అవుతారు. వారితోపాటు మనకో, మన పూర్వులకో తీవ్రమైన కష్టం వచ్చిన వేళ 'నీకు నేనున్నాను అండగా' అంటూ సహాయపడ్డ దేవుడిలాంటి వ్యక్తి లేదా వ్యక్తులెవరో ఒకరు జీవితంలో ప్రతి ఒక్కరికీ కొందరుంటారు. మనం తింటున్న ప్రతి అన్నపుముద్దా కూడా నాటి వారిసహాయానికి ఫలితమే.

అదుగో అలా మనను కన్న పూర్వుల పేరిటా, మనకు తల్లిదండ్రులతో సమానులవుతూ మనల్ని రక్షిస్తూ ఒడ్డునపడేసిన ఆ పెద్దల పేరిటా-పేరుపేరునా ఓ దీపాన్ని వెలిగిస్తూ ఆ దీపం వెనకున్న గొప్పదనాన్ని, సహాయాలను మన కుటుంబ సభ్యులకు వివరిస్తూ మన ఇంట్లో దైవమందిరం ముందుంచబడే దీపాలకు 'నరకదీపా'లని పేరు.

ఇలా పెద్దలకు కృతజ్ఞతాపూర్వకంగా దీపాలను వెలిగించామని తెలియజేస్తూ, దీనికి సాక్షిపూర్వకంగా ఓ దీపాన్ని వెలిగించి ఆ దీపాన్ని సమీపదేవాలయానికి సాయంకాలపు సంజవేళలో అందించాలి. ఈ దీపం వెనుక ఇంతటి నేపథ్యం ఉంది. ఇలా చతుర్దశినాడు తమ పితృదేవతల నుద్దేశించి ఎవరైతే దీపాలని పేరుపేరునా పెట్టి దేవాలయానికి సాక్షిభూతమైన దీపాన్ని అందిస్తారో ఆ కుటుంబసభ్యులకు చెందిన పితృదేవతలకు నరకబాధ ఉండదు-స్వర్గానికి ప్రయాణిస్తారు కూడా.

### ఇలాంటమ్మ ఎక్కడుంటుంది?

శ్రీహరికీ భూదేవికీ కలిగినవాడు నరకుడు. నరాన్ కాయతే- లోకంలో ప్రజలను తీవ్రంగా, శారీరకంగానూ, మానసికంగానూ హింసిస్తూ నరకుడుంటే, ఆ బాధని తట్టుకోలేని తల్లి భూదేవి పరమసహనమూర్తి తన భర్తతో మొరపెట్టుకుంది- "వీణ్ణి సంహరించి మిగిలిన ప్రజని రక్షించు!" అని.

తమతమ పుత్రుల్ని ఎంత దుర్మార్గులైనాసరే వెనకేసుకొచ్చే ధృతరాష్ట్రజనాన్నే మనం లోకంలో చూస్తాంగాని-తమపుత్రుని ప్రవర్తన సరిలేదని, అతని కారణంగా... సమాజం, గ్రామం, పట్టణం, నగరం, దేశం నాశనం కావచ్చును. కాబట్టి చంప వలసిందని ప్రార్థించే తల్లిని ఎక్కడైనా చూస్తామా? అలా కోరిన తల్లి భూదేవి మాత్రమే. అలా అంగీకరించిన తండ్రి (స్థితికర్త) రక్షకుడైన శ్రీహరి మాత్రమే.



ఈ విశేషాన్ని తెలియజేస్తూ నరకుని బొమ్మని చేసి దహింపచేస్తారు నరకచతుర్దశి రోజున. మరో విశేషమూ ఉంది. వాతావరణంలో చలి బాగా ప్రవేశించే రోజులైనందున వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఆకారణంగా నరకచతుర్దశినాటి స్నానవేళలో ఆముదపు తీగెనీ, ఆనపతీగెనీ (సొర) తలచుట్టూ (దృష్టిదోషానికై) తిప్పి విసిరివేయాలట. **(భ్రామయేత్ స్నాన మధ్యేవై నరకస్య క్షయాయ హి)** అంటే ఆనప, ఆముదాలని వాడరాదని వైద్యపరమైన విశేషమన్నమాట. తినరాని వాటిని తినవచ్చంటూ చెప్పి వైద్యం చేసే విధానం కాదు నాటి వారిది.

ఏది అపథ్యమో (తినరాని వస్తువో) చెప్పి తిననీయ కుండా మాన్పించి సహజవిధానంలో శరీరానికి ఆరోగ్యాన్ని కల్పింపజేయడం నాటివారి వైద్యదృక్పథం.

## స్నానవిశేషం

నరకచతుర్దశినాడు స్వాతీనక్షత్రం ఉంటుంది. ఆ తెల్లవారుజామున పారేనదిలో స్నానంచేసినట్లయితే– ఒకప్పుడు అంగిరాది మహర్షులు తపస్సు చేసి నదుల్లో నిక్షిప్తంచేసిన తపశ్శక్తి మనం ఎంత భక్తిశ్రద్ధలతో, విశ్వాసంతో మునిగామో ఆ స్థాయిలో మనకు లభిస్తుంది. ఇది సత్యం.

ఇంకా సూర్యు డుదయించని కారణంగా సూర్యోదయా నికి ముందుండే ఉషఃకిరణకాంతి మనకు చేరుతుంది. నక్షత్రా లింకా అస్తమించని కారణంగా నక్షత్రకాంతి మన ఒంటపడు తుంది.

అమావాస్యకు వెనుకరోజయిన కారణంగా సూర్య చంద్రులిద్దరి కిరణశక్తి మన కబ్బుతుంది. అన్నిటికీ మించి నీటికి అధిష్ఠాత అయిన వరుణుని శక్తీ, దాంతోపాటు ఆకాశ గంగాస్నానానికి వెళ్తూండే మహర్షుల పరోక్షదర్శనం కారణంగా వారి దివ్యానుగ్రహమూ లభిస్తుంది. అందుకే ఈ తెల్లవారు జామున చేసే స్నానాన్ని 'గంగాస్నాన సమం' అన్నారు పెద్దలు.

కాశీకి వెళ్లక్కర్లేకుండా గంగానదీస్నానాన్ని చేయగల దివ్యమైన రోజన్న మాట ఇది.

## 3) దీపావళి

దీపావళి అనగానే చిచ్చుబుడ్లు, మతాబులు... వీటి మీదే అందరి దృష్టి. అయితే, ఈనాడు అమావాస్య అయిన కారణంగా పితృదేవతలనుద్దేశించి పెద్దలకు పెట్టుకోవలసిన రోజు'గా కూడా మనం గుర్తించాలి.

**అగ్నిదగ్ధాశ్చ యే జీవా యేప్యదగ్ధాః కులే మమ।**
**ఉజ్జ్వల జ్యోతిషా దగ్ధాః తే యాంతు పరమాం గతిమ్ ॥**

"నాకు తెలిసి లేదా తెలీక ఎవరైనా అగ్నిలోగాని లేక ఇతరవిధాలుగాగాని మరణించి ఏ సంస్కారమూ లేకుండా గతించి ఉన్నట్లైతే నేను పెదుతున్న ఈదీపం వారికి నరక బాధలేకుండా చేయును గాక!" అని పై శ్లోకాని కర్థం. ఈశ్లోకాన్ని చదువుతూ దీపాన్ని వెలిగించి ఈ దీపాన్ని సమీప దేవాలయంలో ఉంచాలి.

ఇలా అందరిళ్లనుండీ వచ్చిన దీపాల ఆవళి (సమూహం) ఏదుందో అది 'దీపావళి' అవుతుంది తప్ప, లెక్కకు మించి కొవ్వొత్తుల్ని కొని అందంగా పేర్చి వెలిగించి 'దీపావళి' బాగా జరిగిందనుకుంటే అది మనకానంద కారణం కావచ్చు గాని ఇలా చేయడమనేది పెద్దలకు ఆనందకరం కాదట. వాళ్లను తల్చుకుని బట్టలుపెట్టడం, భోజనాన్ని పెట్టడం, మొక్కిపంపడం అనేవి కర్తవ్యాలు.

## లక్ష్మీపూజ

నిజానికి లక్ష్మీపూజను దీపావళినాటి అర్ధరాత్రికాలంలో ఇంటి మధ్యభాగంలో ధాన్యపురాశితో చిన్నవేదికని చేసి ఆ ధాన్యంమీద అమ్మవారి ప్రతిమ ఉంచి శ్రీసూక్త విధానంతో అష్టైశ్వర్యప్రదాయని ఆ మహాలక్ష్మికి పూజ చేయాలి. ఆ లక్ష్మీ భర్త అయిన శ్రీహరి నీలమేఘశ్యాముడు కాబట్టి లక్ష్మికి కూడ నలుపురంగంటే ఇష్టమే. నల్లనితనంతో ఉండే అమావాస్య ఆమెకు పూజాదినం. నల్లనిరంగంటే ఇష్టమున్నా ఆమె ధరించేది మాత్రం తెల్లనివస్త్రాలు, తెల్లని గంధం, తెల్లని పుష్పమాలికలు.

"కిందటి సంవత్సరం లక్ష్మీపూజను ఎంతో ఘనంగా చేశాం. ఏం పెరిగింది సంపద?" అంటూంటారు. అనారోగ్యా నికో, మరో భయానికో, మరి దేనికో సంపద తరగకుండా ఉండడమేదుందో అదే సంపాదనమంటే. అందుకే 'తరగని ద్రవ్యాన్ని సంపద' అంది శాస్త్రం. అలాంటి లక్ష్మికి అర్ధరాత్ర పూజనుచేస్తే సర్వసంపదలనూ ఇస్తుంది.


*శీఘ్రమేవ ధనలక్ష్మీ ప్రాప్తిరస్తు.*

# శ్రీమద్భగవద్గీత

## 18వ-అధ్యాయం (సారసంగ్రహం)

ధారావాహిక

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్, 94416 45995



### మోక్షసన్న్యాస యోగం

మోక్షాన్ని కూడా సన్న్యసించమని చెప్పేయోగం కాబట్టి దీన్ని మోక్షసన్న్యాసయోగం అన్నారు.

పదిహేడుఅధ్యాయాల్లో తెల్పినవిషయాలన్నీ సంక్షిప్తంగా ఈ అధ్యాయంలో తెలుపబడి ఉంది. అందుకే ఈ అధ్యాయాన్ని గీతాసారమని, సంక్షిప్తగీత అని కూడా అంటుంటారు. గీతా ప్రచారకునికి కలిగే ఫలంకూడా పేర్కొనబడింది.

మోక్షం అంటే విడుదల అని అర్థం. బంధం నుండి, సాంసారికదుఃఖాలనుండి, జనన, మరణాల నుండి విడుదల- అంటే కైవల్యం. సన్న్యాసం అంటే సర్వసంగపరిత్యాగం- అంటే ప్రపంచం, దేహం, మనస్సు సమస్తమైన కంటికి కనబడే వస్తువులమీద వ్యామోహం లేకపోవడం, కేవలం భగవంతుని యందే మనసు నిల్పడం అదే మోక్షస్థితి అని బోధింపబడటం వల్ల ఈ అధ్యాయానికి మోక్షసన్న్యాసయోగ మనేపేరు వచ్చింది. సమస్తకర్మల్ని, కర్మఫలాన్ని భగవంతునికే అర్పించటం కూడా మోక్షసన్న్యాసమని చెప్పవచ్చు. ఈ అధ్యాయం యొక్క పేరు ఔచిత్యంగానే ఉంది.

నాలుగువర్ణాల సహజక్రియలు కూడా ఇందులో బోధింపబడ్డాయి. అధ్యాయానికి చివర ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయాల్లో ఉన్నాడని, ఆ పరమాత్మకు శరణాగతులు కావాలని చరమశ్లోకంలో శరణాగతి నిర్దేశింపబడింది. కృష్ణార్జునులున్న చోట సిరి, విజయం, భూతి, నీతి, ఉంటాయని కృష్ణుడన్నాడు. ఈ అధ్యాయం చదవటం వల్ల సమస్తయజ్ఞాల నాచరిస్తే కలిగే ఫలితం కలుగుతుంది. ఉద్యోగం లభిస్తుంది.


సన్న్యాసం, త్యాగం ఈ రెండిటి యొక్క యథార్థతత్త్వం సమగ్రంగా తెలుసుకోవాలని ఉంది. దయచేసి వాటి స్వరూపాలను వివరంగా విశదం చెయ్యి అని అడిగిన అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ ఇలా ప్రత్యుత్తర మిస్తున్నారు.

ఫలాపేక్షతో చేసే కర్మల్ని వదలటమే సన్న్యాసం. అన్ని కర్మల ఫలాన్ని విడవడమే త్యాగం అని విద్వాంసులు చెబుతారు. ఐతే ఏ కర్మ అయినా అందులో ఎంతోకొంత దోషముండటం చేత కర్మల్ని పూర్తిగా విడిచి పెట్టాలని కొందరు, యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మల్ని విడువకూడదని మరికొంద రంటున్నారు. కానీ ఈ విషయంలో నా నిశ్చయమైన అభిప్రాయం - యజ్ఞం, దానం, తపస్సు అనే ఈ మూడుకర్మల్ని సన్న్యసింపకూడదు. వాటిని తప్పకుండా చేసి తీరాల్సిందే. ఎందుకంటే అవి మనుష్యులను పవిత్రంగా చేస్తాయి. అయితే ఫలాన్ని అపేక్షించి చెయ్యకూడదు. అప్పుడే అది శ్రేష్ఠంగా పరిగణింపబడుతుంది.

పార్థా! కర్తవ్యకర్మల్ని సన్న్యసించటం తగదు. అవి చేసేతీరాలి. ఏదో భ్రమలోపడి ఎవరైనా వాటిని అలా విడిచి పెడితే అది తామసత్యాగం అవుతుంది. శరీరానికి కష్టం కలుగుతుందనీ, దుఃఖానికి హేతువౌతుందనీ భావించి విధ్యుక్త కర్మల్ని విడిచి పెట్టేవాడు రాజసత్యాగి. ఇతడు త్యాగఫలాన్ని పొందలేడు. ఫలాపేక్షలేకుండా, ధర్మానుసారంగా, ఇది చేయ తగింది- దీన్ని భగవత్ప్రీతి కోసం నిర్వహిస్తున్నాను అని కర్మల్ని చేయటం సాత్త్వికత్యాగం. సాత్త్వికత్యాగి వివేకవంతుడు, సంశయరహితుడు, ధీమంతుడు అయి తనకు దుఃఖం కలిగించే కర్మలందు ద్వేషంగానీ, సుఖప్రదాలైన కర్మలందు ఆసక్తిని గానీ చూపడు. అంటే రాగద్వేషాలకు లోనుగాడు. ఇటువంటి స్థిరచిత్తుడే త్యాగి.

(ఇంకా ఉంది)

ఈ నెల ఒకటవ తేదీన
**తిరుమల శ్రీవారి గరుడసేవ...**



# ఈయన సేవ... చాలా ప్రత్యేకం!!

- డా॥ ఆకెళ్ల విభీషణశర్మ

బ్రహ్మోత్సవాల్లో తలమానికమైంది గరుడసేవ. బ్రహ్మోత్సవప్రారంభంలో గరుడధ్వజాన్ని ఎగురవేయడం, అయిదోరోజు గరుడవాహనంపై శ్రీవారుభక్తజనావళిని కటాక్షించడం, పరిసమాప్తిరోజున గరుడధ్వజ అవరోహణ చేయడం సంప్రదాయం. గరుడసేవ మాత్రం అయిదోరోజున ఉంటుంది. గరుడసేవలో శ్రీవారిఅలంకారాల్లో, ప్రసాదనివేదనల్లో, ప్రబంధపారాయణల్లో ఎన్నో ప్రత్యేకత లుంటాయి.

## గరుడసేవ - అలంకరణ

మలయప్పస్వామి గరుడునిపై శ్రీవైకుంఠమూర్తిగా దర్శనమిస్తాడు. గరుడవాహనసేవ జరిగే రోజున శ్రీవిల్లి పుత్తూరునుంచి గోదాదేవి బహూకరించిన తులసిమాలలు శ్రీవారికి అలంకరిస్తారు. అంతేకాకుండా గర్భాలయంలో శ్రీవేంకటేశ్వరమూలమూర్తిపై సదా అలంకరించే మకర కంఠి, లక్ష్మీహారం, సహస్రనామ మాలల్ని ఉత్సవమూర్తి మలయప్పకు గరుడసేవలో సమర్పిస్తారు. చెన్నైలోని హిందూ ధర్మార్థసమితి తొమ్మిదిగొడుగులను (ఆరుపెద్ద గొడుగులు- మూడుచిన్నగొడుగులు) నూతనంగా తయారు చేసి కాలినడకన చెన్నైనుంచి తిరుమలకు తెచ్చి సమర్పిస్తారు. గొడుగుల మిరాసీదార్లు శ్రీవారికి పూలంగి, కపాయి కుల్లాలు, వక్షఃస్థల లక్ష్మీదేవికి పావడాలు కూడా సమర్పిస్తారు. శ్రీవారు కొత్త ఆభరణాలతో, అలంకరణలతో, నూతన శ్వేతఛత్రాలతో భక్తులకు కన్నుల పండుగ చేస్తారు.

తాళ్లపాక అన్నమయ్య శ్రీవారిఆలయకవి. ఆయన సంకీర్తనల్లో గరుడస్తుతి వీర శృంగార రూపంలో కనిపిస్తుంది.

## గరుడవాహన సేవ ప్రత్యేకం

వినతాతనయుడైన గరుడుడు మహావేగుడు. మహాబలుడు. సూర్యమండలం దాకా ఎగిరిన బలశాలి. ఇంద్రాదులను లెక్కసేయనివాడు. అమృతభాండం తెచ్చి తల్లి దాస్యం పోగొట్టిన మాతృభక్తి పరాయణుడు. చేజిక్కిన అమృతాన్ని తిరస్కరించిన త్యాగశీలి. జనవిజ్ఞాన తేజస్సంపన్నుడు కావడం వల్లనే మహావిష్ణువు గరుడుణ్ణి తనకు వాహనంగా స్వీకరించాడు. గరుడుడుస్వామికి దాసుడు. సఖుడు, ఆసనం, ధ్వజం, గొడుగు, విసనకర్ర కూడా. క్రీడాచలాన్ని భూలోకానికి తెచ్చినవాడు గరుత్మంతుడే. అందుకే బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవ ప్రత్యేకత సాధించుకుంది.

## పురాణేతిహాస కావ్యాల్లో.....

వేదకాలంనుంచి గరుత్మంతుడు ఆరాధ్యుడే. అందమైన రెక్కలు గల దైవశక్తి సముపేతుడైన పక్షిస్వరూపుడు గరుడుడని

రుగ్వేదం వర్ణించింది. ఉపనిషత్తులలో కూడా గరుత్మంతుని కీర్తివైభవం సుస్పష్టం. ఇతిహాసాలలో ఒకటైన శ్రీమద్రామాయణంలో జటాయువు తన వంశక్రమం గురించి శ్రీరామునికి విశదం చేసే సందర్భంలో గరుడుని ప్రస్తావన చేశాడు. మహాభారతంలో అయితే సుపర్ణోపాఖ్యానం గరుడుని జన్మపరాక్రమాదులను గంభీరంగా వర్ణించింది.

శిష్టరక్షణ చేయాలంటే దుష్టశిక్షణ తప్పనిసరి. శత్రుదుర్భేద్యమైన నరకాసురుని ప్రాగ్జ్యోతిషపురంపై స్వామిదండెత్తినప్పుడు సహాయం చేసినవాడు గరుత్మంతుడు. సత్యభామాసమేతుడై స్వామి అమరావతి చేరడానికి తోడ్పడ్డవాడు గరుత్మంతుడు. శోణితపురం చుట్టూ రగిలే జాజ్వల్యమానమైన అగ్నులను ఆకాశగంగా జలంతో చల్లార్చినవాడు గరుత్మంతుడే. మూడడుగుల దానమిచ్చిన బలి నాగపాశ బద్ధుడైన వేళ అతణ్ణి విముక్తుని చేసినవాడు కూడా గరుడుడే. సంస్కృతాంధ్రకవులు తమ తమ కృతులలో గరుడవాహనునితో పాటు గరుత్మంతుని కూడా కొండంతగా కొనియాడారు.

మహావిష్ణువు అర్చావతారమైన శ్రీనివాసుడు అశేషప్రజానీకాన్ని అనుగ్రహించడం కోసం తిరువీథుల్లో విహరించడం వల్ల ఈ గరుడసేవకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

## గరుడ సేవాఫలం

గరుడారూఢుడైన శ్రీమహావిష్ణువును దర్శించడం ఎంత పుణ్యమో కేవలం గరుడుని దర్శించినా అంతపుణ్యం. కారణం గరుడుడు వేదమయుడు. గాయత్రి, జగతి



అనేవి రెండూ గరుడుని రెక్కలు. గరుత్మంతుని సంతానప్రదాతగా కొలుస్తారు. వివాహాదులలో గట్టిమేళానికి గరుడమేళమని మరోపేరు. ఆ మంగళవాద్యం వినడం కూడా పుణ్యప్రదమే. గరుడధ్వని శుభసూచకం. *(ముఖచిత్ర కథనం)*




శ్రీవైష్ణవులు
గరుడాళ్వారును
పెరియత్తిరువడిగా
ప్రస్తుతిస్తారు.

**పంచవర్ణ రహస్యంగా పిలిచే
గరుడసేవ బ్రహ్మోత్సవాల్లో
అయిదోరోజున నిర్వహిస్తారు.**

ఆరోజున
నమ్మాళ్వార్ సాయించిన
తిరువిరుత్తంలోని
వందపాశురాలు
అధ్యయనం చేస్తారు.

**పెరియాళ్వార్
'తిరుమొళి'ని కూడా
అనుసంధానం చేస్తారు.**

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)


తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు


తిరుమలలో పుట్టిన మృగాలు, పక్షులు భగవత్స్వరూపాలవడం చేత వాటిని తామసులైన మనుషులు హింసించకూడదు. ఉత్సవకాలాలలో దివ్యబలియోగ్యమైన శ్రీనగరవీథులలో పాదరక్షలు ధరించకూడదు. వాహనాలు అధిరోహించకూడదు. వేంకటాచలంపై మనం పెట్టే ఒక్కొక్క అడుగు బ్రహ్మహత్యాది పాపాలను పోగొట్టుతుందని, సంసారసాగరాన్ని తరింపజేస్తుందని వామనపురాణంలో అనేకచోట్ల ప్రతిపాదింపబడి ఉండడం వల్ల బ్రహ్మ హత్యాది పాపనివారణకు, భగవత్ప్రాప్తికి సాధనం అని చెప్పిన తిరుమలయాత్రలో దేహయాత్రకు కావలసిన వామనారోహణాదులు అనుచితం కనుక, ముఖ్యంగా తిరుమల కొండ ఎక్కేటప్పుడు, పాదరక్షలు, వాహనాలు ఉపయోగించకూడదు.

శివుడు “ఓ స్వామీ! వేంకటేశ్వరా!! దేవా!!! అనునిత్యం నీ వెక్కడ ఉంటావో అక్కడే నేను కూడా ఉండాలి.” అని శ్రీవేంకటేశ్వరుణ్ణి అనుమతి వేడగా నీలమేఘసమానకాంతితో వెలిగే శ్రీవేంకటేశ్వరుడు “మహాదేవా! ఈశ్వరా!! ఈ వేంకటాచలంపై కల్పాంతం వరకు నేను నివసిస్తాను. నీవు కూడ ఇక్కడే ఈ కొండ దిగువప్రాంతంలో ఆగ్నేయ మూలలో నివసించు” అని చెప్పినట్లు వరాహపురాణం, ఏడవఅధ్యాయంలో ఉంది.

కాబట్టి, ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రితో సమానమైన వేరొకస్థానం లేదు. శ్రీమంతమైన ఈ వృషభాచలం పరమ పావనమని కొందరు మహర్షులు స్వామిపుష్కరిణి చుట్టుప్రక్కల ఒక యోజన పరిమిత ప్రదేశం ముఖ్యంగా పరమపావనమని నిశ్చయించి, అక్కడే తపమాచరించుకుంటూ నిత్యనివాసం చేస్తుంటారని స్వర్ణముఖరీమాహాత్మ్యంలో వర్ణింపబడి ఉంది.

అందువల్లనే, దివ్యమైన కోనేటికి నాలుగువైపులా ఒక ఆమడదూరం మాత్రం ఈ ఆచారనియమాలు అనుష్ఠింపతగినవని, ఇలా పవిత్రమైన స్థలాన్ని శ్రీవేంకటాచలపతికి చెందిన దేవాలయంగానే ప్రతిపత్తి చేసి, ఇలా తిరుమలలో స్థలవాసులు అనుష్ఠించాల్సిన ఆచారాలను దివ్యచిత్తంలో నిర్ణయించి శ్రీవేంకటరమణుడు తమ సన్నిధిలో జరిపించేటట్లుగా సంకల్పించి అనుగ్రహించవలెనని నిర్ధారణచేసుకుని తిరుమల నంబితో చెప్పాడు. శ్రీశైలపూర్ణుడు కూడా ఇది విని మనస్సులో సంతోషించి, భగవద్రామానుజుల సంకల్పాన్ని శ్రీవేంకటాచలపతి సఫలం చేస్తాడని ఆలోచిస్తూ నిద్రించాడు.

నాటి రాత్రి వారి కలలో శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమై “ఏమయ్యా! నంబీ!! మేము ముందు పాంచజన్యాలను ధరించడం అభిమతమైనట్లే ఇప్పుడు వారి కట్టుబాట్లు మాకు సమ్మతమై ఉంటాయి.” అని చెప్పగా, తిరుమలనంబి విని మేల్కొని స్వప్నవృత్తాంతాన్ని లోకులందరికీ తెలిసేటట్లు అనుగ్రహించమని స్వామి సన్నిధిలో విన్నపం చేసుకున్నాడు. అప్పుడు శ్రీనివాసస్వామి ఒక భక్తునిపై ఆవేశించి “మేము రామావతారంలో వసిష్ఠాదులను ఆదరించినట్లే! మా సర్వోత్కృష్టతను శ్రీభాష్యనిర్మాణద్వారాన్ని స్థాపించిన శ్రీభాష్యకారుల నియమాలను కూడా ఆదరిస్తాం. మాకు చెందిన వారంతా శ్రీభగవద్రామానుజులవారి నియమాలను తప్పక ఆదరించాలి” అని ఆజ్ఞాపించాడు.


(ఇంకా ఉంది)

# స్వామిచేత తాతా! అని పిలిపించుకున్న మహాభక్తుడు!!

– ఆచార్య కోసూరి దామోదరనాయుడు, 94416 45601

హైందవసంస్కృతికి ఆలయాలు ఆయువుపట్టులు. ఒక ఆలయమాహాత్మ్యం అవగతం చేసుకోవడానికి పౌరాణిక కథనాలు, చారిత్రకసత్యాలు ప్రధానమైనా సమాజంలోని రక రకాల ప్రవాదాలు కూడా సహకరిస్తాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే శ్రీవేంకటాచలఇతిహాసమాల, తాళ్లపాకకవులసంకీర్తనలు, ఆచార్య సూక్తి ముక్తావళి రచనలనుబట్టి తిరుమలనంబి గొప్పతనం మనకు స్పష్టమౌతుంది.

లోకంలో మహానుభావులైనవారి అసలు పేర్లు మరుగున పడిపోయి మరొక నామధేయం జగద్విఖ్యాతం కావడం



అందరికి తెలిసిందే! శ్రీవైష్ణవపరంపరలో తిరుమల శ్రీనివాస స్వామికి తోయకైంకర్యం చేసిన 'తిరుమలనంబి' అసలు పేరు కూడ ఇలాంటిదే. శ్రీ వైష్ణవపరంపరలో వీరికి పెరియతిరుమల నంబి అని, శ్రీశైలపూర్ణులని గౌరవనామాలు.

శ్రీవేంకటేశ్వర సంబంధి చరిత్రను ఆంగ్లంలో రాసిన వారు THE FIRST CITIZEN OF TIRUMALA అని శ్లాఘించారు. తిరుమలను శాశ్వతవాస స్థానంగా చేసుకుని కైంకర్యం చేసిన వారిలో ప్రథముడనే అభిప్రాయం కావచ్చు. ఇందుకు ప్రధానకారణం తిరుమల భయంకరారణ్యం కావడం, శీతోష్ణ స్థితులు స్థిరవాసానికి ప్రతిబంధకాలుకావడం కావచ్చు. అలాగే 'నంబి' శబ్దానికి శ్రీవైష్ణవ పరంపరలో విశిష్టార్థాలున్నా సామాన్యులకు అర్థంకావడానికి విశ్వాసం కలవాడని (తమిళంలో నంబియవన్. స్వామే సర్వస్వం అని నమ్మినవాడు) చెబుతుంటారు.

తిరుమలనంబి భగవద్రామానుజుల మేనమామ. యామునాచార్యులశిష్యుడు. శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఆరవ స్తబకంలో శ్రీశైలపూర్ణార్యుల వృత్తాంతం వర్ణితం. దాని ప్రకారం యామునముని శ్రీముఖసూక్తి అనుసంధిస్తూ పరవశులై, భగవదారాధనలో ప్రముఖమైన పుష్ప, తీర్థ, దీప, ధూపాదులను శ్రద్ధగా చేసేవారు ధన్యులన్నారు. ఆపై ప్రసంగం కొనసాగిస్తూ దివ్యదేశంగా పరిగణింపబడే తిరువేంగడంలో భగవంతుని అభిషేకంకోసం పరిమళించే దివ్యతీర్థం తెచ్చేవారు, అలాగే విలక్షణమైన పుష్పాదులను సమర్పించగలవారెవరని సంశయంలో పడి మందభాగ్యుడైన తనకు ఆ కైంకర్యం దుస్సాధ్య మని చెబుతుండగా, తిరుమలనంబి ఆచార్యుల అనుమతితో తిరుమలకు చేరుకున్నారు. వారి దృష్టిలో 'పరిమళ దివ్యతీర్థం' తేవడం ప్రధానమైంది. అనుదినం శ్రీసూక్తం, ద్రావిడ

**ఈ నెల 28న శ్రీతిరుమలనంబి శాత్తుమొఱ**

సంహితను అనుసంధానిస్తూ తిరుమల ఆలయానికి సుదూరం లోని పాపవినాశనంనుండి తీర్థం భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చి శ్రీవారికి అభిషేక కైంకర్యం నిర్వర్తించేవాడు. ఈ కైంకర్యం సర్వ జనులకు తెలియాలని స్వామి భావించారట. భావనకు ఆలోచన తోడయింది.

స్వామి 'వ్యాధరూపు'డయ్యాడు. పాపవినాశనం నుండి పవిత్రతీర్థం తెస్తున్న తిరుమలనంబికి ఎదురేగి "తాతా! దప్పి దప్పి- నాకు కాసంత తీర్థం ప్రసాదించరా" అని ప్రాధేయ పడ్డాడు.

"ఓరీ! వ్యాధుడా! ఈ తీర్థం నాకోసం కాదు. శ్రీవేంకట నాథుని అభిషేకార్థం తీసుకువెళుతున్నా" అన్నారు తిరుమలనంబి. యథాతథంగా అనుసంధానిస్తూ తిరుమలనంబిపోతుంటే వ్యాధుడు అతని వెంటబడ్డాడు. వింట ఒక బాణాన్ని కూర్చి వ్యాధరూపుడు, అతిలాఘువంగా నంబి తీసుకువెళుతున్న ఘటానికి రంధ్రం చేశాడు. ఆపై వెనకనే అనుగమిస్తూ రంధ్రం ద్వారా కారే జలాన్ని తానే తాగేశాడు.

కానీ, ఇవన్నీ తిరుమల నంబికి తెలియవు. అతని లోకం వేరు. అయినా కాసేపటికి ఘటం తేలికపడడం మాత్రం అనుభవానికి వచ్చింది. ఒక్క సారిగా వెనుకకు తిరిగిచూచాడు. ఇదంతా వ్యాధుని పనే అని అర్థమయింది.

"అయ్యో! ఇది తగునా? స్వామి అభిషేకంకోసం తీసుకొని వెళుతున్న నా ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోలేకపోయావు. మరల నేను పాపవినాశతీర్థానికి వెళ్లగలనా?' అన్నారు.

"తాతా! విచారించకు. పవిత్రజలం కదా నీకు కావాలి. ఇదిగో చూడు తాతా! అంటూ గడ్డిపోచతో కొండకొమ్ము కొడతాను" అంటూ కొట్టగా ఆకాశగంగ ప్రవహించింది. తిరుమలనంబి ఆశ్చర్యపడ్డారు.

"తాతా! ఇదీ పవిత్రతీర్థం. ఇదే ఆకాశగంగ. ఇంక పాపవినాశనతీర్థం దాకా వెళ్లనక్కర్లే"దంటూ మాయమయ్యాడు. తిరుమలనంబికి ఇదంతా శ్రీనివాసునిలీల అంటూ యథా తథంగా శ్రీవారికి తోయకైంకర్యం చేయసాగారు.

శ్రీనివాసునిచే 'తాత' అని పిలవబడ్డశ్రేష్ఠులు తిరుమల నంబి. తిరుమలనంబి రామానుజులకు శ్రీమద్రామాయణ



రహస్యార్థం బోధించినట్లు శ్రీవేంకటాచల ఇతిహాసమాలలో సూచనలున్నాయి.

నంబిగారికి ఇద్దరు కుమారులు. పిళ్ళై తిరుమలైనంబి, తిరుక్కురుక్కైపిరాన్ పిళ్ళాన్. కుమార్తెలు కూడా ఇరువురే. వీరందరు రామానుజుల శిష్యులయ్యారు.

తిరుమల శ్రీవారి దక్షిణమాడవీథిలో తిరుమలనంబికి ప్రత్యేక ఆలయముంది. అనంతాళ్వాన్ ఉత్సవాలను తి.తి.దే. ఘనంగా నిర్వహించేవేళ తిరుమలనంబికి తగిన గౌరవం ఇవ్వాలని భావించి కోరడంతో తి.తి.దే. తిరుమలనంబి ఆల యాన్ని సముద్ధరించి ఉత్సవాలు జరుపుతున్నారు.

చాలా ఆలయాలలో ప్రాచీన సంప్రదాయాలు తెరమరు గవుతున్నాయి. కానీ, తిరుమలలో నేటికీ శ్రీవారి అభిషేకార్థం తిరుమలనంబి వంశస్థులే తోయకైంకర్యం చేస్తున్నారు. సంప్ర దాయాల పరిరక్షణలో తి.తి.దే. ఎవరిని గాని అసంతృప్తులను చేయడం లేదనడానికి ఇదొక తార్కాణం.



# దివ్యనాయకుడి సన్నిధిలో... దీపావళి

- డా॥ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

ఈ నెల 24న శ్రీవారి ఆస్థానం

సర్వజగత్ప్రభువైన శ్రీనివాసపరమాత్మకు జరిగే వార్షిక ఉత్సవాల్లో "దీపావళిఆస్థానం" ఒకటి. బ్రహ్మోత్సవాలలో ఆనందనిలయాన్ని వీడి బయటికు వెళ్లి రంగనాయక మండపంలోనే ఉంటూ ఉన్న శ్రీమలయప్పస్వామి దేవేరులతో కూడి దీపావళిరోజున ఆస్థానానికై గంటామండపంలోకి వస్తారు. పిదప ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామిని, బంగారువాకిలిముందు ఏర్పాటుచేసిన సర్వభూపాలవాహనంలో గరుడాళ్వారుకు అభిముఖంగా ఏర్పాటు చేస్తారు. సేనాపతి అయిన శ్రీవిష్వక్సేనులవారిని కూడ స్వామివారి ఎడమప్రక్కన మరొకపీఠంపై దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తర్వాత లోపల మూలమూర్తికి, బయట కొలువులో వున్న స్వామివారికి రెండవ అర్చన చేస్తారు. పిదప ఆస్థాన ప్రసాదాలను, గమేకార్లు తీసికొనిరాగా, వెంట ఛత్రచామర మంగళవాద్యపురస్సరంగా బయలుదేరి ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వచ్చి లోపల, కొలువులోను సమర్పించగా రెండవ గంట జరుగుతుంది. అటు తర్వాత శ్రీజియ్యంగారు ఆరు పట్టు వస్త్రాలను వెండితట్టలో పెట్టుకొని తి.తి.దేవస్థానం అధికారులు వెంట రాగా, మంగళవాద్యాలలో ఛత్రచామరాలతో బయలుదేరి ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వచ్చి, విమానప్రదక్షిణంలో చేస్తూ ఆనందనిలయంలోపల సమర్పిస్తారు. అర్చకస్వాములు వాటిలో నాలుగింటిని శ్రీస్వామివారికిరీటానికి, ఖడ్గానికి, ఉత్తరీయంగాను, ఆదితోమాలగాను సమర్పించి అక్షతారోపణంచేసి హారతులనిస్తారు. మళ్లీ అక్కడినుంచి శ్రీజియ్యంగారు మిగిలిన రెండువస్త్రాలతో బయలుదేరి కొలువులో సమర్పిస్తారు.

ఆస్థానంలో అర్చకులు వాటిలో ఒక దానిని శ్రీమలయప్పస్వామివారికి, మరొక దానిని శ్రీవిష్వక్సేనులకు సమర్పిస్తారు. తర్వాత శ్రీస్వామివారికి, సేనాధిపతికి అక్షతారోపణం జరుగుతుంది. పిదప విష్వక్సేనులకు, అర్చకులకు శఠారి మర్యాదలు జరుగుతాయి. తర్వాత అర్చకులు శ్రీస్వామివారినుండి బియ్యాన్ని, దక్షిణను దానంగా స్వీకరించి "నిత్యైశ్వర్యోభవ" అని శ్రీస్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తర్వాత జియ్యంగార్లకు, దేవస్థానం అధికారులకు హారతి, చందన శఠారిమర్యాదలు జరుగుతాయి. చివరగా స్థానీయులైన వారికి కూడ హారతి, చందన శఠారి మర్యాదలు చేస్తారు. పిదప ప్రసాదవినియోగం జరుగుతుంది. ఈ "దీపావళి ఆస్థానం" బంగారువాకిలి ముందు గల ఘంటామండపంలో జరుగుతుంది.





# సూర్యచంద్రులున్నంత వరకూ... కీర్తిశాశ్వతం

*ఈ నెల 30న శ్రీమణవాళ మహామునుల శాత్తుమొఱ*

గురుపరంపరలో కడపటి ఆచార్యులు శ్రీమణ వాళమహామునులు. ఆదిశేషుని అవతారమైన భగవద్రా మానుజులవారు శ్రీవైష్ణవసంప్రదాయాన్ని ఎలా బహుళ ప్రచారం చేసి విశిష్టాద్వైతమతాన్ని దేశంలో నిలబెట్టారో చాలావరకు అలాగే దేశవ్యాప్తంగా శ్రీవైష్ణవం విల్లసిల్ల డానికి మహత్తరకృషి సలిపిన శ్రీవైష్ణవరత్నం శ్రీ మణవాళ మహామునులు.

భగవద్రామానుజులవారు పరమపదనాథుని చేరిన సుమారు రెండువందలసంవత్సరాల తర్వాత వీరు జన్మించారు.

అభిరామవరాధీశ, యతీంద్రప్రవణులు అనే పేర్లున్నాయి వీరికి. కాలక్రమేణ వీరికి వరయోగి, వర వరముని, రామానుజపొన్నడి, సౌమ్యజామాతృముని, సుందరజామాతృముని, పెరియజీయర్ అనే పేర్లు కూడ వచ్చాయి. ఈయన వాక్కులు స్పష్టతగా, గంభీరంగా, ఖచ్చితంగా ఉండడం వల్ల ఈయనకు 'విశద వాక్ శిఖా మణి' అనే పేరు కూడా వచ్చింది.

మణవాళమహాముని తన తండ్రి దగ్గర, తన తాతయ్యదగ్గర వేదాలను, దివ్యప్రబంధాన్ని నేర్చుకున్నారు. 16వ ఏట వివాహమై శిక్కిల్ కిడారంనుండి ఆళ్వారు తిరునగరికి వచ్చారు. ఆళ్వారు తిరునగరిలో తిరువాయ్ మొళిపిళ్ళైకు శిష్యులైనారు.




– డా॥ పసుమర్తి బద్రీనాథ్, 88257 11255

తిరువాయ్‌మొళిపిళ్ళై భగవద్రామానుజులవారి విగ్రహాన్ని ఆళ్వారు తిరునగరకి తెప్పించి, కోవెల నిర్మించి అందు ప్రతిష్ఠించి, కోవెలనిర్వహణ బాధ్యతల్ని మహామునికి అప్పగిం చారు. శ్రీరామానుజులవారిపై మహామునికి ఉన్న భక్తిశ్రద్ధలను గుర్తించి "యతీంద్రప్రవణ" అనే బిరుదును తిరువాయ్‌మొళి పిళ్ళై ఆయనకు ప్రదానం చేశారు. "యతిరాజ వింశతి" అనే స్తోత్రం రామానుజులవారిని కీర్తిస్తూ మహాముని రచించారు.

తన అవసాన సమయంలో తిరువాయ్‌మొళిపిళ్ళై మణవాళమహామునితో రామానుజులవారి శ్రీభాష్యం, ఆళ్వారుల నాలాయిరదివ్యప్రబంధం ఇత్యాది వైష్ణవగ్రంథాల్ని క్షుణ్ణంగా అభ్యసించి వాటి తత్త్వాల్ని బహుళప్రచారం చేయాల్సిందిగా ఆదేశిస్తారు. శ్రీరంగం వెళ్లి పూర్వీకులవలె శ్రీరంగనాథస్వామికి కైంకర్యం చేయాల్సిందిగా సూచిస్తారు. గురువుగారి సూచన మేరకు శ్రీవైష్ణవతత్త్వాలలో నిష్ణాతుడై, వాటిపై అత్యంత నైపుణ్యంతో అందరికీ అర్థమయ్యే పద్ధతిలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకొన్నారు, శ్రీమణవాళమహామునులు! ఈయన ప్రతిభకు ఆకర్షితులై అనేక మంది శిష్యులు ఈయన దగ్గర చేరారు.

తురుష్కుల దండయాత్రలవల్ల ఛిన్నాభిన్నమైన శ్రీరంగ ఆలయానికి పూర్వపు వైభవాన్ని తిరిగి తేవలస్సిన బాధ్యత మణవాళమహామునులకు ఏర్పడింది. తన అసమాన నిర్వహణ దక్షతతో, తన శిష్యబృందం మరియు ఉన్నతాదర్శాలుగల వ్యక్తుల సహాయసహకారాల్లో ముందటి ప్రాశస్త్యాన్ని శ్రీరంగక్షేత్రానికి తెచ్చారు మహాముని. దైనందిన ఆరాధనలు, ఉత్సవాలు, అన్నిటినీ మరల పూర్వస్థితికి తెచ్చారు. శ్రీవైష్ణవులందరికీ మణవాళమహామునులు నాయకుడై అలరారగలిగారు.



కాంచీపురం, తిరుమల, రామానుజులవారి జన్మస్థలమైన శ్రీపెరుంబుదూర్ ఇత్యాది పుణ్యక్షేత్రాలను మహా మునులు దర్శించారు. రామానుజులవారి శ్రీభాష్యం ఆధారంగా అనేక ఉపన్యాసాలు చేశారు.

మణవాళ మహామునులు అనేక గ్రంథాలు రచించారు. పిళ్ళైలోకాచార్యులవారి రహస్యగ్రంథాలైన 'ముముక్షుపడి', 'శ్రీవచనభూషణం', 'తత్త్వత్రయం' – వీటికీ, మరియు అరుళాళ పెరుమాళ్ ఎంబెరుమానారు యొక్క 'జ్ఞానసారం', ప్రమేయ సారం గ్రంథాలకూ, పెరియాళ్వారుల 'పెరియాళ్వార్ తిరుమొళి'కి వ్యాఖ్యానాలు ప్రసాదించారు. నమ్మాళ్వారుల తిరువాయ్ మొళి ఆధారంగా తిరువాయ్‌మొళి నూట్రన్దాది రచించారు. ఆయన 'ఉపదేశరత్నమాలై'లో ఆళ్వారుల, ఆచార్యులప్రశస్తిని ఎంతో కొనియాడారు. 'ఆర్తిప్రబంధం'లో లౌకికబంధాల్లో తాను ఇరుక్కొని కష్టపడే వేదనని అర్థవంతంగా వర్ణించారాయన.

భగవద్రామానుజుల తర్వాత మణవాళ మహామునుల కృషి ఫలితమే ఈనాడు దేశవ్యాప్తంగా శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రాబల్యం చెంది ఉంది.

శ్రీరంగంలో వీరు 'ముప్పత్తాయిరప్పడి'ని వ్యాఖ్యానిస్తూ ప్రవచనం చేస్తుండగా ప్రవచనం ఏమాత్రం ఆపకుండా కొనసాగించాలని, తాను వినడానికి ఆశిస్తున్నట్లు శ్రీరంగనాథ స్వామియే స్వయంగా తెలిపారు. సుమారు ఒక సంవత్సరంపాటు ఉపన్యాసం ధారావాహికగా కొనసాగింది. ప్రవచనం శాత్తుమొఱ సమయంలో సాక్షాత్తు శ్రీరంగనాథస్వామే స్వయంగా విచ్చేసి ఒక తనియన్ చెప్పి అంతర్ధానమయ్యారు.

శ్రీవైష్ణవం శాశ్వతంగా విరాజిల్లడంకోసం, ఎనిమిది మఠాలను స్థాపించి, అష్టదిగ్గజాలనబడే నిష్ణాతులైన ఎనిమిది శిష్యుల్ని నియమించారు శ్రీ మణవాళమహామునులు.

శ్రీవైష్ణవదీపం ఆరిపోకుండా శాశ్వతంగా ప్రజ్వరిల్లడానికై సరైన పద్ధతిని ఏర్పరచిన శ్రీవైష్ణవజ్ఞానఖని మణవాళ మహామునుల కీర్తిపతాక ఆచంద్రార్కం ఈ భువిలో ఉన్నతంగా ఎగురుతూనే ఉండగలదు.



భవము దాటజేయు భవ్యతేజు! శ్రీనివాస!



# ఈయన చెబితే.. ఆయన 'సరే' అంటారు



– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420

శ్రీమన్నారాయణుని పరివారంలో విష్వక్సేనుడు చాలా ముఖ్యమైనవాడు. ఈయన భగవంతునకు సేనాధిపతియై జగత్తును నిర్వహించే భారాన్ని తాను వహిస్తాడు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించేవారి ఇళ్లలో గాని, విష్ణుదేవాలయాలలో కానీ ఏ కార్యక్రమాలను ప్రారంభించినా, ముందుగా విష్వక్సేనునకు ఆరాధనచేసి, ఆ కార్యక్రమాలను మొదలుపెట్టడం అనేది సంప్రదాయం.


**ఈ నెల 31న సేనై మొదలియార్ వర్ష తిరునక్షత్రం...**

శ్రీవేంకటాచలమాహాత్మ్యాన్ని తెలియజేసే వామన పురాణభాగంలో విష్వక్సేనుని ఒక జన్మవృత్తాంత ప్రస్తావన ఉంది.

కృతయుగంలో కుంతల అనే అప్సరస దుర్వాసమహర్షి శాపం వల్ల వీరబాహుడనే వ్యాధునకు సువర్చల అనే పేరుతో కుమార్తెగా జన్మించింది. ఒకనాడు ఆమె ఋతుస్నానం చేసి, నర్మదానదీతీరంలో సంచరిస్తూ ఉంది. అప్పుడు వరుణుడు ఆమె విషయంలో ఆసక్తి కలవాడై ఆమెతో సంగమాన్ని పొందాడు. దానివల్ల ఆమెకు సర్వలక్షణసంపన్నుడైన ఒక కుమారుడు కలుగుతాడని అతడు వరమిచ్చాడు. ఆ తరువాత, ఆషాఢమాసం పుష్యమీనక్షత్రంలో సువర్చలకు మిక్కిలి బలశాలి, అన్ని లక్షణాలు కలిగిన ఒక కుమారుడు జన్మించాడు. అతనికి పది సంవత్సరాల వయస్సు ఉండగా తల్లి మరణించింది. తర్వాత అతడు కశ్యపమహర్షిని ఆశ్రయించి, ఆ ముని అనుగ్రహంవల్ల వేద వేదాంతాది శాస్త్రాలను, సకలవిద్యలను అభ్యసించాడు. అతడు తిరుమలకొండపై వృషభాచలంలో పన్నెండు సంవత్సరాల కాలం తపస్సుచేసి, ఆశ్వయుజమాసంలో పూర్వాషాఢానక్షత్రంలో భగవంతుని అనుగ్రహాన్ని పొందాడు. ఇంతేకాక, విష్ణువు తన సకలసేనకు అధిపతిగా విష్వక్సేనుని నియమించాడు.

పద్మపురాణాంతర్గతమైన విష్వక్సేనుని వృత్తాంతం మరోరకంగా ఉంది. పూర్వం అమరారి అనే ఒక అసురుడు దేవతలను హింసించేవాడు. అతని హింసను భరించలేక చతుర్ముఖుడు మొదలైన దేవతలు పాలసముద్రం దగ్గరకు వెళ్లి, అక్కడ ఉండే నారాయణుణ్ణి సేవించి, తమను రక్షించమని ప్రార్థించారు. అప్పుడు లక్ష్మీదేవి చెలికత్తె బయటకు వచ్చి, భగవంతుడు త్వరలోనే వేంకటాచలంలో ఆవిర్భవిస్తాడని, అక్కడకు వెళ్లి స్వామిని దర్శించమని తెలిపింది.

ఆ విధంగానే వారు నారాయణాద్రి చేరి, పుష్కరిణి తీరంలో భగవంతుణ్ణి స్తుతించారు. అప్పుడు ఆయన తన గణాధ్యక్షుడైన కుముదుడు అనే నిత్యసూరుని పిలిచి, అతనికి



విష్వక్సేనుడనే నామాన్ని పెట్టి, తన సేనకు అధిపతిగా నియమించి, అసురులను సంహరించి దేవతలను కాపాడమని ఆజ్ఞ ఇచ్చాడు.

శ్రీవైష్ణవసంప్రదాయంలో విష్వక్సేనునకు ప్రముఖమైన స్థానం ఉంది. గురుపరంపరలో శ్రీమన్నారాయణునకు, లక్ష్మీదేవికి తరువాత మూడవస్థానం విష్వక్సేనునిదే. అంతేకాదు, ఆళ్వార్లలో ప్రధానులైన నమ్మాళ్వార్లు విష్వక్సేనుని అంశతో అవతరించినట్లు సంప్రదాయంలో విశ్వాసం. నమ్మాళ్వార్లకే కాక, మిగిలిన ఆళ్వార్లు అందరికీ కూడా విష్వక్సేనుడే చక్రాంకనాన్ని చేసి, అష్టాక్షరీమంత్రోపదేశం చేశాడని కూడా చెప్పబడుతోంది.

శ్రీమన్నారాయణుడు ఆరగించిన శేషప్రసాదాన్నే విష్వక్సేనుడు భుజిస్తాడు. అందువల్ల ఇతనికి శేషాశనుడు అని కూడా పేరు.

ఆళ్వారులు అక్కడక్కడ తమ దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో విష్వక్సేనుణ్ణి ప్రస్తుతించారు. నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి బ్రహ్మం ప్రబంధంలోని "ఆళియాన్ అరుళ్తరువాన్ అమైకిన్ద్రాన్ అదు నమదు విదివగైయే"(10-6-1) అనే సూక్తిని వ్యాఖ్యానిస్తూ పరాశరభట్టర్ "జగత్తును నిర్వహించే సందర్భంలో విష్వక్సేనుడు ఏది చెబితే దాన్నే భగవంతుడు సమ్మతించి, తన తలను ఊగిస్తాడని, దానిని చూస్తే వృద్ధమంత్రి చెప్పిన మాటను యువకుడైన ప్రభువు అంగీకరించి, తన తలను ఊపేటట్లు ఉంటుందని చమత్కారంగా వివరించారు.

ఇటువంటి భావాన్నే శ్రీయామునులు స్తోత్రరత్న శ్లోకంలో "తనకు ఇష్టమైన విష్వక్సేనుడు చెప్పినదానిని యథాతథంగా తన చూపులతోనే అంగీకరిస్తాడు" అని చెప్పారు.


# శ్రీకృష్ణామృతం

- "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు),
99103 45794.

ఏహి శ్రీహరియు వీడే
ఏహి భవహరుడు వీడే
భవబంధములు త్రుంచగ కైవల్యమొసగగ వీడే
ఇసుమంతభక్తికే ఇల నను కాచును వీడే

ఏ జన్మలందు నేను
ఏ పుణ్యము చేసినానో
పుణ్యపురాశులు కూడగ ఎన్ని జన్మలెత్తినానో
ఈ జన్మ కీ భక్తి ఒసగిన విభుడవు నీవే... ॥ఏహి॥

నా వలన ఏమగు తండ్రీ
ఆజ్ఞయే నీదగు తండ్రీ
నామము గళమున పలుకగా నాదమై నాలో నిలువవే
నీ నామకీర్తన సలిపే భాగ్యము నీయవే... ॥ఏహి॥



పదములే పరిమళసుమములు
పాటలే పూమాలికలు
భావనే బహువిధభోజ్యనైవేద్యములు
మాధవసేవకై మానసపూజావిధములు... ॥ఏహి॥



# ఈ బ్రహ్మోత్సవాలలో... ఎన్ని విశేషాలో!

–'సారస్వతకళానిధి' డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 93941 13848

తాళ్లపాకవారిఆశ్రయంలో తిరుమల మీద ఉంటూ గ్రంథాలు రచించిన తరికుండ వెంకమాంబ శ్రీవేంకటాచలమాహాత్మ్యం చెప్పుకోదగ్గది. సంస్కృతంలో ఉన్న పురాణాలలోని శ్రీవేంకటాచల సంబంధి అంశాలను చక్కగా సమన్వయించి వెంకమాంబ రాసిన ఈ మాహాత్మ్యగ్రంథంలో ద్వితీయాశ్వాసంలో బ్రహ్మోత్సవ సంబంధి అంశాలున్నాయి.

“చతుర్ముఖా! నీవు తిరుమలలో నా వాసానికి సంబంధించి అన్నీ సమర్థవంతంగా చేశావు. నీవు సత్యలోకానికి వెళ్లడానికి అనుమతి కూడా ఇచ్చాను కదా!” అని చెప్పినా బ్రహ్మ కదలలేదు. “ఏమిటీ సత్యలోకపాలకా! ఊరకున్నావెందుకు? మనసులోని మాట ఏదో చెప్పరాదా”అన్నాడు స్వామి. అపుడు బ్రహ్మ–“మీరూ రమాదేవి నా విన్నపం ఆలకించండి. ఇది వేంకటగిరి. విఖ్యాతమైంది. మీకు మీ స్థాయికి తగ్గట్టు ఉన్నత రథోత్సవం చేయాలని మా సంకల్పం. చిత్తగించండి” అనడంతో స్వామి అంగీకారం తెలిపాడు. స్వామి అంగీకారంతో బ్రహ్మ మునులు, దేవతలతో సంప్రదించి విశ్వకర్మని రప్పించాడు. వివిధచిత్రవీధులతో పురంనిర్మించమని బ్రహ్మ ఆదేశించాడు. బ్రహ్మ ఆనతితో విశ్వకర్మ సర్వం సమకూర్చి వీధులలో విహారాలకు తగినట్లు కాంచనరథం తీర్చి ఇచ్చాడట. అపుడు బ్రహ్మ విఖనసమునితో లగ్నం కుదర్చమన్నాడట, అపుడా విఖనసమహర్షి–

........... 'గన్యారాశియందు సూర్యుఁ
డమరఁ బ్రవేశించినట్టి మాసనమునఁ జి
త్రాఖ్య నక్షత్రంబునందు శాస్త్ర
మభిమతంబున సద్ధ్వజారోహణము చేసి,
యుత్తరాషాఢ రథోత్సవంబు
గావించి, శ్రవణ నక్షత్రమందే తీర్థ
వారిఁ జేయింపఁగా వలయు' **(2-120)**

బ్రహ్మ సరేనన్నాడు. ఉత్సవవీక్షణకు సకలదేశాధిపతులు పాల్గొనడానికి వీలుగా రావలసిందని చారుల ద్వారా వర్తమానం పంపాడు. ఈ సందర్భంలో వేంకమాంబ ఒక వచనంలో 'ద్రవిడ, కర్ణాట, కురు, కుకుర, కేకయ, కోసల, మగధ, మాళవ, శూరసేన, చోళ, నేపాళ, మలయాళ, బంగాళ, పాండ్య, పాంచాల, కొంకణ, టేంకణ, విదర్భ సౌరష్ట్ర, శక, సౌవీర, యుగంధర ఆంధ్ర, విదేహ, మత్స్య, పుళింద, చేది, త్రిగర్త, సింధు, లాట, కాంభోజ, కాశ్మీర, మహారాష్ట్ర దేశాధీశ్వరులకు బ్రహ్మోత్సవ వార్తలు తెలియజేస్తే వారందరు బంధుమిత్ర, కళత్రపుత్రసహితంబుగా విచ్చేసి పుష్కరిణిలో స్నానంచేసి శ్రీవరాహస్వామిని దర్శించి ఆపై శ్రీవేంకటేశ్వరుని సేవించారట.

బ్రహ్మ విష్వక్సేనునితో “నా తండ్రికి మహోత్సవం జరిపించాలి. సకలసన్నాహాలు చేయమం”టే విష్వక్సేనుడు అలాగే చేశాడట. వేంకమాంబ ఉత్సవాదులకు సంబంధించి ఒక సుదీర్ఘవచనం రాసింది. నాటి వాహనాల క్రమానికి నేటికి ఒకటిరెండు తేడాలు కన్పిపిస్తాయి. ఆపై వేంకమాంబ రథోత్సవాన్ని నాలుగుపద్యాలలో రమణీయంగా వర్ణించింది. స్వామి రథోత్సవానికి పులకించి..

చ॥ స్థిరమతితోడ నీ విచటఁ జేసిన దివ్యరథోత్సవంబు భా
స్వరమగు భక్తి నిచ్చటికి వచ్చుచుఁ జూచుచు నుందువారు దు
స్తరభవ ఘోరవారినిధి దాఁటి సుఖింతురు, వారినెల్ల నేఁ
గరుణను బ్రోచుచుందునిది గట్టిగనమ్ము విధాతా! నీ మదిన్ **(2.136)**

అని వాగ్దానం చేశాడట. ఆపై బ్రహ్మాదులకు తమ తమ లోకాలకు వెళ్లడానికి అనుమతిచ్చాడు స్వామి. ఆపై శ్రీభూమీనీళాసమేతంబుగా అంతర్విమానంలో ప్రవేశించాడని వేంకమాంబ ముగించింది. కాలానుగుణంగా బ్రహ్మోత్సవనిర్వహణలో కొన్ని మార్పులు అనివార్యమనడం తప్పేమీ కాదు.

**108 దివ్యదేశాలు**

# తిరుక్కండియూర్

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

ఈ దివ్యదేశం తంజావూరునుండి తిరువయ్యావూర్ వెళ్లే దారిలో 10 కి.మీ. దూరంలో ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన స్వామి హరశాపవిమోచన పెరుమాళ్. అష్టవీరస్థలం, త్రిమూర్తి క్షేత్రం అని ఈ క్షేత్రానికి పేర్లు. సుమారు 0.61 ఎకరాల విస్తీర్ణంలో రెండుప్రాకారాలతో, రాజగోపురంతో మహామండపం, అర్థమండపం మొదలైన మండపాలతో శోభాయమానంగా వెలుగొందే దివ్యక్షేత్రం ఇది. ఇక్కడ ఉన్న అమ్మవారు కమలవల్లి తాయారు. ఈ ఆలయంలోపలి ప్రాకారంలో నరసింహమూర్తి, చక్రత్తాళ్వార్, గరుత్మంతుడు, ఆండాళ్ల సన్నిధులు ప్రత్యేకంగా ఉన్నాయి.

## స్థలపురాణం

ఒకసారి శివుడికి బ్రహ్మహత్యాదోషం ఏర్పడింది. ఈ దోషాన్ని పోగొట్టుకోవడంకోసం శ్రీమన్నారాయణుణ్ణి శివుడు ప్రార్థించగా ఆ దేవదేవుడు తన శ్రీపాదతీర్థం చేత ఆపాతకం తొలగిపోతుంది అని చెప్పాడు. శివుడు అనేక పుణ్యక్షేత్రాలకు వెళ్లి ప్రయత్నిస్తూ చివరగా తిరుక్కండియూర్‌లోని స్వామిని సేవించిన తర్వాత, ఆ భూమిని గదతో త్రవ్వగా నీటిప్రవాహం పైకి వచ్చింది. శివుడు ఆనీటితో స్నానం చేయగా శివునికి బ్రహ్మహత్యాదోషం తొలగింది. అసురచక్రవర్తి అయిన మహాబలి ఆ దేవదేవుడికి సంబంధించిన ఒక స్వర్ణాభరణాన్ని అపహరించి పాతాళలోకానికి వెళ్లిపోయాడు. తెలిసి చేసిన ఈ పాపానికి చాలా చింతించాడు. తరువాత ఈ తిరుక్కండియూర్‌క్షేత్రానికి వచ్చి హరశాపవిమోచనస్వామి ముందు తన తప్పును మన్నించమని ప్రార్థించాడు. కృపాసముద్రుడైన శ్రీమన్నారాయణుడు తన చేతిలో ఉన్న తామరపుష్పంతో ఆ భూమిని స్పృశిస్తే ఒక పుష్కరిణి ఏర్పడింది. అందులో స్నానంచేసి అతని పాపాన్ని పోగొట్టుకోమని అనుగ్రహించాడు. మహాబలి అలాగే ఆ పుష్కరిణిలో స్నానం చేసి తన పాపాన్ని పోగొట్టుకున్నాడు. అప్పటినుండీ ఆ పుష్కరిణికి బలితీర్థం అని పేరు.

ఒక విద్వాంసుడు కపిలమహర్షి కూతురును వివాహం చేసుకుని మామగారి ఐశ్వర్యాన్నంతా లాక్కున్నాడు. పరస్త్రీ సాంగత్యంతో భార్యను పోగొట్టుకున్నాడు. చివరికి కుష్ఠరోగం పీడితుడై ఈ తిరుక్కండియూర్ వచ్చి పద్మతీర్థంలో స్నానం చేసి తన వ్యాధిని పోగొట్టుకున్నాడు. మగధదేశానికి చెందిన కాలవర్మ అనే ఒక బ్రాహ్మణపండితుడు గర్వం చేత అందరిని పోగొట్టుకొని తన దుష్టప్రవృత్తి చేత వ్యాధి బారిన పడి పలు జన్మలెత్తి దుఃఖాలను పొంది ఒక పుణ్యవిశేషం చేత ఈ తిరుక్కండియూర్ క్షేత్రానికి వచ్చి కపాలమోక్షతీర్థసమీపంలో వాసం చేసి తన వ్యాధి పోగొట్టుకుని మోక్షాన్ని పొందాడు. ఇలా ఈ క్షేత్రంలో అనేకమంది పాపాత్ములు పుణ్యనదిలో, పుష్కరిణిలో స్నానంచేసి ఈ భగవంతుని అనుగ్రహవిశేషంతో సద్గతి పొందారు. తిరుమంగైయాళ్వార్లు ఈ దివ్యదేశాన్ని కీర్తించాడు. ఇక్కడ వైఖానస ఆగమం ప్రకారం పూజలు జరుగుతాయి.







## తిరుమల తిరుపతి దేవస్థానములు


**2022, ఆగష్టు 07 నుండి 10వ తేదీ వరకు జరిగిన శ్రీవారి పవిత్రోత్సవ దృశ్యాలు.**
**ఈ ఉత్సవాల్లో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి,**
**తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు పాల్గొన్నారు.**











తిరుమల తిరుపతి దేవస్థానములు

### తిరుచానూరు
### శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

2022 నవంబరు 20 నుండి 28 వరకు



**20-11-2022 ఆదివారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: చిన్నశేషవాహనం

**21-11-2022 సోమవారం**
పగలు: పెద్ద శేషవాహనం
రాత్రి: హంసవాహనం

**22-11-2022 మంగళవారం**
పగలు: ముత్యపుపందిరి వాహనం
రాత్రి: సింహ వాహనం

**23-11-2022 బుధవారం**
పగలు: కల్పవృక్ష వాహనం
రాత్రి: హనుమద్వాహనం

**24-11-2022 గురువారం**
పగలు: పల్లకీ ఉత్సవం, సా. వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**25-11-2022 శుక్రవారం**
పగలు: సర్వభూపాలవాహనం
రాత్రి: గరుడవాహనం

**26-11-2022 శనివారం**
పగలు: సూర్యప్రభ వాహనం
రాత్రి: చంద్రప్రభ వాహనం

**27-11-2022 ఆదివారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**28-11-2022 సోమవారం**
పగలు: పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ అవబృథోత్సవం, చక్రస్నానం, పంచమీ తీర్థం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం

# శ్రీ కనకదుర్గాదేవి దివ్య అలంకారాలు

ఆశ్వయుజశుద్ధపాడ్యమి నుంచి దశమివరకు అత్యంతవైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. అధిష్ఠానదేవతను ఒక్కొక్కరోజు ఒక్కో అలంకారంతో తొమ్మిదిరోజులు తొమ్మిది అలంకారాలు చేసి పదవరోజు విజయదశమినాడు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో శ్రీఅమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి అలంకారాలు 'సప్తగిరి' పాఠకులకోసం ప్రత్యేకం...



## శ్రీ స్వర్ణకవచాలంకృత శ్రీదుర్గా దేవి

దసరా మహోత్సవాలలో తొలిరోజున శ్రీ కనకదుర్గాదేవిని స్వర్ణకవచంతో అలంకరిస్తారు. అష్టభుజాలతో, నక్షత్రాల కంటే అధికమైన కాంతి కలిగిన ముక్కుపుడక ధరించి, పసిడిఛాయ కలిగిన మోముతో అమ్మ దర్శనమిస్తుంది. సింహవాహనాన్ని అధిష్ఠించి శంఖం, చక్రం, గద, శూలం, పాశం, మహాఖడ్గం, పరిఘ అనే ఆయుధాలు ధరించి ఉంటుంది. సకలశత్రుబాధలు నివారిస్తుంది. ఈ అమ్మను ఆరాధిస్తే సకలవిజయాలు లభిస్తాయి.

**పూజాద్రవ్యాలు :** పసుపు అక్షతలు, పసుపు పూలు. **నివేదన:** పులిహోర



## శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి

త్రిపురాత్రయంలో బాలాత్రిపురసుందరి తొలిదేవత. మనస్సు, బుద్ధి, అహంకారం ఈ తల్లి అధీనంలో ఉంటాయి. అభయహస్తం, వరదముద్ర ప్రదర్శిస్తూ అక్షమాల ధరించి ఉంటుంది. ఈమెను ఆరాధిస్తే నిత్యసంతోషం కలుగుతుంది. శ్రీచక్రసంప్రదాయంలో షోడశీవిద్యకు ఈమె అధిదేవత. ఈమె అనుగ్రహంవల్ల మంచి సంతానం కలుగుతుంది.

**పూజావిధి :** కుమారీపూజ చేయాలి. **నివేదన:** పాయసం



## శ్రీ గాయత్రీ దేవి

వేదమాత గాయత్రి. అన్ని మంత్రాలకు మూలశక్తి. ఐదు ముఖాలతో శంఖం, చక్రం, గద. అంకుశం ధరించి ఉంటుంది. గాయత్రీ ఉపాసన ద్వారా బుద్ధి వికసిస్తుంది. ఈ తల్లి ఉపాసన ద్వారా అనంతమైన మంత్రశక్తి కలుగుతుంది. అన్ని సకల దురిత ఉపద్రవాలూ తొలగుతాయి. బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. గాయత్రీమంత్రపారాయణ, వేదపారాయణ చేసిన ఫలితాన్ని ఇస్తుంది.

**పూజావిధి :** వేదపండితులను అర్చించాలి. **నివేదన:** అల్లపుగారె



## శ్రీ అన్నపూర్ణా దేవి

ఒక చేతిలో మధురసాలతో కూడి ఉన్న మాణిక్యపాత్ర, మరొక చేతిలో అన్నాన్ని అనుగ్రహించే రతనాల గరిటె ధరించిన రూపంలో అమ్మ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిస్తుంది. ఈ అవతారంలో అమ్మ ఎర్రనిశరీరం, మెడలో తారహారాలు ధరించి, నిండు చంద్రునివలె అందమైన ముఖంతో, విశాలమైన త్రినేత్రాలతో భాసిల్లుతుంది. ఈ తల్లిని ఉపాసన చేసినవారు పుత్రపౌత్రాభివృద్ధి, బ్రహ్మతేజస్సు పొందుతారు.

**పూజాద్రవ్యాలు :** లేత ఎర్రని లేదా తెల్లని పూలు. **నివేదన:** పెరుగన్నం, కట్టెపొంగలి



## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి

త్రిపురాత్రయంలో ఈమె రెండోదేవత. మణిద్వీపనివాసిని. శ్రీవిద్యాస్వరూపిణి. ఉపాసకులకు ముఖ్య ఆరాధ్యదేవత. చైతన్యం అనే అగ్నికుండంనుంచి అమ్మ ఆవిర్భవించింది. ఈ అలంకారంలో దుర్గమ్మ కోటిసూర్యులప్రకాశకాంతి స్వరూపంతో వెలిగిపోతుంది. చేతిలో పాశం, అంకుశం, చెఱకు విల్లు, పూలబాణాలు ధరించి ఉంటుంది. ఈమెకు లక్ష్మీసరస్వతులు ఇరువైపులా వింజామరలతో వీస్తూ, సేవలు చేస్తుంటారు. ఈమెను ఉపాసించటం ద్వారా సకల ఐశ్వర్యప్రాప్తి కలిగి, దారిద్ర్యదుఃఖం నశిస్తుంది.

**పూజాద్రవ్యం:** కుంకుమ. **నివేదన:** పాయసం



# దసరా మహోత్సవాలు



## శ్రీ మహాలక్ష్మీ దేవి

ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా, రెండుచేతులతో కమలాలు ధరించి, అభయవరదముద్రలతో శ్రీమహాలక్ష్మి భక్తులకు దర్శనమిస్తుంది. త్రిపురాత్రయంలో మహాలక్ష్మి మధ్యశక్తి. ఈ తల్లి ఉపాసన ద్వారా లౌకికసంపాదనతో పాటు అలౌకికమైన మోక్షసంపద కూడా లభిస్తుంది. ఈమె శీఘ్రఫలదాయిని.

**పూజాద్రవ్యాలు:** ఎర్రని పుష్పాలు. **నివేదన:** పూర్ణాలు



## శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)

మూలానక్షత్రం నాటి సరస్వతీదేవి అలంకారానికి ఎనలేని ప్రాముఖ్యం ఉంది. వాక్కు, బుద్ధి, విజ్ఞానం, కళలు... అన్నిటికీ ఈమె అధిష్ఠానదేవత. కచ్ఛపి అనే వీణ. పుస్తకం, అక్షమాల, ధవళవస్త్రాలు ధరించి, నెమలిని అధిరోహించిన రూపంలో ఈ తల్లి దర్శనమిస్తుంది. సరస్వతీ ఉపాసనతో లౌకికవిద్యలతో పాటు అలౌకికమైన మోక్షవిద్య కూడా అవగతమౌతుంది.

**పూజాద్రవ్యాలు:** తెల్లనిపూలు. **నివేదన:** దద్యోదనం, చక్కెరపొంగలి



## శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)

దుర్గాదేవి సర్వదుఃఖాలను నశింపజేస్తుంది ఉగ్రరూపంతో దుష్టులను సంహరిస్తుంది. పరమశాంతమూర్తిగా భక్తులను కాపాడుతుంది. పంచప్రకృతి స్వరూపాల్లో తొలిమూర్తి. ఎర్రనిచీరె, మణులు పొదిగిన కిరీటం, ఎనిమిది చేతులతో కత్తి, డాలు, గద, శంఖం, కలశం, త్రిశూలం, చక్రం, ధనుర్బాణాలు ధరించి ఉంటుంది. సింహవాహనాన్ని అధిరోహిస్తుంది. ఈ తల్లిని ధ్యానిస్తే సర్వరోగాలు నశిస్తాయి.

**పూజాద్రవ్యాలు:** చామంతి, పొగడ, సంపెంగ, మల్లెపూలు, దానిమ్మపండు, ఎర్రని అక్షతలు.
**నివేదన:** పొంగలి, పులిహోర, పులకం.



## శ్రీ మహిషాసురమర్ధనీదేవి (మహర్నవమి)

దివ్యతేజస్సుతో, అనేక ఆయుధాలతో, సింహవాహినియై ఈ తల్లి దర్శనభాగ్యం కలిగిస్తుంది. మహిషాసుర సంహారం జరిగిన నవమి రోజునే 'మహర్నవమి'గా జరుపుకోవటం ఆచారంగా వస్తోంది. ఈ రోజున చండీ ఆరాధన చేసిన వారికి 'శత్రుభయం' ఉండదు. అన్నిటా విజయం కలుగుతుంది.

**పూజావిధి:** సువాసినీ పూజ చేసి మంగళద్రవ్యాలు, పసుపుకుంకుమలు, శక్తి కొద్దీ నూతన వస్త్రాలు ఇవ్వాలి.
**నివేదన:** పానకం, వడపప్పు, గారెలు, పులిహోర, పాయసాన్నం.



## శ్రీ రాజరాజేశ్వరీ దేవి (విజయదశమి)

అపరాజితాదేవిగా కూడా ఈ తల్లి పూజలందుకుంటుంది. సకలభువనబ్రహ్మాండాలకు ఆరాధ్యదేవత. స్వప్రకాశ జ్యోతిస్వరూపంతో, పరమేశ్వరుని అంకాన్ని ఆసనంగా చేసుకుని ఉంటుంది. నిశ్చలచిత్తంతో తనను ఆరాధించిన వారికి ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులను వరంగా అనుగ్రహిస్తుంది. మాయామోహితమైన మానవ మనోచైతన్యం ఈ తల్లి ఉపాసన ద్వారా ఉద్దీపితమౌతుంది.

**పూజాద్రవ్యాలు:** పసుపు పచ్చని పూలు. **నివేదన:** భక్ష్యభోజ్యాలతో మహానివేదన






స్వతంత్ర్యభారతావని 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా
'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా
తి.తి.దే. నిర్వహించిన
స్వాతంత్ర్య దినోత్సవ (15-08-2022) సంబరాల దృశ్యాలు.
ఈ వేడుకల్లో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తి.తి.దే. సంయుక్త
కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,
శ్రీమతి సదాభార్గవి, ఐ.ఏ.ఎస్., మరియు
తి.తి.దే. ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.






మన దేవాలయాలు



# బంగారుతల్లి!

- శ్రీ ఎస్.కె. సైదా, 80088 41447

శరదృతువు మొదటినెల ఆశ్వయుజశుద్ధపాడ్యమి మొదలు నవమివరకు నవరాత్రులని, దశమిని విజయదశమిగా వేడుకలు జరుపుకుంటారు. చైత్ర, ఆశ్వయుజమాసాలలో శుద్ధపాడ్యమి మొదలు శుద్ధనవమివరకు పరమేశ్వరి సర్వశక్తి స్వరూపిణిని పూజించాలి. పరదేవతాప్రీతికరమైన రోజులవి.

ఎందుకంటే వసంతకాలం, శరత్కాలం రెండూ యమధర్మరాజు కోరలు. ఆ కాలాలలో రకరకాల అంటువ్యాధులు వ్యాపిస్తాయి. జననష్టం హెచ్చుగా ఉంటుంది. అందువల్ల అమ్మను ఆరాధించి పూజలు జరిపి పరాశక్తిని ప్రసన్నం చేసుకుంటే లోకక్షేమమని, శత్రుభయం, మృత్యుభయం ఉండవని, సకలశుభాలు కలుగుతాయని నమ్మకం. అందుకనే ఈ దేవీ శరన్నవరాత్రుల్ని దేశమంతా ఎంతో ఆనందంగా ఆధ్యాత్మికవాతావరణంలో భక్తితో జరుపుకుని, ఆదిపరాశక్తిని పూజిస్తారు.

అలాంటి ఆదిపరాశక్తి కొలువుదీరిన పుణ్యక్షేత్రం అమ్మలగన్న అమ్మ ఆలయవిశేషాలు.

దక్షిణభారతదేశంలో సుప్రసిద్ధపుణ్యక్షేత్రాలలో రెండవస్థానం కలిగి, శ్రీశక్తిపీఠాలలో ఒకటిగా ప్రశస్తమైన కోవెల బెజవాడ కనకదుర్గ ఆలయం. దివ్యమకరతోరణానికి మధ్య మూల విరాట్ స్వరూపం స్వర్ణకవచాలంకృత శ్రీకనకదుర్గాదేవి దేదీప్యమానంగా ప్రకాశిస్తూ సూర్యచంద్రుల్ని ఇరువైపులా దాల్చి సకలదేవతలు కొలిచే నవరత్నఖచితస్వర్ణకిరీటాన్ని ధరించి, స్వర్ణదివ్యకర్ణాభరణాలతో త్రిశూలధారిణియై జగన్మోహనమైన దేవి పసుపుపచ్చని ముఖసౌందర్యమే ఈ క్షేత్రానికి అత్యంత ఆకర్షణ. చూసినకొద్దీ చూడాలనిపించే బాలారుణప్రశాంతతతో వెలుగొందే బాలాత్రిపుర సుందరి ఈ కనక దుర్గమ్మ.

కృతయుగంలో దుర్గమాసుర, మహిషాసుర సంహారానంతరం దేవి కనకప్రభలతో ఇంద్రకీలాద్రిపర్వతంమీద వెలసిన కారణంగా ఇది కనకపురి అని, కనకవాడ అని ప్రసిద్ధి చెందింది. ద్వాపర యుగంలో పాశుపతాస్త్రం కోసం పాండవమధ్యముడైన అర్జునుడు ఈ బీజపురిలో ఉన్న ఇంద్రకీలాద్రి మీద తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని సాధించి విజయాన్ని పొందిన కారణంగా ఈ క్షేత్రం విజయపురిగా, విజయవాడగా పేరు పొందింది.

## క్షేత్రపురాణం

ఇంద్రకీలాద్రి పర్వత పాదభాగాన్ని తాకుతూ పరవళ్లు తొక్కే కృష్ణమ్మ చెంతగల ఈ పర్వతానికి ఈ పేరు రావడానికి ఐతిహ్యం ఉంది. పూర్వం కీలుడు అనే యక్షుడు ఆదిపరాశక్తి అయిన దుర్గాదేవి గురించి తీవ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకి మెచ్చిన అమ్మవారు కీలుణ్ణి వరం కోరుకోమనగా పరమసంతోషంతో జగన్మాతను అనేక విధాలా స్తుతించి "అమ్మా నీవు ఎల్లప్పుడూ నాపై నివసించి ఉండు" అని కోరాడు. అందుకు ఆ దుర్గాదేవి "ఓ యక్షా! నీవు పరమ పవిత్రమైన ఈ కృష్ణానది ఒడ్డున పర్వతరూపాన్ని ధరించు. కృతయుగంలో అసుర సంహారానంతరం నేను ఆ పర్వతం

మీద కొలువుంటాను" అని వరం ప్రసాదించింది. కీలుడు పర్వత రూపాన్నిపొంది దేవి ఆవిర్భావం కోసం ఎదురుచూడసాగాడు.



తదుపరి కృతయుగంలో మహిషాసురుణ్ణి సంహరించాక దుర్గాదేవి కీలుడి కిచ్చిన మాట ప్రకారం మహిషాసురమర్దినీ స్వరూపంతో కీలాద్రిమీద ఆవిర్భవించింది. స్వర్ణమణిమయకాంతులతో, కోటిసూర్యసమప్రభలతో ప్రకాశిస్తున్న ఆ మహిషాసురమర్దిని కొలువున్న కీలాద్రి పర్వతం మీదికి ఇంద్రాది దేవతలంతా వచ్చి నిత్యం దేవికి పూజలు చేయసాగారు. ఆనాటినుంచి ఈ పర్వతానికి ఇంద్రకీలాద్రి అని పేరువచ్చింది. దుర్గాదేవి కనకవర్ణంలో అవతరించటంవల్ల ఈపర్వతం కనకకాంతులతో విరాజిల్లుతుంది.

## శ్రీ అమ్మవారి శ్రీచక్రం

శ్రీచక్రఅధిష్ఠానదేవత శ్రీదుర్గామాత. మహిషాసుర సంహారానంతరం, దుర్గాదేవి అదే స్వరూపంతో ఇక్కడ స్వయంభువుగా రౌద్రస్వరూపంతో వెలసింది. ఆనాటి వీరశాక్తేయ భక్తులంతా దేవికి వామాచారపద్ధతిలో జంతుబలులు నివేదించి పూజలు చేసేవారు. దాంతో దేవీమూర్తి మరింత ఉగ్రరూపాన్ని ధరించింది. ఈస్థితిని గమనించిన జగద్గురువు ఆదిశంకరాచార్యులు అమ్మవారిని శాంతిస్వరూపిణిగా మార్చి ఇక్కడ తమ మంత్రశక్తితో శ్రీచక్రయంత్రాన్ని ప్రతిష్ఠించారు.

నిత్యార్చనలు, కుంకుమార్చనలు అన్నీ దేవి మూల విరాట్‌కే కాక, అమ్మవారి ప్రతిరూపమైన శ్రీచక్రానికీ జరుగుతూ ఉంటాయి. తరతరాలుగా పూజలందుకునే శ్రీచక్రం ఎంతో మహిమాన్వితమైంది.

## శరన్నవరాత్రి మహోత్సవాలు

ఆశ్వయుజశుద్ధపాడ్యమినుండి దశమివరకు (ఈ సంవత్సరం సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 5 వరకు) వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి.

శరన్నవరాత్రిమహోత్సవాలలో అధిష్ఠానదేవతకు ఒక్కొక్కరోజు ఒక్కో అలంకారంతో తొమ్మిదిరోజులు తొమ్మిది అలంకారాలు తిథులప్రకారంచేసి చివరిరోజైన పదవరోజు విజయదశమినాడు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తిథులు హెచ్చుతగ్గుల వల్ల తొమ్మిది లేదా పదకొండురోజులు దసరాఉత్సవాలు చేయాల్సి వస్తుంది. తొమ్మిది రోజులైనప్పుడు ఒకేరోజు తిథులనుబట్టి రెండు అలంకారాలు, పదకొండురోజులు వస్తే శ్రీకాత్యాయనీదేవి అలంకారం చేస్తారు.

దసరాపదిరోజులలో అమ్మవారి దర్శనార్థం లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. ఆలయంలో కుమారీపూజ, సుహాసినీ పూజలతోపాటు ప్రత్యేకంగా, విశేషంగా కుంకుమార్చనలు, శతచండీయాగం, శ్రీచక్రనవావరణార్చనలు భక్తులచే నిర్వహించబడుతాయి. ప్రతినిత్యం ప్రదోషకాలంలో అంగరంగవైభవంగా నగరోత్సవం నిర్వహించబడును.

కెనాల్‌రోడ్డులోగల శ్రీవినాయకుడిగుడివద్ద నుండి దర్శనం క్యూలైన్లు ఘాట్‌రోడ్ మీదుగా శ్రీఅమ్మవారి ఆలయం వరకు ఏర్పాటు చేస్తారు.

## మూలానక్షత్రం

శ్రీఅమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రంరోజు శ్రీఅమ్మవారు చదువులతల్లి సరస్వతీదేవిగా దర్శనమిస్తారు. మూలానక్షత్రం రోజున శ్రీసరస్వతీదేవిఅలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శనం చేసుకుంటే జ్ఞానసంపద కలుగుతుందని భక్తుల

ప్రగాఢవిశ్వాసం. మూలానక్షత్రంరోజునే ఆంధ్ర ప్రదేశ్‌రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వర్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

దుర్గాష్టమిరోజున అమ్మవారు దుర్గాదేవిగా దర్శన మిస్తారు. వేదవేదాంతవనవాసిని అయిన దుర్గమ్మను రెండు తెలుగురాష్ట్రాలనుండి విచ్చేయు ఘనాపాఠీలు, వేదపండితులు వేద విద్వత్‌సభకు తరలివచ్చి శ్రీఅమ్మవారిచెంత వేదపఠనం చేస్తారు.


ఇదేరోజు తిరుమలతిరుపతిదేవస్థానాలవారిచే శ్రీఅమ్మవారికి దేవస్థానం తరపున ధర్మకర్తలమండలి అధ్యక్షులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయదశమిరోజున సామాన్యభక్తులేకాక అధిక సంఖ్యలో వచ్చేభవానీభక్తులచే ఇంద్రకీలాద్రి అరుణవర్ణమై శోభాయమానమౌతుంది.



## తెప్పోత్సవం

దసరామహోత్సవాలలోభాగంగా విజయదశమి రోజున ఇంద్రకీలాద్రి అధిష్ఠానదేవత అయిన శ్రీకనకదుర్గాదేవికి కృష్ణా నదిలో నిర్వహించే హంసవాహనసేవ కనులపండువగా తిలకించడానికి లక్షలాదిమంది భక్తులు ఉవ్విళ్లూరుతారు. ఈ జలవిహారాన్ని వేడుకగా అభివర్ణించవచ్చు. హంసవాహనసేవలో త్రిలోకసంచారానికి గుర్తుగా ఆదిదంపతుల చేత మూడువరుసలలో జలవిహారం చేయిస్తారు.



ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

– ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గతసంచిక తరువాయిభాగం...*

మాకు అనుకూలంగా ఉంటే వాటిమీద ప్రేమ. మాకు ప్రతికూలంగా ఉంటే, వాటి మీద మాకు ప్రేమలేదు. ఈ దేహం అనుకూలంగా ఉన్నంతవరకు ఇది కావాలి అనిపిస్తుంది. తరువాత ఏమవుతుందో సరిగ్గా తెలియదు. ఇలాంటి దేహాలు ఎన్నో పోయాయి, ఎన్నోవచ్చాయి, కాబట్టి వీటి మీద ప్రేమ ఉంది అని అనుకోవద్దు. వీటి మీద ప్రేమ నీకు సరిగ్గా లేదు. నీకు నిజమైన ప్రేమ ఉండేది నీ ఆత్మస్వరూపం మీదనే. ఆ విషయం నువ్వు సరిగ్గా తెలుసుకోలేకపోతున్నావు. ఇక్కడ నువ్వు అర్థం చేసుకోవాల్సింది ఇంతే!

పాతబట్టలను విడిచిపెట్టి క్రొత్తబట్టలు కట్టుకున్నట్లుగా పాతదేహాలను విడిచిపెట్టి క్రొత్తదేహాలను ధరించటం అనేది ఆత్మకు ఒక అలవాటు. క్రొత్తవస్త్రాలను ఎంతవరకు ధరిస్తారు అనేవిషయం సరిగ్గా చెప్పలేం కానీ క్రొత్త దేహాలను ఎంతవరకు ధరిస్తారు అంటే తత్త్వజ్ఞానం కలిగేంతవరకు. తత్త్వజ్ఞానం కలిగిన తరువాత క్రొత్తదేహం అనేది లేదు. తత్త్వజ్ఞానం కలిగేంతవరకు క్రొత్తదేహాలను ధరిస్తూనే ఉంటారు. కాబట్టి దేహాల మీద ప్రేమ అనేది అనవసరమైన మాట. ప్రేమ అనేది మన ఆత్మ స్వరూపం మీదనే ఉండాలి. ఆ ఆత్మస్వరూపాన్ని తెలుసుకోవటం మీదనే ప్రేమ ఉండాలి. మిగతా అనవసరమైన విషయాలమీద ప్రేమ పనికిరాదు అని ఖచ్చితంగా చెప్తున్నాడు పరమాత్మ.

రకరకాల శరీరాలను పైపైజన్మలలో మానవులు వాళ్ల వాళ్ల కర్మానుసారంగా పొందుతూ ఉంటారు. దేహాలు మారి పోతున్నా సరే ఆత్మస్వరూపం మారటం లేదు. మరైతే దేహాలు ఎందుకు మారిపోతున్నాయి. ఒకే ఆత్మకు ఒకే దేహం ఉండవచ్చుగదా! ఒక ఆత్మా ఒక దేహం అనే నియమం చేయవచ్చుగదా! అని పరమాత్మ అంటే చేయటానికి వీలులేదు అన్నారు యమధర్మరాజు. మీరు చేసుకున్నటువంటి కర్మలకు ఫలితంగా ఆయా పైపై దేహాలు వస్తాయి అని ముందే చెప్పాడు ఆయన. ఏమి కర్మలు చేసుకుంటారు? పుణ్యం మాత్రమే చేసుకున్నారు అనుకుందాం. పుణ్యంమాత్రమే చేసుకుంటే దేవలోకంలో దేవతాశరీరాలను ఇస్తారు. కేవలం పాపకర్మ తప్ప మరొకటి లేదు అనుకుందాం? ఏమిస్తారు అంటే పశుపక్ష్యాదుల శరీరాలిస్తారు. పశపక్ష్యాది శరీరాలు ఎంత కష్టంగా ఉంటాయి అని మనకు తెలిసిందే కదా? పశుపక్ష్యాదులు హాయిగా అడవిలో రెక్కలు కదుల్చుకుంటూ ఎగురుతాయి అనుకుంటామా లేదు కదా. క్షణక్షణం వాటికి ప్రాణభయం ఉంటుంది క్షణక్షణం ఆహారం దొరుకుతుందా? దొరకదా? అని వెదుకుతూనే ఉంటాయి. వాటి జీవితమంతా భయం పోగొట్టుకోవటానికి, ఆహరం సంపాదించుకోవటానికి ఖర్చైపోతోంది. ఆ జీవితానికి ఒక పరమార్థమే లేకుండా ఉంది. అటువంటి జీవితం వాటిది. కాబట్టి కేవలం పాపకర్మ చేసినట్లయితే అది అలా కాకుండా కాస్త పుణ్యం, కాస్త పాపం కలిపితే ఏ జన్మవస్తుంది అంటే మనుష్యజన్మ వస్తుంది. *(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి

### :: 81 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 భా | 2 ర | తి | | 3 ఇ | 4 ల | | 5 భా |
| 6 సా | | తి | | 7 క | | క్ష్మీ | | ను |
| 8 వి | శ్వ | | 9 భ | ద్రు | డు | | 10 రు | మ |
| త్రి | | 11 ఆ | | వ | | 12 రే | | తి |
| | 13 గా | య | త్రి | | 14 వే | ణు | వు | |
| 15 శ్వే | | తి | | 16 అ | | క | | 17 అ |
| 18 త | ల్లి | | 19 వి | న | త | | 20 అ | న్న |
| కి | | 21 క | | సూ | | 22 సీ | | మ |
| | | 23 వి | జ | య | | త | | య్య |



మందహాస మధురసుందర ముఖదేవ! శ్రీనివాస!

ఈ నెల 26 నుండి కార్తికమాసం ప్రారంభం...

గృహలక్ష్మి

# కైలాసనివాస అర్హత కావాలంటే...


- డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు,
98485 43520

కార్తికమాసం హరిహరపూజకు ఎంతో విశిష్టమైంది. ఈ మాసంలో ప్రత్యేకించి సూర్యోదయానికి ముందు చేసే స్నానాలు, ఆ తర్వాత చేసే దానాలు, ఉపవాసాలకు గొప్ప శక్తి ఉందని కార్తికపురాణం వివరిస్తోంది. కార్తికపురాణాన్ని ఎవరైనా వింటే చాలు అది చెప్పినవారికి, విన్నవారికి పుణ్యం కలుగుతుంది.

కార్తికమాసంలో శుక్లపాడ్యమి మొదలుకుని మాసాంతం వరకూ వ్రతాన్ని చేయాలి. ఈ మాసంలో కావేరినదీస్నానం మరింత పుణ్యఫలాన్నిస్తుంది. సూర్యోదయ సమయంలో కావేరినదిలో స్నానంచేయాలి.

ఈ మాసంలో సూర్యుడు తులారాశిలో ప్రవేశించగానే భూమిమీద ఉన్న బావులు, చెరువులు, దిగుడుబావులు, చిన్నకాలువలు, నదులులాంటి అన్ని జలాలలోనూ శ్రీహరి నివసిస్తూ ఉంటాడు. కార్తికవ్రతం అన్ని కులాలవారూ ఆచరించవచ్చు.

ఉదయాన స్నానంచేయటం, భక్తితో పూజలు నిర్వహించటం, అనంతరం కార్తికపురాణపఠనం లేదా శ్రవణం ఇలా వాటితో వ్రతం నడుస్తూ ఉంటుంది. సాయంకాల సమయానికి విష్ణుఆలయానికి కానీ, శివాలయానికి కానీ వెళ్లి కొద్ది దీపాలను పెట్టి స్వామికి పూజానైవేద్యాలను సమర్పించాలి.



కార్తికవ్రతం జరుగుతున్నప్పుడు చూసినా పుణ్యఫలమే. కార్తికమాసంలో ప్రత్యేకంగా సోమవారవ్రతం ఉంది. ఈ వ్రతాన్ని చేసినవారికి కైలాసనివాస అర్హత లభిస్తుంది. కార్తిక సోమవారంనాడు చేసిన స్నానం, దానం, జపం అనేవి అశ్వమేధయాగం చేసినంత ఫలితాన్ని ఇస్తాయి.

కార్తికమాసంలో ఉపవాసానికి మరీమరీ ప్రత్యేకత ఉంది. ఒంటిపూట భోజనం, రాత్రిపూట భోజనం, ఛాయా నక్తభోజనం, స్నానం, తిలదానం, పూర్తి ఉపవాసం అనే ఆరు విధాలుగా ఉపవాసదీక్షను శక్తికొద్దీ చేయవచ్చు.

"కార్తికపురాణాన్ని ఎవరైనా వింటేచాలు అది చెప్పినవారికి, విన్నవారికి పుణ్యం కలుగుతుంది."

పూర్తిగా ఉపవాసం ఉండలేనివారు ఒంటిపూట భోజనం చెయ్యవచ్చు. ఛాయానక్తభోజనమంటే సూర్యకాంతి తగ్గిన తరువాత రెట్టింపు కొలతకు తన నీడ రాగానే పగటిపూటే భుజించటం, దాదాపు సాయంత్రం నాలుగున్నరగంటల వేళ భుజించటమని అర్థం.

ఇలా ఉపవాసాలేవీ ఉండలేనివారు ఉదయంపూట పూజకాగానే పండితులకు భోజనంపెట్టి, ఆ పగటిపూట తానూ భోజనం చెయ్యవచ్చు. కార్తికమాసంలో ఈ ఉపవాస పద్ధతుల్లో ఏదో ఒకదాన్ని తప్పక ఆచరించాలి. ఈ నియమాల్లో ఏదో ఒకదాన్ని పాటిస్తూ సోమవారంనాడు శివలింగానికి అభిషేకం, పూజచేసి రాత్రిపూట భుజించే వారంటే శివుడికి ఎంతో ఇష్టం.



ఈ నెల 2వ తేదీ హనుమద్వాహన సేవ సందర్భంగా...

# శ్రీవేంకటాద్రి మీది శ్రీరామ!

- డా॥ సూరపరాజు వసంతకుమారి

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆరవరోజు ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామి రామావతారంలో వరద హస్తంతో వేంకటాద్రి రాముడై హనుమద్వాహనంపై తిరుమల మాడవీథులలో విహరించి భక్తులకు దర్శనభాగ్యాన్నిస్తాడు. శ్రీమలయప్ప స్వామివారు సర్వాలంకారభూషితుడై శ్రీరాముని రూపంలో కోదండాన్ని చేతదాల్చి, హనుమంతుని భుజంపై కూర్చొని, అతని రెండు అరచేతులపై తన పాదాలుంచి హనుమద్వాహనంపై తానే భక్తుల చెంతకు తరలివస్తాడు. శ్రీవారి వాహనాలన్నింటిలో స్వామివారిని ఇలాభుజాలపై కూర్చోబెట్టుకునివారి పాదాలను తమ అరచేతులపై ఉంచుకొని సేవిస్తున్న వాహనసేవలు రెండే రెండు. అవి గరుడవాహనం మరియు హనుమద్వాహనం. అన్ని అవతారాల్లో స్వామిని సేవించిన గరుడసేవను పెరియ తిరువడిగా, రామావతారంలో స్వామిని సేవించిన హనుమసేవను సిరియ తిరువడిగా భక్తులు కొలుస్తారు.

అలనాటిరాముడే నేటి శ్రీనివాసుడు. శ్రీవేంకటేశ్వరస్వామివారి గర్భాలయంలో శ్రీరామసీతాలక్ష్మణవిగ్రహాలు నిత్యమూ పూజలందుకుంటున్నాయి. శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసునాడు మరియు శ్రీరామనవమి ఇత్యాది పర్వదినాల్లో, విశేషపూజలందుకొంటూ ఉన్నాయి. అలనాడు విశ్వామిత్రుడు శ్రీరామచంద్రుడిని మేలుకొల్పిన- 'కౌసల్యా సుప్రజారామ....' అనే శ్లోకంతోనే, నిత్యమూ శ్రీవేంకటేశ్వరస్వామి నిదురలేపేవేళ పఠించే శ్రీవారిసుప్రభాతం ప్రారంభమౌతుంది. శ్రీవేంకటేశాష్టోత్తరశతనామావళిలో 12వ నామంగా మరియు సహస్రనామస్తోత్రంలో 198వ నామంగా "ఓం రామాయ శ్రీవేంకటేశాయనమః" అని నిత్యం పారాయణం చేస్తారు. శ్రీవేంకటేశస్తోత్రంలోని "అభిరామగుణాకర", "అవనీతనయా కమనీయకరమ్" మరియు "సుముఖం సుహృదం" అని నిత్యం పఠించబడుతూ ఉన్న శ్లోకాల్లో శ్రీరామస్తుతి ఉంది. శ్రీరాముడే శ్రీవేంకటేశ్వరుడని, వేంకటాద్రి మీది రాముడిని దర్శిస్తూ అన్నమయ్య అనేక సంకీర్తనల్లో స్తుతించాడు.

సప్తగిరుల్లోని ఏడుకొండల్లో ఒకకొండ అంజనాద్రి. శ్రీవారిఆలయం లోపల తీర్థమంటపంలో, శ్రీవారి ఆలయానికి ఎదురుగా బేడి ఆంజనేయస్వామి ఆలయంలో, జాపాలితీర్థంలోని హనుమాలయంలో, తిరుమలనడకదారుల్లో హనుమంతుడిని భక్తులు దర్శించుకుంటుంటారు. అన్నమయ్య సంకీర్తనల్లో 55 సంకీర్తనలు హనుమంతునిపై రచించాడు. తిరుమలలోని హనుమంతుని గురించి 12 సంకీర్తనల్లో అన్నమయ్య గానం చేశాడు.

మొట్టమొదటిసారిగా హనుమ శ్రీరామునికి వాహనమైన అద్భుత ఘట్టాన్ని శ్రీమద్రామాయణం కిష్కంధకాండలో కన్పిస్తుంది. హనుమభిక్షు రూపంలో శ్రీరామలక్ష్మణులనుకలసి, వారి గురించి తెలుసుకుని పరమానంద భరితుడై, ఆ వీరులను తన భుజాలపై కూర్చోబెట్టుకుని ఋశ్యమూకపర్వతానికి తీసుకెళ్లి, సుగ్రీవుని వద్దకు చేర్చాడని వివరింపబడింది. శ్రీమద్రామాయణం యుద్ధకాండలో రఘురాముడు కదనరంగంలో హనుమద్వాహనంపైనే నిలిచి రావణునితో యుద్ధం చేశాడు.

## హనుమద్వాహన దర్శనఫలం

రుద్రుడే హనుమగా అవతరించాడు. శ్రీవారిబ్రహ్మోత్సవాల్లో హనుమద్వాహనంపై వేంచేసిన వేంకటాద్రిరాముణ్ణి దర్శించిన భక్తులకు సకలభయాలు, కష్టాలు, రాక్షసబాధలు తొలగి, బుద్ధిబలం, యశస్సు, ఆయుస్సు, ధైర్యం, ఆరోగ్యం, వాక్శుద్ధి, పరోపకారగుణం, వినయం కలిగి, పాపాలు నశించి, సర్వత్రాజయం, మోక్షం లభిస్తాయి.

### నవరాత్రులు

# నవాన్న నైవేద్యాలు

- డా॥ జి.వి.పూర్ణచందు, 94401 72642

నవరాత్రులకాలంలో అమ్మవారికి సమర్పించుకునే వంటకాల ప్రాచీనత, మనజాతి ప్రాచీనత, ఈ పండుగ ప్రాచీనత ఇవి పరస్పరం పెనవేసుకున్న అంశాలు. వాటి పవిత్రత, ప్రాచీనత, నాణ్యత, ఆరోగ్యప్రభావం అర్థం చేసుకోవల్సిన అంశాలు.

## 1) కట్టెపొంగలి

కటుపొంగలి అనే మాట జనవ్యవహారంలో కట్టెపొంగలిగా మారింది. చక్కెర, పెసరపప్పు కలిపి వండిన పొంగలి అన్నాన్ని చక్కెరపొంగలి అంటున్నాం. అదే తీపిలేకుండా పెసరపప్పు, బియ్యం కలిపి వండిన అన్నాన్ని కటుపొంగలి అంటారు. అంటే తీపిలేని కారపు పొంగలి అని అర్థం. పాలను పొంగించి, నానిన బియ్యాన్ని, పెసరపప్పును అందులో వేసి వండితే అది పొంగలి. దీన్నే పొంగల్ అని పిలుస్తారు. పొంగించి వండేది కనుక పొంగలి. అందులో చక్కెర కలిపితే చక్కెరపొంగలి. చక్కెర కలపకపోతే కటుపొంగలి.

బియ్యంలో పెసరపప్పు కలిపి వండిన అన్నాన్ని పులగం అంటారు. 'పుల' అనే తెలుగుపదానికి– కొద్దిగా పసుపు రంగు కలిసిన తెలుపురంగు అనే అర్థం ఉంది. పెసరపప్పు అన్నం ఆ రంగులో ఉంటుంది కాబట్టి 'పులగం' అన్నారు.



ఇందులో ఉప్పుకారాలు కలపరు. నెయ్యి వేసుకుని బెల్లం ముక్కతో తింటారు. అమ్మవారికి స్వచ్ఛమైన పెసరపులగమే గొప్ప నివేదన.

పెసరపప్పు కలపటంలో ఒక సూక్ష్మం ఉంది. మన పప్పుధాన్యాలలోకెల్లా పెసర ప్రాచీనమైంది. ముగురమ్మల మూలపుటమ్మకు, చాల పెద్దమ్మకు, అందరికన్నా మొదటి అమ్మకు, విజయం సాధించి, గర్వంతో పొంగిన అమ్మవారికి దసరాల్లో మొదటిరోజున మన మొదటి ధాన్యాలతో చేసిన మొదటి వంటకం పొంగలిని వండి సమర్పిస్తున్నాం. సంక్రాంతి ధనుర్మాసాన్ని చక్కెరపొంగలితోనూ, దసరా నవరాత్రుల్ని కటు పొంగలితోనూ మొదలుపెట్టడం మన ఆచారం.

## 2) పులిహోర

అన్నపు వంటకాలలో లేదా చిత్రాలలో రారాజు లాంటిది పులిహోర. ఇప్పటికాలంలో మనం చింతపండు అన్నం




(Tamerind Rice) వండుకుని తింటున్నాం. పులిహోర అంటే అది కాదు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ తగుపాళ్లలో ఉండేలా పులిహోరని వండాల్సి ఉంటుంది.

తీపి కోసం బెల్లం, పులుపు కోసం చింతపండు, ఉప్పు, కారం కోసం మిరియాలపొడి, వగరు చేదు రుచులకోసం

ఆవపిండి, మెంతిపిండిని ఏది ఎంత కలపాలో అంత మోతాదులో కలిపి రుచికరంగా వండిన వంటకం పులిహోర. 'పులియోర', 'పులిహోర', 'పులిహూర', 'గుజ్జునోగిరం', 'పులుసన్నం' ఇలా తెలుగులో దీన్ని పిలుస్తుంటారు. తమిళులు పులిహోరను అనేకరకాలుగా వండుకుంటారు. వైష్ణవాలయాలలో పులిహోర మంచి ఆవఘాటుతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. అది ఆరోగ్యప్రదం! తెలుగింటి పచ్చదనం పులిహోర. ఏ ఇంట్లో పులిహోర వండుతారో ఆ ఇంటికి పండగవచ్చినట్టే!

## 3) కొబ్బరి అన్నం

దసరాల్లో మూడోరోజున అమ్మవారికి నైవేద్యంగా కొబ్బరి అన్నం లేదా కొబ్బరి పాయసం సమర్పించుకుంటారు.



దక్షిణాది రాష్ట్రాలవారి వంటకాలలో కొబ్బరి ప్రాముఖ్యత ఎక్కువ. కొబ్బరికాయ కొట్టడంతోనే శుభకార్యాలు మొదలౌతాయి. తెలుగింటి ముత్తైదువలు శ్రావణశుక్రవారంరోజున టెంకాయమీద అమ్మవారి ఆకృతిని పసుపుతో తీర్చిదిద్ది పూజిస్తారు. కొబ్బరి మన సంస్కృతికి గుర్తు.

కొబ్బరిని కోరి రుబ్బి తీసిన పాలను సగం ఉడుకుతున్న బియ్యంలో కలిపి కొబ్బరిపాల అన్నం వండుతారు. అందులో తీపి కలిపితే కొబ్బరిపాల పాయసాన్నం అవుతుంది. రెండింటినీ నైవేద్యంగా పెడుతుంటారు.

## 4) గారెలు

నాలుగోరోజు అమ్మవారికి మినపగారెలు లేదా పెసర గారెలు భక్తిశ్రద్ధలతో నైవేద్యంగా పెడతారు. తెలుగువారు మాత్రమే గారె అంటున్నారు. తమిళ, కన్నడ, మళయాళ ప్రజలు 'వడ' అంటారు.



తెలుగువారికి 'వడ' శబ్దం పరాయిదేమీ కాదు. వడ అంటే వేడిమి. ఎండసెగ, తాపం, శ్రమం అనే అర్థాలతో పాటు ఒక రకమైన పిండివంట, గారె అనే అర్థాలు కనిపిస్తాయి. నానబెట్టిన పెసురపప్పుని వడపప్పు అంటారు. బహుశా వడలు వండటానికి సిద్ధమైన పప్పు అని అర్థం కావచ్చు. పెసరపప్పు మనకు ప్రాచీనం కాబట్టి తొలి వంటకాలలో పెసరగారెలే ఉండి ఉంటాయి. పరిణామక్రమంలో మినపగారెలు వాటి స్థానంలో చేరి ఉంటాయి. నందికేశుడినోములాంటి ప్రాచీనవ్రతకథల్లో పెసరగారెల్నే వడ్డిస్తారు. పెసరగారెలే ప్రాచీనం.

## 5) పెరుగన్నం

ఐదోరోజు దుర్గాదేవిని స్కంధమాతగా సరస్వతిదేవి రూపంలో అలంకరిస్తారు. ఆరోజు అన్నంలో పెరుగు కలిపి అమ్మవారికి నివేదన పెడతారు. దీన్నే చద్దినివేదన అని కూడా పిలుస్తారు. చద్దన్నం అంటే చల్ల లేదా పెరుగు కలిసిన అన్నం. ప్రొద్దున్నే పెరుగన్నం పిల్లల్లో శరీరనిర్మాణాన్ని, మేధాసంపత్తిని పెంచుతుంది. జీర్ణకోశం బలసంపన్నం అవుతుంది.

పెరుగును ప్రోబయటిక్ ఔషధం అంటారు. దధి అంటే పెరుగు. ఓదనం అంటే అన్నం. దధ్యోదనం పదం జనవ్యవ



హారంలో దద్ధోజనం అయ్యింది. దధ్యోదనంలో తాలింపు, ఉప్పు, మిరియాలు వగైరా కలుస్తాయి. చద్ది నివేదనలో ఇవేవీ ఉండవు. ఇది సున్నితమైన తేడా.

### 6) కేసరి

ఆరవ రోజు దుర్గాదేవిని కాత్యాయనీ శ్రీలలితాదేవిగా అలంకరిస్తారు. ఆరోజు అమ్మవారికి నైవేద్యంగా కేసరిని ప్రసాదంగా పెడతారు. కేసరం అంటే సింహం మెడమీద వెంట్రుక. లేత కాషాయవర్ణంలో ఉంటుంది. ఈ రంగులో ఉండే తీపి వంటకం కాబట్టి కేసరి అన్నారు. ఆ రంగు



రావటానికి మిఠాయిరంగు కలుపుతున్నారు. నిజానికి మన పూర్వులకు ఇలా రంగు కలిపి వండుకోవటం తెలీదు. రంగులు కలపటం వల్ల శరీరంలో సీసం, విషదోషాలు పెరిగిపోతాయి. జాగ్రత్త అవసరం. ఇప్పుడంటే బొంబాయిరవ్వని కేసరి తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇది గత వందేళ్లుగా మాత్రమే వాడకంలోకి వచ్చింది. ఒకప్పుడు బియ్యపు రవ్వ, గోధుమరవ్వ, రాగి, జొన్న, సజ్జలాంటి చిరుధాన్యాలరవ్వలతో దీన్ని చేసుకునేవారు. వాటితో వండిన కేసరి సింహం మెడజుట్టు వర్ణంలో ఉంటుంది. గోధుమ రవ్వ కేసరినే అన్నవరం సత్యనారాయణస్వామి, ప్రసాదంగా పెడుతున్నారు. బొంబాయి రవ్వ కాకుండా గోధుమ లేదా ఇతర రవ్వలతో కేసరి చేసుకుంటే ఆరోగ్యదాయకం.

## 2022, నవంబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

01 - తిరుమల శ్రీవారి పుష్పయాగం
05 - కైశికద్వాదశి
07 - కార్తికపౌర్ణమి
14 - బాలలదినోత్సవం
20-28 - తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం
21 - శ్రీధన్వంతరి జయంతి
24 - తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి గజవాహనోత్సవం
28 - పంచమీతీర్థం
29 - తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పుష్పయాగం, స్కందషష్ఠి

### 7) శాకాన్నం

ఏడవరోజు అమ్మవారిని కాళరాత్రి శ్రీదుర్గాదేవిగా అలంకరణ చేసి, శాకాన్నం లేదా కలగూర పులుసన్నం



నైవేద్యంగా సమర్పిస్తారు. శాకాన్నం అంటే కూర ఎక్కువగా కలిపిన అన్నం అని! శాకాన్నం అంటే కూర ఎక్కువగా, అన్నం కొద్దిగా ఉండాలి. అన్నంలో కూరని కాకుండా కూరలో అన్నాన్ని నంజుకోగలిగితే శరీరానికి పోషణ పెరుగుతుంది. రోగాలు నశిస్తాయి. అమ్మవారికి నివేదన పెట్టే శాకాన్నం ఇలా ఉండాలి.

## 8) చక్కెరపొంగలి

ఎనిమిదవ రోజు అమ్మవారిని మహిషాసురమర్దనీ దేవిగా అలంకరణ చేస్తారు. నైవేద్యంగా చక్రపొంగలి పెడతారు. పెసరపప్పు, పాలు, పంచదార, బియ్యం కలయికగా పొంగలిలో తెలుగుసంస్కృతి మొత్తం ఇమిడి ఉంది.



పాలు, బియ్యం మన వ్యవసాయసంస్కృతికి గుర్తులు. పాలు, పంచదార, పెసరపప్పు, బియ్యం కలయికగా తెలుగుదనం చక్కెరపొంగలిలో కనిపిస్తుంది. అమ్మవారిని మన సంస్కృతికి మూలపుటమ్మగా ఆరాధిస్తున్నాం. మన సంస్కృతి మూలాలను అమ్మకు నైవేద్యంగా పెడుతున్నాం. అలా మనల్ని మనం సమర్పించుకుంటున్నాం.

## 9) పరమాన్నం

తొమ్మిదవ రోజు దుర్గాదేవిని సిద్ధిరాత్రి శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరిస్తారు. ఆరోజు నైవేద్యంగా పరమాన్నాన్ని సమర్పిస్తారు. అన్నంలో పాలు, బెల్లం కలిపితే అది పరమాన్నమే! అందులో యాలకులు, జీడిపప్పు, పచ్చకర్పూరం వగైరా చేరు



కోవటం వల్ల సుగంధభరితంగా ఉంటుంది. పచ్చకర్పూరం కలిసినప్పుడు మనసులో ఒక విధమైన ఆధ్యాత్మిక భావం కలుగుతుంది. దేవాలయానికి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. ప్రసాదాన్ని కళ్లకు అద్దుకుని దైవదర్శనం చేసుకున్న భావనతో తీసుకుంటాం. ప్రసాదం అలాంటి భావనకలుగచేసేదిగా ఉండాలి.

**33వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**






# నమ్మాలేకానీ, స్వామిచేయని సాయం ఉంటుందా?


-శ్రీ ఆర్.సి.కృష్ణస్వామిరాజు, 93936 62821

మా స్వంత ఊరు చిత్తూరుజిల్లా పుత్తూరు. మా పక్క ఊర్లో పీతాంబరం అనే మామిడికాయలరైతు ఉండేవాడు. అతడు మాకు దూరపు బంధువు కూడాను. 'సంసారి దుఃఖి, సన్యాసి సుఖి' అని చాలా రోజులు పెండ్లి చేసుకోకనే కాలం గడిపాడు.

ఇలాగే వదిలేస్తే తలమీది వెంట్రుకలు కూడా తెల్లబడుతాయని ఇంట్లోవాళ్లు నయానాభయానా మాటలు చెప్పి పెండ్లిపీటలు ఎక్కించారు. ఊర్లోనే రాములవారిగుడిదగ్గర మేళతాళాల మధ్యన పెండ్లి జరిగింది. పెళ్లయిన రోజే నూతన దంపతులిద్దరూ శ్రీవారి దర్శనార్థం కొండకు బయలుదేరారు.

పీతాంబరం నాన్నమ్మ పేరు బంగారవ్వ. ఎనభై ఏళ్ల ఆమె. స్వామి వారికి వందరూపాయల మొక్కుబడి చెల్లించాల్సి ఉంది. అయితే ఆమె శరీరం ప్రయాణం చేసేంత చురుకుగా లేదు. అందుకని హుండీలో వేయాలనుకున్న వందరూపాయ లను వారి చేతికిచ్చి మొక్కుబడి చెల్లించమంది. వారు అవ్వ ఇచ్చిన డబ్బును సంతోషంగా తీసుకుని కొండకు బయలుదేరారు. కొండకెళ్లి స్వామివారిని దర్శించుకుని వచ్చేశారు. తెచ్చిన లడ్డూలు ఊర్లో వాళ్లందరికీ పంచారు. అందరూ కళ్లకద్దుకుని తీసుకున్నారు.

ఇదిలా ఉంటే... వారికి మూడేళ్లు అయినా పిల్లలు పుట్టలేదు. పూజలు, నోములు, వ్రతాలు ఎన్నో చేశారు. వయసు



ఎక్కువయ్యాక పెళ్లి చేసుకున్నందువల్ల పిల్లలు పుట్టడం లేదేమో నని పీతాంబరం దిగులు పడ్డాడు.

చివరిగా స్వామివారికి మొక్కుకుని చూద్దామని నాలుగోపెళ్లిరోజు కొండకి వెళ్లదలిచినారు. 'పెళ్లిరోజు స్వామి దర్శనానికి వెళ్తున్నాం కదా' అని పెండ్లిగుడ్డలను వేసుకు వెళ్లాలనుకున్నారు. గుడ్డలు సర్దుతూ ఉంటే, పీతాంబరం చొక్కా జేబులో వందరూపాయలు కనిపించింది.

అప్పుడు పీతాంబరానికి బంగారవ్వ, హుండీలో వేయ మని ఇచ్చిన డబ్బు గుర్తుకు వచ్చింది. పెండ్లిరోజు హడావుడిలో ఆ డబ్బుస్వామికి సమర్పించలేదు. ఇంటికొచ్చాక వేరే గుడ్డలు మార్చుకున్నారు. పెండ్లిగుడ్డలను భద్రంగా ఓ సంచీలో ఉంచి బీరువాలో పెట్టేశారు. మరల ఆ విషయమే మరచిపోయారు. తప్పు జరిగిందన్న విషయం అర్థమయ్యింది పీతాంబరంకి.

వెంటనే భార్యాభర్తలిద్దరూ కొండకెళ్లి స్వామికి క్షమా పణలు చెప్పుకున్నారు. గోవిందనామస్మరణలు చేస్తూ హుండీలో నూటపదహార్లు వేసి పిల్లలు కలగాలని వేడు కుని వచ్చారు. స్వామి మాయ కాబోలు... కొన్ని నెలలకే పీతాంబరం తండ్రి అయ్యాడు. 'నమ్మాలే కానీ స్వామి చేయని సాయం ఉంటుందా?' అని దండం పెట్టు కున్నారు. స్వామికి కృతజ్ఞతగా కొడుకు పేరు 'వెంకట్' అని నామకరణం చేశారు.



# తాళ్లపాకపదవాఙ్మయ పరిష్కరణలో... గౌరిపెద్ది రామసుబ్బశర్మ!



- ఆచార్య కె.సర్వోత్తమ రావు, 97041 04000

*గౌరిపెద్దివారి శతజయంతి సంవత్సరం సందర్భంగా...*

తాళ్లపాకపదకవుల సంకీర్తనల పరిష్కరణకు మొదట శ్రీకారం చుట్టినవారు శ్రీ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి. రేకులలోని వ్రాతలను కాగితాలకు ఎక్కించినవారు శ్రీకలబరిగి వేంకటరమణ శాస్త్రి. అయితే అవి ముద్రితం కాలేదు. ఆపై రెండవసారి 1936– 1937 ప్రాంతంలో శ్రీవిజయరాఘవాచార్యులు అధ్యాత్మ సంకీర్తనలు, శృంగారసంకీర్తనలు అనే పేర ముద్రించారు. ఆ పై మూడవసారి శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి లభ్యమైన రాగిరేకులను స్వాధీనం చేసుకుని జాగ్రత్తగా పరిశీలించి 1947–1950 లలో రెండు సంపుటాలు ప్రచురించారు. ఈ ప్రచురణలే తర్వాతి వారికి మార్గదర్శకాలు. తర్వాతికాలంలో ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మలు వివిధసంపుటాలను పరిష్కరించి పీఠికలు వ్రాశారు. మొత్తానికి అన్నమయ్య అధ్యాత్మ, శృంగారసంకీర్తనలసంపుటాల పరిష్కరణలో, ముద్రణలో ఈ నలుగురినే తి.తి.దే. ఎంపిక చేసుకోవడం, శ్రీవిజయరాఘవాచార్యులవారితో మొదలైన పరిష్కరణ శ్రీగౌరిపెద్దివారి అంకురితదీక్షతో పూర్తికావడం విశేషాలుగా చెప్పుకోవచ్చు.

## శ్రీగౌరిపెద్దివారి అన్నమయ్యసంకీర్తనల సంపుటాల పరిష్కరణ

తిరుమలతిరుపతిదేవస్థానంవారు కొత్తనెంబర్లతో 1998–1999లో తాళ్లపాక పదసాహిత్యం– సంపుటం పేరుతో 29 సంపుటాలు ప్రచురించారు. వాటిలో రెండు పెదతిరుమలయ్యవి. ఒకటి చినతిరుమలాచార్యులది కాగా తేలినవి 26. వీటిలో రెండుసంపుటాలలోను పరిష్కర్తగా గౌరిపెద్ది రామసుబ్బశర్మ పేరే కన్పిస్తుంది. వీటిలో 1, 2, 3, 4, 5 ఒకప్పుడు పరిష్కృతమై, ముద్రితమై మరల గౌరిపెద్ది వారిచే పునః పరిష్కృతమై పునర్ముద్రితాలయ్యాయి. కొత్త నెంబరుగల 13, 14, 16 సంపుటాలకు శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పరిష్కర్త, శ్రీగౌరిపెద్ది సాహాయ్యకులు. కాగా కొత్త నెంబరు గల 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 29 సంపుటాలు గౌరిపెద్దివారిచే స్వతంత్రంగా ఎవరి తోడ్పాటులేకుండాసాగాయి. మొత్తానికి 20 అన్నమయ్య సంకీర్తనల సంపుటాల పరిష్కరణలో గౌరిపెద్దివారి భాగస్వామ్యం ఎంతటిదో మనం గుర్తింపవచ్చు.

## రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి సహాయకులుగా సాగించిన పరిష్కరణ

శ్రీ రాళ్లపల్లివారు శ్రీగౌరిపెద్దివారి సాయంతో నాలుగు సంపుటాలు పరిష్కరించారు. ఈ సంపుటాల పరిష్కరణలో శ్రీరాళ్లపల్లివారు గౌరిపెద్దివారిని శ్లాఘించిన తీరు గుర్తించదగ్గది.

"ఈ గొప్పపనికి నాకు చేదోడువాదోడుగా శ్రీ వేంకటేశ్వర సంస్కృతకళాశాలయందలి ఆంధ్రసంస్కృత సాహిత్యాధ్యాపకులగు శ్రీగౌరిపెద్దిరామసుబ్బశర్మ శిరోమణి, విద్వాన్ గారిని ఏర్పరచుట నాయదృష్టము. శ్రీశర్మగారు అష్టావధానము, ఉభయభాషలందును అశుకవిత, మంత్రతంత్రశాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలువిషయములలో పరినిష్ఠితులు. నిష్కల్మషమైన, నిష్పక్షపాతమైన మేథ, ప్రామాణికమైనదృష్టి, ఆత్మార్థకమైన సదాచారసంపత్తి కలవారు. ఈ పల్లెపట్టులందలి దేశి తెలుగు నుడికారములు చక్కగా నెరిగినవారు. మీదు మిక్కిలి నా యెడ సుస్నిగ్ధమైన హృదయము గలవారు. కార్యోత్సాహపూర్ణులు" అని తన సంతోషాన్ని (13 పీఠిక) బహిర్గతం చేశారు. అలాగే 14వ సంపుటం పీఠికలో కూడా– "ఈ కైంకర్యమునకు సర్వవిధముల సాహాయ్యము నెరపు శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నా రెండు చేతులయూత. అందుమీద శ్రీనివాసులదయ" అని సంభావించారు.

13, 14 సంపుటాలకు శ్రీరామసుబ్బశర్మగారు సహాయకులుగా ఉన్నప్పటికీ తన పేరుతోనే పీఠిక ప్రకటించుకున్న శ్రీ రాళ్లపల్లి 16వ సంపుటంలో తాను చిరుపీఠికతో స్వస్తి పలికి బృహత్పీఠికకు శ్రీరామసుబ్బశర్మగారికి అవకాశమివ్వడం

విశేషం. ఆ సంపుటంలోనే శ్రీ రాళ్లపల్లివారు– "నేను, శ్రీ రామసుబ్బశర్మగారును కలిసి పనిచేయుచుండగా ఈ సంపుటము నందలి చాలభాగము పరిశోధించి ముద్రణార్హముగా వ్రాయ బడినది... శ్రీరామసుబ్బశర్మగారు ఈ ప్రయత్నము సాంగముగా తుద దాకించునట్లు అందుకు వలయు దీర్ఘాయురారోగ్యాది వృద్ధిని శ్రీశ్రీనివాసుల నుగ్రహింతురు గాక" అని ముగించారు.

కొత్తనెంబరుగల 5వ సంపుటం లోగడ రాళ్లపల్లి వారే స్వతంత్రంగా ముద్రించారు. అయినా ఆ సంపుటాన్ని తి.తి.దే. వారు పునర్ముద్రించదలచుకుని ఆ బాధ్యత గౌరిపెద్దివారికి అప్ప చెప్పినపుడు శ్రీగౌరిపెద్దివారు అడుగడుగునా శ్రీ రాళ్లపల్లి వారిని సంప్రదించి 'సర్వమూ ఎరుకపరచి' పెద్దపీఠిక వ్రాశారు. గౌరి పెద్ది రామసుబ్బశర్మగారు తాము పూర్తిగా పరిష్కరణ బాధ్యత తీసుకున్నపుడు సంకీర్తనలకు ప్రధాన ఆకరాలైన రాగిరేకులను స్వాధీనం చేసుకున్నారు. రేకుల గజిబిజిని గుర్తించారు.

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మపట్ల గౌరిపెద్దివారి కున్న గౌరవం అతివేలం. కొత్తనెంబరుగల 18వ సంపుటం పీఠికలో– "పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారి చేతికింద నేను నేర్చినంతమతికి తగినట్లుగా ఈ సంపుటం నుండి కొన్ని సంపుటములు పరిష్కరించుటకు పూను కొంటిని" అన్నారు. ఆ పై తన భక్తిని శ్లోకరూపంలో పీఠికాంతంలో 19, 20, 21, 22, 23, 24, 25, 1, 2, 3, సంపుటాలలో ప్రకటించుకున్నారు.

## శ్రీగౌరిపెద్దివారి పరిష్కరణ విధానం

**01)** పూర్వపరిష్కర్తలవిధానం కొనసాగించడం.

**02)** శ్రీ వేటూరివారు య, వు, వూ, వొ, వోలు అజాదిగా, శకారాది శబ్దాలను (తెలుగుపదాలను) సకారాదిగా పరిష్క రించిన విధానం కొనసాగించడం.

**03)** ద్విత్వానికి ముందున్న పూర్వానుస్వారం పూర్తిగా తొలగించడం.

**04)** ద్విత్వరహితమైన హల్లుకు ముందున్న నిండుసున్నను అరసున్నగా గ్రహించడం.

**05)** పదవాఙ్మయమంతా సంగీతసాహిత్యాల సమష్టిపంట కావడంవల్ల సాహిత్యదృష్టితో అనవసరంగా తోచిన దీర్ఘాలను అక్కడక్కడ హ్రస్వం చేయడం.

**06)** సముచ్చయాత్మకమైన దీర్ఘాన్ని లయకు అనుగుణంగా విధిగా అన్ని చరణాలలో పాటించబడ్డ దీర్ఘాన్ని మాత్రం హ్రస్వం చేయకపోవడం.

**07)** సుబోధ దుర్బోధాలైన భావాలను, సుగ్రాహ, దుర్గ్రాహాము లైన పదాలను, దురన్వయ, దూరాన్వయాలైన వాక్యాలను గమనించి, వివరించి కామాలు, సెమికోలన్లు ఆ యా సందర్భాలకు తగిన విరుపుల గుర్తులు చూపి పాఠకుని మనస్సును రసాస్వాదనవైపు మళ్లించడం, పూర్వముద్రణ పాఠం ఇవ్వడం.

**08)** పాదదీపిక లిచ్చే రాళ్లపల్లివారి విధానాన్ని విస్తృతపరచడం.

**09)** గౌరిపెద్దివారి తనదైన సవరణను * గుర్తుతో సూచించడం.

శ్రీ శర్మగారు 18వ సంపుటంనుండి పరిష్కర్తలయినా అధ్యాత్మసంకీర్తనల సంపుటాలలో అసంఖ్యాకమయిన 'పాద దీపికలు' ఇచ్చారు. బహుశః పూర్వముద్రణలోని లోపాలు కావచ్చు. గౌరిపెద్దివారి పరిష్కరణలో 'పాదదీపిక'లలో ఎన్నో అమూల్యాంశాలున్నాయి.

## పరిష్కరణలో సాయపడ్డ వారి సంస్మరణ


శాసనాల పరిష్కరణ, తాళపత్రప్రతులపరిష్కరణ, రాగి రేకుల వ్రాతల పరిష్కరణలో అనేకరకాలైన చిక్కులున్నాయి. పరిష్కర్తకు చారిత్రక, భౌగోళిక, శాస్త్రవైదుష్యపరిజ్ఞానంతోబాటు ఆ యా ప్రాంతాలభాషలతో గట్టిపరిచయముండాలి. అలాగే మతసంబంధిపదజాల అవగాహన తప్పనిసరి. పరిష్కరణలో కవిదర్శనం పరిష్కర్తకు అవసరం. వాటికి సంబంధించి తనకు తెలియని వేళ ఇతరులను సంప్రదించడం అనివార్యం. అది న్యూనత కాదు. శ్రీ గౌరిపెద్దివారు తమ బుర్రను తొలచే సందేహా లేర్పడ్డ వేళ చాలవరకు ఇతరులను సంప్రదించేవారు. పరి ష్కరణలో ఆ అభిప్రాయాలు అన్వయించడానికి వీలయినపుడే ఆ అభిప్రాయాలకు విలువ నిచ్చేవారు. కానివేళ తిరస్కరించే వారు. అన్వయానికి సరిపోయిన అభిప్రాయాలు క్రోడీకరించి వారికి కృతజ్ఞతలు ప్రకటించేవారు. పీఠికలలో యథాతథంగా ఉటంకించేవారు. ఇది పరిష్కర్తమార్గం. ఘంటాపథనిజాయితీకి నిదర్శనం కూడా. ఇలాంటి సాక్ష్యాలు గౌరిపెద్దివారి పీఠికలలో కనిపిస్తాయి. *బ్రహ్మశ్రీగౌరిపెద్దివారి శతజయంతిని తి.తి.దే. జరపడం ఒక పవిత్రకార్యమని చెప్పుకోవచ్చు.*

*ఈ నెల 5వ తేదీ విజయదశమి సందర్భంగా...*

# దసరా వచ్చిందయ్యా..!

**- డా॥ సుబ్బలక్ష్మి మర్ల**

ఆసేతుశీతాచలం భారతీయులంతా శ్రద్ధాభక్తులతో జరుపుకునే పండుగ దసరాపండుగ. వివిధప్రాంతాలలో ఈ పండుగను జరిపే తీరు వేరైనా భక్తిప్రపత్తులు మాత్రం అన్ని ప్రాంతాలవారికి సమానమే. ఉత్తరాదిన దీన్ని రామలీలగా అభివర్ణిస్తారు. విజయదశమినాడు రాముడు రావణుని సంహరించాడని దానికి ప్రతీకగా రావణ, కుంభకర్ణ, మేఘనాదుల దిష్టిబొమ్మలను తయారుచేసి వాటిని దహనం చేస్తారు. దశమి రోజున ఉదయం నుండే ఔత్సాహికులు రామ, లక్ష్మణ, ఆంజనేయవేషాలను ధరించి వీథులలో ఊరేగుతారు. రామాయణంలోని వివిధపాత్రలను అభినయించడానికి రంగులు పులుముకొని ఆపాత్రలే స్వయంగా విచ్చేసినట్లు భ్రాంతికలిగిస్తూ సాయంత్రం వరకు ఊరేగింపు సాగిస్తూ రామాయణఘట్టాలను అభినయిస్తారు. సాయంసంధ్యాసమయానికి 'రామలీలమైదాన్' పేరుతో నిర్దేశింపబడ్డ మైదానం చేరుకొని అక్కడ సిద్ధంగా ఉన్న రావణ, కుంభకర్ణ, మేఘనాదుల బొమ్మలవద్దకు చేరుకుంటారు. రామ



లీల దర్శించడానికి ఆ మైదానం చేరుకున్న అశేషప్రజానీకం ముందు రామాయణంలోని యుద్ధఘట్టాలను అభినయించి రామపాత్రధారి బాణం ఎక్కుపెట్టి రావణాసురుని నాభి మండలంలో కొడతాడు. అదేవిధంగా లక్ష్మణ పాత్రధారి మేఘనాదుణ్ణి, మరొకరు కుంభకర్ణుణ్ణి తమ నిశితబాణాలకు గురి చేయగా రాక్షసులు ముగ్గురు ఏకకాలంలో అగ్నికి ఆహుతి అవుతారు. ప్రజలంతా జయజయనాదాలు చేస్తుంటే ఫెళఫెళా రావాలతో మూడుబొమ్మలు అగ్నికి ఆహుతి అవుతాయి. చెడు పైన మంచివిజయానికి ప్రతీకగా ఈ పండుగను భావిస్తారు.


శివరాత్రినాడు రాత్రిపూజ పరమేశ్వరుడు స్వీకరించాడు. దానికి బదులుగా ఆశ్వయుజ మాసంలో పగటిపూజ అమ్మవారికి చెందేలాగ శివుడు వర మిచ్చాడని ఐతిహ్యం.

ఆంధ్రదేశంలోని ప్రతిగ్రామం, పట్టణం, నగరం దేవీ నవరాత్రులకు వేదికలవుతాయి. ఆ యా ప్రాంతాలలోనున్న అమ్మవారిదేవాలయాలలో దేవికి తొమ్మిదిరోజులు ఆ యా ప్రాంతాల ఆచారాల ననుసరించి అవతారాలను అలంకరిస్తారు.

ఆంధ్రదేశంలో దసరాపండుగ కేవలం దేవీపరంగానే కాకుండా పాండవులపరంగా కూడ నిర్వహింపబడుతుంది. పాండవమధ్యముడైన విజయుడు ఆశ్వయుజశుద్ధనవమినాడు శమీవృక్షంపై నిక్షిప్తం చేసిన తమ ఆయుధాలను తీసుకున్నాడని దానికి ప్రతీకగా నవమినాడు ఆయుధపూజ చేసి శమీవృక్షాన్ని కూడ పూజిస్తారు. తమతమ వృత్తులకు కీలకమైన ఆయుధాలను ఆ యా వృత్తులవారు పూజిస్తే, బాలబాలికలు తమ పాఠ్యపుస్తకాలను పూజించి విద్యాప్రాప్తి కలిగించమని అమ్మను వేడుకుంటారు.

విజయుడు శమీవృక్షం పై నుండి ఆయుధాలు తీసుకున్నదానికి ప్రతీకగా బాలలంతా గిలకలు పడతారు. 'గిలకలు' అంటే బాణాలు. వెదురుబద్దతో ధనుస్సును తయారుచేసి దానికి అతుక్కొని ఉండేలాగ ఒకటిగాని, రెండుగాని అమ్ములను అమర్చుతారు. వీటిచివర కోనుఆకారంలో కాగితంతో బుట్టలాగ అమరుస్తారు. ఈ బుట్టలో పూలువేసి బాణం సంధించి విడిస్తే బాణం ఎవరిపై ఎక్కుపెట్టారో వారిపై పూలు పడతాయి.

గిలకలు పట్టేవారు ముందుగా తమ ఉపాధ్యాయుణ్ణి సహవిద్యార్థులను తమయింటికి ఆహ్వానిస్తారు. అమ్మవారిముందు బాలలందరు తమ గిలకలనుపెట్టి పురోహితుని ఆదేశానుసారం పూజచేస్తారు. పూజానంతరం ఎవరి గిలకను వారు ధరించి అమ్ముకు ఉన్న బుట్టలో సుగంధభరితమైన పుష్పాల నుంచి అమ్మవారిని స్తుతిస్తూ బాణం ఎక్కుపెట్టి అమ్మవారి పాదాలపై పూలు పడేలాగ సంధిస్తారు. పూలన్ని అమ్మవారిపై పుష్పవృష్టిగా కురుస్తుంటే జయజయధ్వానాలు చేస్తారు.



ఈవిధంగా ముమ్మారు చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. తరువాత గురువు పాదాలకు పుష్పాలను సమర్పించి గురువుగారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. గురువు శిష్యులందరివద్ద గురుదక్షిణ స్వీకరించి, వారిని ఆశీర్వదిస్తారు. ఈ సందర్భంగా గురువుకు నూతనవస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ.

గురువుగారు ముందు నడుస్తుంటే బాలలంతా నగర సంచారానికి బయలుదేరుతారు. ఇంటింటికి వెళ్లి దసరాపద్యాలు చదువుతారు. దైవసంబంధమైన పద్యాలతోపాటు తమకు పప్పుబెల్లాలు, గురువుగారికి దక్షిణలు సమర్పించమని ఈ క్రిందివిధంగా పాడుతారు.

"దసరాకు వస్తిమని విసవిసలు పడక
ఇప్పుడే లేదనక ఇవ్వలేమనక
చేతిలో లేదనక అప్పివ్వరనక
పావలా అయితేను పట్టేది లేదు
అర్ధరూపాయయితె అంటేది లేదు
హెచ్చురూపాయయిన పుచ్చుకొనబోము
అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు
జయవిజయీభవ దిగ్విజయీభవ!
జయవిజయీభవ దిగ్విజయీభవ!!"

ఈవిధంగా ఇంటింటివద్ద పద్యాలు, పాటలు పాడి తమ విద్వత్తును ప్రదర్శించి పప్పుబెల్లాలు సంపాదించి వాటిని అమ్మవారి ప్రసాదంగా స్వీకరిస్తారు. తమ మేనమామల ఇళ్లవద్దకు వెళ్లినప్పుడు–

"మామయ్య మామయ్య
మముచూచి పరుగెత్తకయ్య
బంట్రోతును కానయ్య భయపడకుమయ్య
అల్లుణ్ణి నేనయ్య అడగవచ్చితిని
దసరాకట్నంబు లడగవచ్చితిని
తెప్పించి కట్నంబు లిప్పించవయ్య
అయ్యవారికి చాలు అయిదువరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు
జయవిజయీభవ దిగ్విజయీభవ!
జయవిజయీభవ దిగ్విజయీభవ!!"

అని చమత్కారంగా పాడి మామను మురిపిస్తారు. దసరా సందర్భంగా దసరాపద్యాలు, పాటలద్వారా పిల్లలు ఎన్నెన్నో విషయాలు తెలుసుకునేవారు. సమష్టిగా అందరు కలిసిమెలిసి ఉండడం, గురువులయెడ, పెద్దలయెడ గౌరవ ప్రపత్తులు కలిగి ఉండడం, ఎదుటివ్యక్తిని నొప్పించకుండా ప్రవర్తించడం మొదలైన సద్గుణాలన్నింటినీ బాలబాలికలు ఈ దసరాపండుగద్వారా తెలుసుకునేవారు.

మహోత్కృష్టమైన మన ఈ సంప్రదాయాలను పునరుద్ధరించి నేటి బాలలకు కూడ నాటి బాలల అనుభూతులు, ఆనందాలు పంచాల్సిన అవసరం ఎంతయినా ఉంది.


**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుమల ఆలయంతో పాటు...**
**ఈ ఆలయాల్ని కూడా దర్శించండి..!!**

1)శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి(శ్రీనివాసమంగాపురం) 2)శ్రీపద్మావతీదేవిఅమ్మవారు(తిరుచానూరు) 3)శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి (అప్పలాయిగుంట) 4)శ్రీవేణుగోపాలస్వామి(కార్వేటినగరం) 5) శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి(నారాయణవనం) 6)శ్రీవేదనారాయణస్వామి (నాగలాపురం) 7)శ్రీలక్ష్మీనరసింహస్వామి(తరిగొండ) 8)శ్రీపట్టాభిరామస్వామి(వాయల్పాడు) 9)శ్రీఅగస్త్యేశ్వరస్వామి (తొండవాడ) 10)శ్రీపెరుమాళ్‌స్వామి (తొండమనాడు) 11)శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి (కాశీబుగ్గ, నగరి) 12)శ్రీకరియమాణిక్యస్వామి(నగరి)


**ఆగష్టునెల క్విజ్–1 సమాధానాలు**

**అన్ని ప్రశ్నలకూ సమాధానం - శ్రీకృష్ణుడు**

సరైన సమాధానాలు వ్రాసినవారు– కె.ఎస్.కార్తికేయ, S/o కె.శేషేంద్రరమణ, 8వ తరగతి, కర్నూలు.

బాలనీతి

# శ్రద్ధలేని పని వృధా...

- శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203

పూర్వం జాజలి మహాముని చాలాకాలం తపస్సు చేశాడు. అతడు తపస్సులో మునిగి ఉన్నప్పుడు అతడి తల మీద ఒక పిచ్చుకల జంట గూడు కట్టుకుని కాపురం పెట్టింది. పొద్దంతా ఆహారం సంపాదించుకుని చీకటి పడగానే ఆ గూట్లో సుఖంగా ఉండేది పిచ్చుకల కుటుంబం. పక్షులకు ఆశ్రయం ఇస్తున్నందుకు ముని కూడ సంతోషించి వాటిని తరిమేయకుండా తన ఉపకారస్వభావానికి తానే మురిసిపోతూ ఉండేవాడు.

ఒకరోజు జాజలి 'నా అంతటి ధర్మనిష్ఠ ఇంకెవరికైనా ఉంటుందా?' అని తనను తానే మెచ్చుకున్నాడు. అప్పుడు అశరీరవాణి "మహాధర్మాత్ముడైన తులాధారుడు ఈ విధంగా ఎప్పుడూ మాట్లాడి ఎరుగడు. ఈ విధంగా నిన్ను నువ్వు గొప్పగా ఊహించుకుంటూ మాట్లాడవచ్చా?" అని పలికింది.

"ఆహా! ఏమి విచిత్రం. తులాధారుడు అంత గొప్ప వాడా? అతడిని చూడటం ఎలా? ఎక్కడ ఉంటాడు?" అని అడిగాడు జాజలి.

"అతడు కాశీలో ఉంటాడు" అని అశరీరవాణి చెప్పింది. జాజలి కాశీకి వెళ్లాడు. అక్కడ జనంమధ్యలో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్న తులాధారుణ్ణి కలిశాడు. తులాధారుడు జాజలి మునికి అతిథిసత్కారాలన్నీ చేసి ఇలా అన్నాడు. "ఓ జాజలి మునీ! నీ తలమీద పిచ్చుకలగూడు కాపురం చేస్తున్నా కూడా చలించకుండా తపస్సు చేసుకోగలుగుతున్నావు. నీకు అదెలా సాధ్యపడింది?" అని అడిగాడు.

ఆ ప్రశ్న విన్న జాజలి, తులాధారుడి అద్భుతజ్ఞానానికి ఆశ్చర్యపోయాడు. "నా తలమీద గూడుకట్టుకుని ఉంటున్న పిచ్చుకల గురించి నీకెలా తెలిసింది? నువ్వు వ్యాపారవృత్తిలో ఉంటున్నావు. నీకు ఇంతటి జ్ఞానం ఎలా కలిగింది?" అని అడిగాడు.

తులాధారుడు "నేను వ్యాపారధర్మంగా క్రయవిక్రయాలు చేస్తూ ఉంటాను. అందులో ఎటువంటి మోసం చేయను. తగినంత లాభాన్ని మాత్రమే ఆశిస్తాను. అధిక లాభాలకు ఆశపడను. మట్టిముద్దకు, బంగారానికి సమానమైన విలువనిస్తాను. ఆత్మస్తుతి, పరనింద, ఇతరులను హింసించడం వంటివి చెయ్యను. ప్రాణులన్నీ నాకు నేస్తాలే! నేను నిజమే మాట్లాడుతాను. కాబట్టి దేనికీ భయపడను. మితిమీరిన కీర్తినిగానీ, సుఖాల్ని గానీ కోరుకోను. దేనిమీదా రాగద్వేషాలు లేవు. ఈ లోకమంతా నా కంటికి ఒక చిత్రపటంలా కనబడుతుంది. అందువల్ల నేనెప్పుడూ తామరాకు మీద నీటిబొట్టులా నిస్సంగస్థితిలో ఉంటాను. సత్యమే యజ్ఞమని భావించి సత్యాన్నే పాటిస్తూ తృప్తితో ఎవరైతే ఉంటారో వారిని దేవతలు అనుగ్రహిస్తారు. అదే నా జ్ఞానానికి కారణం" అని బదులిచ్చాడు.

జాజలి "ఇంత జ్ఞానం పొందిన నువ్వు ఎందువల్ల కర్మను వదలకుండా ఉన్నావు?" అని అడిగాడు. తులాధారుడు "ఎవరైతే ధర్మాత్ముడై , ధర్మానికి మిత్రుడై ఉంటాడో, అటువంటి వాడికి ఆనందప్రాప్తి కలుగుతుంది. నా వ్యాపారం నాకు పవిత్రమైన కర్తవ్యం కాబట్టి నేను ఆ పని చేస్తున్నాను. స్థిరమైన బుద్ధితో చేసే కర్మ గొప్ప సిద్ధిని ఇస్తుంది. అంతేకాని, ఏదో



ప్రయోజనాన్ని ఆశించి చేసే పని మహోన్నతమైన గతికి ఎలా కారణమౌతుంది? ధర్మాత్మా! నాకు తెలిసినంతవరకు చెప్పాను. నా మాటల్లో సందేహాలు ఉంటే "నీ తలమీద గూడు కట్టుకున్న పిచ్చుకలను పిలిచి, అడిగి చూడు" అన్నాడు తులాధారుడు.

అప్పుడా పిచ్చుకలు ఆకాశంలో నిలిచి ఇలా అన్నాయి. "నిన్ను పరీక్షించేందుకు ధర్మదేవత మమ్మల్ని పంపింది. మేము ధర్మదేవత సేవకులం. ఇప్పుడు నీకు కలిగిన సందేహాన్ని మేము తీరుస్తాం. విను! ఎవరి హృదయంలో మత్సరదోషం ఉంటుందో వారిలో ఈర్ష్య, కలహించే స్వభావం, మనఃసంక్షోభం ఉంటాయి. కాబట్టి తపోనిధులు మాత్సర్యాన్ని వదిలించుకోవాలి. స్పర్ధ అనేది కూడా దుర్మరణమే. అది మంచి ధర్మాన్ని నశింపజేస్తుంది. మంచి ధర్మం నశించిన మనిషిలో ఇంకేమి మిగిలి ఉంటుంది? కనుక నశిస్తాడు. అందువల్ల స్పర్ధ అనే గుణాన్ని వదలాలి. సత్త్వగుణం వల్ల శ్రద్ధ పుడుతుంది. ఆ శ్రద్ధ మనం తెలుసుకోదగిన విషయాన్ని తెలుపుతుంది. దానివల్ల శుభం కలుగుతుంది. శ్రద్ధలేని తపస్సును దేవతలు అంగీకరించరు. కాబట్టి శ్రద్ధ అనేది చాలా ప్రశస్తమైన గుణం. శ్రద్ధవల్ల మనస్సు చెడుదారులలోకి పోకుండా కాపాడుతుంది. శ్రద్ధ అనేది జీవాత్మ యొక్క ప్రసన్నతాగుణమే. శ్రద్ధగలవాడి మనసులో మాత్సర్యం మొదలైన చెడుగుణాలు నిలబడవు". పిచ్చుకలు చెప్పింది శ్రద్ధగా విన్న జాజలి వాటికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

తులాధారుడి వైపు చూసి "ఎప్పుడూ ఇటువంటి ఉపదేశాలు వినలేదు. అందువల్ల నన్ను నేను పొగుడుకోవడమనే దోషం కలిగింది. ఇక ముందు శాంతిమార్గంలో నడుచుకుంటాను" అని సెలవు తీసుకున్నాడు.

### భాస్కరశతకం

## ఎంతటి కష్టమైనా..

**పరహితమైన కార్య మతిభారముతోడిదియైనఁబూను స**
**త్పురుషుఁడు లోకముల్పొగడఁ బూర్వము నందొక ఱాలవర్షము**
**న్గురియఁగజొచ్చినన్ గదిసి గొబ్బు న గోజన రక్షణార్థమై**
**గిరినొకకేల నెత్తెనట కృష్ణుఁడు ఛత్రముభాతి భాస్కరా!**

**తాత్పర్యం:** భాస్కరా! పరులకు మేలు కలిగించే పనిని, అది ఎంతటి కష్టమైనా సత్పురుషుడు దాన్ని జనం మెచ్చుకొనేట్లుగా నిర్వహిస్తాడు. పూర్వం ఒకప్పుడు రాళ్లవర్షం కురుస్తుండగా గోజనాలను రక్షించడానికి శ్రీకృష్ణుడు గొడుగు వలే పర్వతాన్ని చేత ధరించాడు.




సజ్జనులు పరులకు ఉపకారం చేయడానికి ఎంతటి కష్టాన్నయినా సహిస్తారు. దానికి దృష్టాంతంగా శతక కవి శ్రీమద్భాగవతంలోని ఘట్టాన్ని ఉదాహరించాడు. గోపకులు అనాదిగా ఇంద్రయాగాన్ని ప్రతి ఏటా నిర్వ హిస్తున్నారు. అయితే శ్రీకృష్ణుడు వారిని, ఇంద్రయాగం కాకుండా, పశువులకు పచ్చికను అందిస్తున్న గోవర్ధన గిరిని పూజించండని ప్రోత్సహించాడు. ఆ మాటమీద నందుని ఆధ్వర్యంలో గోపకులు ఇంద్రయాగాన్ని మాని, గోవర్ధనగిరికి పూజలు సమర్పించారు. అందుకు కోపించిన ఇంద్రుడు సంవర్తకమేఘాలను పంపి గోకులం నాశనం అయ్యేట్లు వడగండ్లవానను కురిపింపజేయసాగాడు. గోపగోపీజనం, గోవులు ఆ భీకరవర్షానికి తల్లడిల్లిపోతుండటం చూచి శ్రీకృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని పైకిలేపి ఒక్క చేతిమీద గొడుగులాగా పట్టుకొని వారికి రక్షణ కల్పించాడు. అలా ఆయన ఏడు రోజులపాటు ఆ మహాపర్వతాన్ని చేత ధరించాడు. పరుల మేలుకోసం సత్పురుషులు సదా ప్రయత్నిస్తారు.


– డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు

చిత్ర కథ

# వచ్చినవాడు ఫల్గుణుడు


కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ





రాకుమారా! పోనీ నేను యుద్ధం చేసి గోవులను విడిపిస్తాను. నువ్వు రథం నడుపు....
ఉత్తరా! ఈ జమ్మి చెట్టుపై కన్పిస్తున్న మూటను క్రిందికి దింపు. అందులో అర్జునుడి గాండీవం ఉంది. అది ఉంటే తప్ప మనం శత్రువులను ఎదుర్కోలేం.
ఆచార్యా..ఇది మృతకళేబరం.
రాకుమారా! అవి పాండవుల ఆయుధాలు. పరులకంటపడకుండా శవాకృతిని కల్పించారు. అందులో గాండీవాన్ని అందించు...
ఉత్తరుడు ఆ మూటని విప్పాడు. అందులోని ఆయుధాలు వింతగా మెరుస్తున్నాయి. బంగారు కొండచిలువలా మెరుస్తున్న ధనుస్సుని చూసి ఉత్తరుడు అదిరిపడ్డాడు. అర్జునుడు తన పేర్ల వెనక ఉన్న కథలన్నీ చెప్పాక బృహన్నలే అర్జునుడని గ్రహించాడు ఉత్తరుడు.
దేవదత్తాన్ని, గాండీవాన్ని అర్జునుడు ధరించాడు. ఇద్దరూ యుద్ధరంగం వైపు కదిలారు.
సుయోధనా! ఆ వచ్చినవాడు.. నిశ్చయంగా ఫల్గుణుడే...
పితామహా...అతడు అర్జునుడే అయితే పాండవుల ఆటకట్టు. మళ్ళీ పన్నెండేళ్ళ వనవాసం తప్పదు కదా...
గాండీవి నిజరూపంతో మన మధ్యకు వచ్చాడంటే కొంచెం విజ్ఞతతో ఆలోచించాలి. నా లెక్కప్రకారం ఈ విజయదశమితో పాండవుల అరణ్య అజ్ఞాతవాసాలు నిర్విఘ్నంగా ముగిసాయి. కనుక వచ్చినవాడు ఫల్గుణుడు. అతనితో గెలుపు అంత తేలికకాదు.
అర్జునుడు వీరవిహారం చేసి కౌరవవీరులను తరిమికొట్టి, గో గణాలను కాపాడాడు. విజయదశమి రోజున ఈ కథ విన్నవాళ్లందరికీ శుభాలు కలుగుతాయి.
శుభం
2

విశ్వదాభిరామం                    వేమన పద్యసూక్తి



# సాధనం - సాధ్యం

అనగ నన‌గ రాగ మతిశయిల్లుచు నుండు;
తినగ తినగ వేము తీయనుండు;
సాధనమున పనులు సమకూరు ధరలోన;
విశ్వదాభిరామ! వినురవేమ!

**అర్థాలు:** అనగననగన్= అంటూ అంటూ ఉంటే; అతిశయిల్లు= శ్రావ్యంగా ఉంటుంది; సాధనమున= మళ్లీ మళ్లీ అదే చేయుట; సమకూరున్= సిద్ధపడు; ధర= భూమి(లోకం).

**భావం:** లోకంలో అంటూ అంటూ ఉంటే రాగం చక్కగా వస్తుంది. తింటూ తింటూ ఉంటే వేము తీయగా ఉంటుంది. అభ్యాసం చేస్తూ ఉంటే పనులు సాధ్యపడుతూ ఉంటాయి.


**వివరణ:** సంగీతజ్ఞానం లేనివాడు మొదటిసారి రాగం పలికినపుడు భయంకరంగా ఉంటుంది. కానీ, వదలకుండా రోజూ సాధన చేస్తూ ఉంటే, కొన్నాళ్లకు ఆ రాగం చక్కగా ఆలాపించగలుగుతాడు. వేపాకు మొదటసారి తిన్నపుడు చాలా చేదుగా ఉంటుంది. అయినా, వదలకుండా మళ్లీ మళ్లీ తింటూ ఉంటే, మొదట్లో ఉన్నంత చేదు అనిపించదు. మెల్లమెల్లగా కొంతకాలానికి బాగానే ఉంది అనిపిస్తుంది. అలాగే ఏపని అయినా, మొదటసారి చేసేటపుడు చేతకాక చెడిపోతుంది. కాని, రోజూ చేస్తూ ఉంటే దానిలో మెలకువలు తెలిసి, నేర్పువస్తుంది. చేతకాదని పనిచేయడం మానగూడదు. సాధన చేసి నైపుణ్యం సాధించాలి.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

గ్రంథసమీక్ష

# శంకర విజయం

రచన- నేతి సూర్యనారాయణశర్మ, పేజీలు- 360; సైజు- 1/8 డెమ్మీ; వెల- 350 (పోస్టల్ ఛార్జీలు అదనం); ప్రతులకు- 9951748340




ఆదిశంకరుని జీవితకథను శంకర విజయం అని పిలుస్తారు. నవలగా రూపొందించిన ఈ శంకర విజయం నూతనమైన కల్పనలెన్నింటినో సృజించింది. నేటివరకూ వచ్చిన అన్ని శంకర విజయాలలోని మేలిమి అంశాలనూ తనలో పొదువుకుంది. మూలకథను ఏమాత్రం మార్చకుండానే కొత్తదృష్టిని అలవరిచింది. శంకరుల ఉపనిషత్, భగవద్గీత, బ్రహ్మసూత్ర, సనత్సుజాతీయ భాష్యాల సారాంశాన్ని కూడా పాత్రల మధ్య సంభాషణలుగా ఉపయోగిస్తూ సామాన్యులకు అర్థమయ్యేభాషలో వివరించింది. శంకరునికి సంబంధించిన అన్ని ముఖ్యాంశాలనూ కథనంలో ఒదిగించి అందించడం ఈ పుస్తకానికి మరింత వన్నె తెచ్చింది.

ముఖ్యంగా మంత్ర, యోగ, కర్మ, వేదాంతాది వివిధ శాస్త్రాలస్వరూపం, వాటి ప్రయోజనం మొదలైన అంశాలను కళ్లకు కట్టినట్లుగా వర్ణించడంలో రచయిత ప్రతిభ కనిపిస్తుంది. దీనిలోని సన్నివేశకల్పనలు పాఠకుడిని కట్టిపడేస్తాయి. సామాన్యుల అవగాహనకు ఏమాత్రం ఇబ్బంది రానివ్వకుండా, అలాగని పండితులకు ఎంత మాత్రం ఆశాభంగం కలిగించకుండా సాగిన రచన ఇది.

అద్వైతస్థాపనకోసం శంకరుడు నెలకొల్పిన మఠాల చరిత్రనూ ఈ పుస్తకం వెల్లడిస్తుంది. మనస్సును ప్రతి అక్షరంలోనూ రంగరించి కూర్చిన ఈ రమణీయకావ్యం ముందుతరాలకు పాఠ్యగ్రంథమవుతుంది. పాఠకుల మనఃఫలకాలపై చిరస్థాయిగా నిలిచిపోతుంది. శంకర సాహిత్యాన్ని రసవంతమైన తెలుగులో అనువదిస్తున్న నేతి సూర్యనారాయణశర్మ కలం మరిన్ని విశిష్టరచనలను జాతికి అందించాలి.

- డి.వి.ఆర్. భాస్కర్

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### బ్రహ్మమానసపుత్రులు

| | | | | |
|---|---|---|---|---|
| 01) సనకుడు | 06) మరీచి | 11) క్రతువులు | 16) నారదుడు | 21) ఉత్తమ మనువు |
| 02) సనందనుడు | 07) అత్రి | 12) వసిష్ఠుడు | 17) ప్రద్యుమ్నుడు | 22) తామసమనువు |
| 03) సంతనుడు | 08) అంగిరసులు | 13) కపిలుడు | 18) అనిరుద్ధుడు | 23) దైవతమనువు |
| 04) సనత్కుమారుడు | 09) పులస్త్యుడు | 14) వాసుదేవుడు | 19) స్వాయంభువమనువు | 24) చాక్షుషమనువు |
| 05) సనత్సుజాతుడు | 10) పులహుడు | 15) సంకర్షణుడు | 20 స్వారోచిషమనువు | 25) వైవస్వతమనువు |

## చెప్పుకోండి చూద్దాం!

1) కాళ్లు, చేతులు ఉన్నా నడవలేనిది. ఏంటో తెలుసా?

2) పందిరంతా పాకే పాదు... కడుపేమో చేదు... చెప్పుకోండి చూద్దాం?

3) చూస్తే ఒకటి, చేస్తే రెండు... తలకు తోకకు ఒకటే టోపీ... ఏంటో తెలుసా?

4) ఆకారం గజిబిజి, తింటే కరకర. ఏంటో చెప్పుకోండి చూద్దాం?

జవాబు: 1)కుర్చీ 2)కాకరకాయ 3)కలం 4)జంతిక

## రాయగలరా?

ఇక్కడున్న ఆధారాల సాయంతో గడులను సరైన అక్షరాలతో నింపండి. అర్థవంతమైన పదాలు వస్తాయి.

| | | | |
|---|---|---|---|
| 01) నది దాటించేది | _ _ _ న | 06) స్త్రీ | _ _ _ న |
| 02) పైకి తీసుకెళ్లేది | _ _ _ న | 07) వాస్తవం కానిది | _ _ _ న |
| 03) సముద్రంలో వచ్చేది | _ _ _ న | 08) పోలిక | _ _ _ న |
| 04) ......... చల్లారింది! | _ _ _ న | 09) ఉపశమనం | _ _ _ న |
| 05) నటులు చేసేది | _ _ _ న | 10) అభ్యాసం | _ _ _ న |

జవాబు:

01)వంతెన 06)లలన

02)నిచ్చెన 07)కల్పన

03)ఉప్పెన 08)పొంతన


04)చప్పన 09)సాంత్వన

05)నటన 10) సాధన

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...

ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...



# క్విజ్ 03

01) గురుపరంపరలో కడపటిఆచార్యులు? జ)............
02) యతీంద్రప్రవణులు అని ఎవరికి పేరు? జ)............
03) అభిరామవరాధీశ అని ఎవరినంటారు? జ)............
04) రామానుజపొన్నడి అని ఎవరికి పేరు? జ)............
05) యతిరాజవింశతి కర్త? జ)............
06) తిరువాయ్‌మొళి పిళ్లె శిష్యుడు? జ)............
07) గురువుగారి కోరిక మేరకు శ్రీరంగం వెళ్లిన శిష్యుడెవరు? జ)............
08) పెరియాళ్వార్ తిరుమొళికి వ్యాఖ్యానం రాసినవారు? జ)............
09) 'ఆర్తిప్రబంధం' కర్త? జ)............
10) శ్రీరంగంలో ఒక సంవత్సరం పాటు ఉపన్యాసమిచ్చిన వారు? జ)............
11) శ్రీవైష్ణవవ్యాప్తికి ఎనిమిదిమఠాలను స్థాపించింది? జ)............
12) 'జ్ఞానసారం' అన్న గ్రంథానికి వ్యాఖ్యానాన్ని ప్రసాదించింది? జ)............
13) వరయోగి అన్న మరోపేరు ఎవరికుంది? జ)............
14) శ్రీరంగంలో 'ముప్పత్తాయిరప్పడి'ని వ్యాఖ్యానించినవారు? జ)............
15) శ్రీవచనభూషణానికి వ్యాఖ్య రాసినవారెవరు? జ)............
16) శ్రీరంగక్షేత్రాన్ని పూర్వస్థితికి తెచ్చిన వారెవరు? జ)............
17) విశద వాక్‌శిఖామణి అని ఎవరికి పేరు? జ)............
18) శిక్కిల్‌కిడారం నుంచి ఆళ్వారు తిరునగరికి వచ్చిన వారెవరు? జ)............
19) రామానుజులు తర్వాత 200 సంవత్సరాలకు జన్మించిన ఆచార్యులెవరు? జ)............
20) శ్రీవైష్ణవవ్యాప్తికోసం ఎనిమిదిమందిశిష్యుల్ని నియమించుకున్న వారెవరు? జ)............

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించిన స్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందానమోదు సంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-10-2022.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధాన సంపాదకులవారి కార్యాలయంలో పని చేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరిమాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధానపత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి పట్టుకోండి.

చందాసంఖ్య: ............ వయస్సు: ............
పాఠశాల: ............ తరగతి: ............
పేరు: ............
చిరునామా: ............
............
............
............ పిన్‌కోడ్: ............
ఫోను నెంబరు: ............

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం-** ధైర్యం, చాకచక్యం చూపించి ప్రయత్నించిన కార్యాలలో జయం సాధిస్తారు. ఆకస్మికంగా అదృష్టం వరిస్తుంది. దూరప్రాంతాలలో చదువులకు మార్గం సుగమమౌతుంది.

**వృషభం-** వాక్కును అదుపులో ఉంచడం అవసరం. శ్రమలేకుండా పనులన్నీవాటంతటవే నెరవేరుతాయి. సంతానం విద్యారంగంలో ముందంజ వేయడం ఆనందాన్ని కల్గిస్తుంది.

**మిథునం-** ఆకస్మికధనలాభం. ఇంటిని కొనుగోలు చేయాలనే ఆలోచన సాకారమౌతుంది. అధికధనవ్యయం. మాతృవర్గంవారికి సుఖసంతోషాలు. చిత్తశుద్ధితో చేసిన పనులు అనుకూలమౌతాయి.

**కర్కాటకం-** వృత్తినైపుణ్యంతో సమాజంలో ముందుకు దూసుకుపోతారు. ఎన్ని సమస్యలున్నా వాటికి పరిష్కారం లభిస్తుంది. గురుబలం పుష్కలంగా ఉంది. ధైర్యంతో చాకచక్యంగా వ్యవహరిస్తారు.

**సింహం-** కొత్తగా గృహవాహనాదులు కొనుగోలు చేస్తారు. వృత్తివ్యాపారాలు కలిసి వస్తాయి. వ్యవసాయదారులకు అనుకూలం. ధైర్యంతో సమస్యలను పరిష్కరించుకుంటారు.

**కన్య-**పితృవర్గంలో ఆరోగ్యలోపం. కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. సంపాదన మార్గాలు మెరుగవ్వడంతో బాటు ధనము ఖర్చుచేస్తారు. కళత్ర ఆరోగ్యం కుదుటపడుతుంది. స్పష్టత చేకూరుతుంది. వాగ్ధాటి అమోఘంగా ప్రదర్శించి అందరి మన్ననలు పొందుతారు.

**తుల-** తెలివితేటలున్నా సమయస్ఫూర్తి లేకపోవడంవల్ల ఇతరులతో జగడాలకు దిగే అవకాశం ఉంది. సంయమనం పాటించడం అవసరం. గ్రహస్థితి సామాన్యం. గౌరవానికి, ధనానికి లోటులేదు. దైవానుగ్రహం కల్గుతుంది.

**వృశ్చికం-** ఆరోగ్యం బాగుపడి అన్నిరకాల రుగ్మతలు తొలగుతాయి. స్వచ్ఛమైన నిర్మలమైన ఆలోచనలువస్తాయి. సమస్తదోషాలు తొలగి సకలైశ్వర్యాలు కలుగుతాయి. కొత్తవ్యాపారాలకు శ్రీకారం చూడతారు.

**ధనుస్సు-** గృహనిర్మాణాలు కలసి వస్తాయి. ఆర్థికంగా ముందంజ వేస్తారు. వృత్తివ్యాపారాలు కలసి వచ్చే సమయం. గ్రహస్థితి అనుకూలం.

**మకరం-** హనుమాన్‌చాలీసా, ఆంజనేయ సంబంధస్తోత్రాలు పఠించడంవల్ల కార్యసిద్ధి కలుగుతుంది. గ్రహప్రభావాలు క్రమేపీ అనుకూలమౌతాయి. దుర్గామాతను ప్రార్థిస్తే కష్టాలనుండి గట్టెక్కుతారు.

**కుంభం-** శ్రీవేంకటేశ్వరుని ఆరాధన ఉత్తమ ఫలితాల్నిస్తుంది. వృత్తివ్యాపారాలు అనుకూలిస్తాయి. రక్తపోటు, మధుమేహంలాంటి దీర్ఘకాలికవ్యాధులను అదుపులో ఉంచగల్గుతారు.

**మీనం-**గురుసంబంధ అనుగ్రహం కల్గుతుంది. నూతన విషయాలను నేర్చుకోవడంలో శ్రద్ధ చూపుతారు. శరీరఆరోగ్యం బాగుంటుంది. వృత్తివ్యాపారాలలో లాభాలు కల్గుతాయి. సంతానం విద్యావిషయాల్లో ముందంజ వేస్తారు. కళత్ర ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పని సరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐☐

**2. కావలసిన భాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సర చందా : ☐ రూ.240/-**

జీవిత చందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. చందా పునరుద్ధరణ :**

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 81

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | ■ | 3 | 4 | ■ | 5 |
| 6 | ■ | | ■ | 7 | ■ | | ■ | |
| 8 | | ■ | 9 | | | ■ | 10 | |
| | ■ | 11 | ■ | | ■ | 12 | ■ | |
| ■ | 13 | | | ■ | 14 | | | ■ |
| 15 | ■ | | ■ | 16 | ■ | | ■ | 17 |
| 18 | | ■ | 19 | | | ■ | 20 | |
| | ■ | 21 | ■ | | ■ | 22 | ■ | |
| ■ | ■ | 23 | | | ■ | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)సరస్వతి(3); 3)వైవస్వత మనువుకూతురు(2); 8)దక్షుని కూతురు. ధర్ముని భార్య. విశ్వదేవతల తల్లి(2); 9)ఇతని కోరికపై శ్రీరామ చంద్రుడు భద్రాచలంలో వెలిశాడు(3); 10)సుగ్రీవుని భార్య(2); 13)విశ్వామిత్రుడు సృజించిన మంత్రం(3); 14)పిల్లన గ్రోవి(3); 18)జనని(2); 19)గరుత్మంతుని తల్లి(3); 20)అగ్రజుడు తమ్ముళ్ళకు ఏమౌతాడు?(2); 23)సహదేవుని భార్య(3)

### నిలువు

1)'భారతి'-ఈ పదంలో మన్మధుని భార్య(2); 4)విష్ణువు భార్య(2); 5)దుర్యోధనుని భార్య(4); 6)యమధర్మరాజుతో పోట్లాడి తన భర్తయైన సత్యవంతుణ్ణి కాపాడుకొన్న స్త్రీ(3); 7)కశ్యపుని భార్య. ఈమె నాగ మత(3); 11)మేరువు కుమార్తె. ఈమె ధాత భార్య(3); 12) జమదగ్ని భార్య(3); 15)ఈ రాజు 12 సం॥రాలు నేతితో యాగం చేయుట వల్ల అగ్నికి మాంద్యము కల్గింది(3); 16)అత్రిముని భార్య(4); 17)శ్రీవేంకటేశ్వరునిపై శృంగార, భక్తి కీర్తనలు వ్రాసిన వాగ్గేయకారుడు(4); 21)కవిత్వం చెప్పేవాడు(2); 22)శ్రీరాముని భార్య(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

## తిరుమల తిరుపతి దేవస్థానములు

19-08-2022న తి.తి.దే. గోసంరక్షణశాలలో, శ్రీవేంకటేశ్వర సప్తగోప్రదక్షిణమందిరంలో ఘనంగా నిర్వహించిన **గోపూజ మహోత్సవాలు, గోకులాష్టమి** వేడుకల దృశ్యాలు. ఈ కార్యక్రమాలలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీ పి.అశోక్‌కుమార్, శ్రీ ముట్టంశెట్టి రాములు, చెన్నై స్థానిక సలహామండలి అధ్యక్షులు శ్రీ శేఖర్‌రెడ్డి, ఎస్.వి.గోసంరక్షణ కమిటీ సభ్యులు శ్రీరామ్‌సునీల్‌రెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదాభార్గవి, ఐ.ఏ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.










SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-09-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

